సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 140
గురువారం 10-8-2017
SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



టాటా మోటార్స్‌లో లేని వేగం

జూన్ క్వార్టర్ కన్సాలిడేటెడ్ లాభంలో 41%వృద్ధి. 3,200 కోట్లకు చేరిక -బిజినెస్‌లో



క్షిపణి దాడి చేస్తాం

అమెరికాకు ఉ.కొరియా హెచ్చరిక... హద్దులు దాటొద్దు.. ట్రంప్ - ఫుల్‌అవుట్ IVలో

నా గుండెల్లో నంద్యాల

బుధవారం నంద్యాల మండలం రైతునగరంలో రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి



నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం: వైఎస్ జగన్ హామీ

- ఇది ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధం
- నంద్యాల ప్రజలు న్యాయంవైపు నిలబడాలి
- వైఎస్సార్‌సీపీ పోటీ పెట్టబట్టే రోడ్లపైకి సీఎం, మంత్రులు
- కొనుగోలు చేసిన ఎమ్మెల్యే స్థానాల్లో అభివృద్ధి లేదు..
- ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చలేదు..
- గుండ్రేవుల ప్రాజెక్టు, సిద్ధేశ్వరం అలుగు ఏమయ్యాయి?
- రాబోయే కురుక్షేత్ర సంగ్రామానికి నంద్యాలే నాంది
- బాబు మాదిరిగా అబద్ధాలు, మోసాలు నావల్ల కాదు
- ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ప్రతిపక్షనేత రోడ్ షో

"చంద్రబాబు మాదిరిగా నా దగ్గర డబ్బుల మూటలు, పోలీసు బలగం, సీఎం పదవి లేవు. జగన్ అబద్ధం ఆడడు. జగన్ మోసం చేయడు. జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు.. అన్న విశ్వసనీయ రాజకీయాలే నా బలం. నంద్యాల ప్రజలు న్యాయం వైపు నిలబడాలి. నంద్యాలను నా గుండెల్లో పెట్టుకుంటా. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా నంద్యాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తా. నంద్యాలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతా.

- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

7లో

ఊరూ వాడా ఏకం..

జననేతకు బ్రహ్మరథం

- వైఎస్ జగన్ రాక కోసం ఊరూరా వేచి ఉన్న జనం
- హారతి పడుతూ అభిమానం చాటుకున్న ప్రజానీకం
- తోబుట్టువుల్లా రాఖీలు కట్టిన మహిళలు



1942లో డూ ఆర్ డై..
2017లో చేద్దాం.. చేసి చూపిద్దాం!

- నవభారత నిర్మాణానికి ఇదే నినాదం
- 75 ఏళ్ల క్విట్ ఇండియాపై లోక్‌సభలో చర్చలో మోదీ
- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు చీకటి శక్తుల కుట్ర: సోనియా
- అప్పుడు భారత్ ఛోడో.. ఇప్పుడు భారత్ జోడో: స్పీకర్
- సుదృఢ భారతావనికి ఉభయసభల తీర్మానం

- ఫుల్‌అవుట్ IVలో

ప్రకాశం జిల్లా నెమలిగుండ్ల వద్ద గుండ్లకమ్మ వాగులో చిక్కుకున్న పెళ్లి బృందాన్ని రక్షిస్తున్న సహాయక సిబ్బంది



వరుణుడి కరుణ

- వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు
- నేడు, రేపు కోస్తా, రాయలసీమలో జల్లులు
- 12, 13 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- భారత వాతావరణ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 12, 13 తేదీల్లో విస్తారంగా, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా జల్లుల నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, శని, ఆదివారాల్లో విస్తారంగా, అక్కడక్కడా భారీ నుంచి

మిగతా 3వ పేజీలో ▶

గిరిజనుల నుంచి చాలా నేర్చుకోవాలి

- తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్
- నాకు సహకరిస్తే మీకన్నీ చేసిపెడతా: చంద్రబాబు
- అరకులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గిరిజన సాంప్రదాయ కొమ్ము పాగాలు ధరించిన గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం

ప్రకృతి సంపదతో తులతూగే గిరిజనులు నిజంగా అదృష్టవంతులని, వారి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. ఏజెన్సీ వాసులతో పోలిస్తే నగర వాసులే పేదరికంలో ఉన్నారని చెప్పారు. విశాఖ జిల్లా అరకు ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య, ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన

మిగతా 2వ పేజీలో ▶

మరాఠాల 'మిలియన్ మార్చ్'!

రిజర్వేషన్ల డిమాండ్‌తో ముంబైలో భారీ ర్యాలీ

- హాజరైన లక్షలాది ఉద్యమకారులు
- వెంటనే స్పందించిన 'మహా' ప్రభుత్వం.. ఉపకారవేతనాలు ఇచ్చేందుకు అంగీకారం

ముంబై: విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సహా పలు డిమాండ్లతో మరాఠా ప్రజలు చేపట్టిన భారీ ర్యాలీతో దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరం బుధవారం కాషాయ సంద్రమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది మరాఠా ప్రజలు కాషాయ టోపీలు పెట్టుకుని, అదేరంగు జెండాలు పట్టుకుని ముంబైలో 'మరాఠా క్రాంతి మోర్చా' పేరుతో మౌన ప్రదర్శన నిర్వహించారు. గట్టి భద్రత మధ్య బైకుల్లాలోని జీజామాత ఉద్యానవనం నుంచి ర్యాలీ ప్రారంభమై ఆజాద్ మైదానం వద్ద ముగిసింది. ఉద్యమంలో రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకించిన

మిగతా 2వ పేజీలో ▶



అదృష్టం కలిసొచ్చి..

- రెబల్ ఎమ్మెల్యేల పొరపాటు వల్లే కాంగ్రెస్ అభ్యర్థి పటేల్ గెలుపు

- ఫుల్‌అవుట్ IVలో



58 ఏళ్లకే రిటైరైన ఉద్యోగులకు ఊరట

- 60 ఏళ్లు దాటకపోతే మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఇప్పటికే వయసు దాటి ఉంటే ఆర్థిక ప్రయోజనం కల్పించాలి
- ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై చర్యలు

- వివరాలు 6లో

ప్రాణం తీసిన పరుగు పందెం

- మూడోస్థానం సాధించి కుప్పకూలిన విద్యార్థి
- కర్నూలు జిల్లా గూడూరు జెడ్పీ హైస్కూలులో ఘటన

- వివరాలు 12లో

@ysjagan

స్ఫూర్తిమంతమైనది క్విట్ ఇండియా ఉద్యమం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తించారు. యావత్ భారతావనికి ఇది నిరంతరం స్ఫూర్తిని ఇస్తోందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ట్విటర్‌లో స్పందించారు. ఆయన చేసిన ట్వీట్ ఇది.

Tweets Tweets & replies Media

YS Jagan Mohan Reddy

" 75 ఏళ్ళ క్విట్ ఇండియా
ఉద్యమానికి భారతీయుడిగా
శాల్యూట్ చేస్తున్నా !

ఆ ఉద్యమం నిరంతరం స్ఫూర్తి
ఇస్తూనే ఉంటుంది.
ఇప్పుడు మనమంతా– మోసగాళ్ళారా
దోపిడి పాలకులారా, ప్రజా వంచకులారా
క్విట్ ఏపీ అని ఉద్యమించాల్సిన
సమయం వచ్చింది. "

ప్రతిభగల క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్

సాక్షి, అమరావతి: ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం 2% రిజర్వేషన్లు కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రమణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విభాగాలు, ఎయిడెడ్ సంస్థల్లోని ఉద్యోగాలకు రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న గవర్నర్



గవర్నర్ నరసింహన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): గవర్నర్ నరసింహన్ బుధవారం విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. మహా మండపం ద్వారా కొండపైకి చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో సూర్యకుమారి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజ అనంతరం గవర్నర్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా.. ఈవో సూర్యకుమారి అమ్మవారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.



బుధవారం 'మరాఠా క్రాంతి మోర్చా' అనంతరం ముంబైలోని ఆజాద్ మైదానానికి భారీ సంఖ్యలో చేరుకున్న మరాఠా సమాజం ప్రజలు

మరాఠాల 'మిలియన్ మార్చ్'!

▶ మొదటి పేజీ తరువాయి

మరాఠాలు తమ ర్యాలీకి మద్దతుగా శివసేన పార్టీ కట్టిన బ్యానర్లను చించేశారు. 12 కోట్ల జనాభా కలిగిన మహారాష్ట్రలో మరాఠాలు 35 శాతం ఉన్నారు. దాదాపు 10 లక్షల మంది బుధవారం నాటి ర్యాలీలో పాల్గొని ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా నగరంలోని కొన్ని మార్గాల్లో వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. అటు రాష్ట్ర శాసనసభలోనూ మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ అధికార, విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన నిర్వహించారు. సభ 45 నిమిషాల్లో మూడు సార్లు వాయిదా పడింది. భారీ ర్యాలీతో వెంటనే దిగొచ్చిన మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం...మరాఠా సమాజం నాయకులు, ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అసెంబ్లీలో మాట్లాడుతూ విద్యా సంస్థల్లో ప్రస్తుతం ఓబీసీలకు 605 కోర్సుల్లో ఇస్తున్న ఉపకారవేతనాలు, సౌకర్యాలను మరాఠా విద్యార్థులకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, బీసీలకు ఉన్నట్లుగానే మరాఠా విద్యార్థులకు హాస్టళ్లు నిర్మించేందుకు ప్రతి జిల్లాలోనూ అవసరమైన భూమిని, రూ.5 కోట్ల నిధిని ఇస్తామన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని బీసీ కమిషన్ పరిశీలిస్తుందన్నారు. మరాఠాల కోసం ఉద్దేశించిన వివిధ పథకాల అమలును సమీక్షించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తామని ఫడ్నవిస్ శాసనసభలో ప్రకటించారు. కొపర్డి అత్యాచారం కేసులో దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామనీ, నిందితుల తరపు న్యాయవాదులు కేసు విచారణను ఆలస్యం చేయాలని చూస్తున్నారని ఆయన అన్నారు. అలాగే మూడు లక్షల మంది మరాఠా విద్యార్థులకు అన్నాసాహెబ్ పాటిల్ అభివృద్ధి సంస్థ ద్వారా నైపుణ్య శిక్షణను అందిస్తామనీ, రూ.10 లక్షలలోపు విద్యారుణాలు తీసుకునేవారికి వడ్డీలో రాయితీ కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఏడాదిలో 58వ ర్యాలీ

గత ఏడాది కాలంలో మరాఠా ప్రజలు చేపట్టిన 58వ ర్యాలీ ఇది. 2016 జూలైలో అహ్మద్‌నగర్ జిల్లాలోని కొపర్డి అనే గ్రామంలో 14 ఏళ్ల మరాఠా బాలికపై సామూహిక హత్యాచారం జరిగింది. ఈ కేసులో దోషులకు కఠిన శిక్ష పడాలని కోరుతూ ఔరంగాబాద్‌లో గతేడాది ఆగస్టు 9న తొలిసారి మరాఠా ప్రజలు ర్యాలీ నిర్వహించారు. అప్పటి నుంచి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఎస్సీ,ఎస్టీలపై దురాగతాల నివారణ చట్టానికి సవరణలు, రైతు రుణమాఫీ, పంటలకు మద్దతుధర కల్పించడం తదితర డిమాండ్లపై మరాఠా ప్రజలు ఉద్యమిస్తూనే ఉన్నారు. సకల మరాఠా సమాజ్ అనే సంస్థ వివిధ మరాఠా సంఘాలను ఒకచోట చేర్చి ఈ ర్యాలీలను నిర్వహించింది.



ముంబై నగరంలో భారీ ర్యాలీగా వెళ్తున్న మరాఠాలు

మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు 4,016 ఇళ్లు

- వీటిలో 3,820 ఇళ్లు అపార్ట్‌మెంట్ రూపంలోనే
- సీఆర్‌డీఏ సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: అమరావతిలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస వసతితోపాటు ఐఏఎస్, గజిటెడ్, నాన్‌గజిటెడ్ అధికారుల కోసం 4,016 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం రాత్రి సీఎం చంద్రబాబు అధ్యక్షతన 11వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశం జరిగింది. ప్రభుత్వ గృహ నిర్మాణం, విద్యా, వైద్య సంస్థలు, పర్యాటకం, పనుల పురోగతిపై చర్చించారు. ప్రభుత్వ అవసరాల కోసం నిర్మించ తలపెట్టిన మొత్తం 4,016 ఇళ్లల్లో 3820 ఇళ్లను బహుళ అంతస్తుల భవంతులుగా నిర్మించాలని నిర్ణయించారు. దీనిపై సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ హౌసింగ్ ప్రాజెక్టుకు మొత్తం రూ.1991 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సేకరించే నిధులను తిరిగి చెల్లించేందుకు సీఆర్‌డీఏ స్వయం సమృద్ధి సాధించాలని సీఎం ఆదేశించారు. జర్నలిస్టులకు నిర్మించే బహుళ అంతస్తుల భవనాల గురించి సీఎం తెలుసుకున్నారు. అలాగే, సీఆర్‌డీఏ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా నగరం మధ్యలో సరైన స్థలాన్ని గుర్తించాలన్నారు. అమరావతిలో ఒక రహదారిని ఫార్ములా వన్ రోడ్‌గా నిర్మించాలని సీఆర్‌డీఏకు సూచించారు. రాజధానిలో 2018 చివరి కల్లా 2 లక్షల మంది జనాభా అవసరాలకు తగినట్టుగా గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు.

అమరావతిలో బ్రిటిష్ జియో సర్వే

బ్రిటిష్ జియోలాజికల్ సర్వే (బీజీఎస్)తో సీఆర్‌డీఏ బుధవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో సీఆర్‌డీఏ, బీజీఎస్ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేసుకున్నారు. ఆసియన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ హబ్ ఫర్ అర్బన్ జియో సైన్స్ ప్రాజెక్టులో భాగంగా కౌలాలంపూర్, హనోయ్ నగరాలతోపాటు అమరావతిలో కూడా బీజీఎస్ సర్వే చేయనుంది.

గిరిజనుల నుంచి చాలా నేర్చుకోవాలి

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. ప్రకృతి అందాలతో అలరారే అరుకు.. నవ్య అరుకుగా నాంది పలకాలని ఆకాంక్షించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు వీలుగా అరుకులో శాశ్వత ప్రాతిపదికన క్రాఫ్ట్ బజార్, నేచర్ క్యూర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని నగరాల్లోనూ అరుకు ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా అరుకు షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మీ కోసమే బాక్సైట్‌ను ఆపాం..

గిరిజనుల మనోభావాలను గౌరవించి ఏజెన్సీలో అపారంగా ఉన్న బాక్సైట్ నిక్షేపాల తవ్వకాలను నిలిపివేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'విశాఖ ఏజెన్సీకి మళ్లీ మళ్లీ వస్తా.. మీ సంక్షేమం కోసం కావాల్సినవన్నీ నేను చేసిపెడతా.. నాకు మీరు సహకరించండి.. అండగా నిలవండి' అని అభ్యర్థించారు. అరుకులో మీరు ఉత్పత్తి చేసే వస్తువులను దేశంలోని ఇతర నగరాలకే కాదు.. విదేశాలకు కూడా ఎగుమతి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పీపీపీ పద్ధతిలో రూ.110 కోట్లతో అరుకు ఎకో టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేస్తామని, లంబసింగి, డల్లాపల్లిలలో రూ.5 కోట్లతో ఫారెస్ట్ రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖ నుంచి అరుకుకు హెలీటూరిజం ప్లాన్ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద సెటిల్‌మెంట్ పట్టాలు ఇస్తామని తెలిపారు. అరుకులో అపరల్ పార్క్ ఏర్పాటు చేస్తామని, మెడికల్ హెల్త్ హబ్‌గా, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని, థింసా నృత్యాన్ని టూరిజంలో ప్రమోట్ చేస్తామన్నారు. ఏపీటీడీసీ ద్వారా అరుకులో బెలూన్ ఫెస్టివల్, ఎల్లో ఫ్లవర్ ఫెస్టివల్, వాటర్‌ఫాల్స్ ఫెస్టివల్, ట్రైబల్ ఫెస్టివల్, వెంచర్ టూరిజం ఫెస్టివల్ ఇలా ఏటా ప్రతి నెలా ఏదో ఉత్సవం ఏజెన్సీలో నిర్వహించేలా పర్యాటక క్యాలెండర్‌ను రూపొందిస్తామని వెల్లడించారు. అంతకు ముందు రూ.264.30 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గిరిజనులతో కలసి సీఎం, గవర్నర్‌లు థింసా నృత్యం చేశారు. రాష్ట్ర మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, కమిషనర్ పద్మ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ జి.సృజన ఐటీడీఏ పీవో రవి పట్టంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ కర్ర కొనేందుకు ప్రైవేటు వ్యాపారులకూ అనుమతి

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: సుబాబుల్, జామాయిల్, సరుగుడు కర్ర కొనేందుకు పేపర్ మిల్లులతోపాటు ప్రైవేటు వ్యాపారులకూ అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ పేపర్ మిల్లులదే గుత్తాధిపత్యం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్టు వివిధ జిల్లాల కలెక్టర్లకు రైతులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనర్ తెలిపారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు రైతులు నేరుగా ఫిర్యాదుచేశారు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకువస్తూ ప్రైవేటు వ్యాపారులను అనుమతించాలని సిఫార్సుచేశారు. ఈ సూచనను పరిశీలించిన ప్రభుత్వం అందుకు అనుమతిచ్చింది. కొనుగోళ్లకు సంబంధించి గతేడాది ఫిబ్రవరి 19న జారీచేసిన మార్గదర్శకాలే ప్రైవేటు వ్యాపారులకూ వర్తిస్తాయని పేర్కొంది.

డిప్యూటీ కలెక్టర్.. పీవీ సింధు

- విధుల్లో చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి
- శిక్షణ కోసం కృష్ణా జిల్లాకు కేటాయింపు



అధికారుల నుంచి తాజాగా నియామక పత్రం అందుకుంటున్న సింధూ

సాక్షి, అమరావతి: బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలో ఆమె బుధవారం శుభగడియల్లో విధుల్లో చేరారు. సీసీఎల్‌ఏ అనిల్ చంద్ర పునేఠా సెలవులో ఉండటంతో సీసీఎల్‌ఏ జాయింట్ కమిషనర్ జగన్నాథం, సీసీఎల్‌ఏ కార్యదర్శి రామారావులకు ఆమె జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన సింధును డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన రోజే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమెకు నియామక పత్రాన్ని అందజేసిన విషయం విదితమే. సీసీఎల్‌ఏకు వచ్చిన సందర్భంగా అక్కడి ఉద్యోగులు సింధుకు ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ కలెక్టర్‌గా నియమించడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా సింధు పేర్కొన్నారు. గోపీచంద్ అకాడమీలో మంచి శిక్షణ పొందుతున్నానని, రాబోయే ప్రపంచ చాంపియన్ షిప్‌లో విజయం సాధిస్తానని సింధు ధీమా వ్యక్తం చేశారు. సింధు విజ్ఞప్తి మేరకు సీసీఎల్‌ఏ అధికారులు ఆమెను శిక్షణ నిమిత్తం కృష్ణా జిల్లాకు కేటాయించారు. కృష్ణా జిల్లా కలెక్టరు బి.లక్ష్మీకాంతంకు బుధవారం సాయంత్రం రిపోర్టు చేశారు. సింధు వెంట ఆమె తండ్రి రమణ ఉన్నారు. డిప్యూటీ కలెక్టర్ విధులు, బాధ్యతలపై ఆమె కృష్ణా జిల్లాలో శిక్షణ పొందనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

సింధుకు వైద్య ధృవీకరణ పత్రాలు

విధుల్లో చేరే ముందు పీవీ సింధుకు వైద్యవిద్యా సంచాలకులు వైద్య ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాలంటే నిబంధనల ప్రకారం మెడికల్ బోర్డు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. అందువల్ల సింధు బుధవారం తన తండ్రితో కలసి వైద్యవిద్యా సంచాలకుల కార్యాలయానికి వచ్చింది. ఆమెకు వైద్య విద్య సంచాలకులు డా.ఎన్.సుబ్బారావు, అకడెమిక్ వైద్యవిద్యా సంచాలకులకు డా.కె.బాబ్జీ సాదర స్వాగతం పలికారు. సింధుకు సిద్ధార్థ వైద్య బృందం పరీక్షలు చేశారు.

జగన్ దిష్టిబొమ్మల దహనానికి డ్వాక్రా మహిళలపై ఒత్తిళ్లు

అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి బెదిరింపులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసే కార్యక్రమాల్లో పాల్గొనాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు తమ నియోజకవర్గాల్లో డ్వాక్రా మహిళలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విమర్శలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాల్లో చేపట్టే ర్యాలీల్లో పాల్గొనాలని.. లేనిపక్షంలో భవిష్యత్‌లో బ్యాంకు లోన్లు తీసుకోవడంలో ఇబ్బంది పడాల్సి ఉంటుందని అధికార పార్టీ ఎమ్మెల్యేలు హెచ్చరికలు చేస్తున్నట్టు గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పలువురు డ్వాక్రా సంఘాల మహిళా నేతలు 'సాక్షి' కార్యాలయానికి సమాచారమిచ్చారు.



అంతర్రాష్ట్ర బదిలీల్లో అందరికీ అవకాశం కల్పించాలి

యూటీఎఫ్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఏపీ, తెలంగాణ నుంచి బదిలీలు కోరుకునే వారందరికీ అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. కేవలం స్పౌజ్, పరస్పర అంగీకార బదిలీలకు మాత్రమే అవకాశం ఇవ్వడం వల్ల కుటుంబంలో ఒక్కరే ఉద్యోగం చేస్తున్నవారికి అవకాశం రాదని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి తెలిపారు. నిబంధనలు లేకుండా బదిలీల అవకాశం అందరికీ కల్పించాలని వారు కోరారు.

డీఈవో పూల్ టీచర్లకు నియామక ఉత్తర్వులు

రాష్ట్రంలోని పాఠశాలల్లో ఖాళీలులేక డీఈవో పూల్లో ఉన్న టీచర్లకు నియామక ఉత్తర్వులు జారీచేస్తూ ఆదేశాలు జారీఅయ్యాయని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షణ్ముగ్మూర్తి, సుధీర్‌బాబు పేర్కొన్నారు. బదిలీలు, రేషనలైజేషన్ తదుపరి మిగిలిన ఖాళీల్లో వీరిని వర్క్ ఎడ్జెస్ట్‌మెంటు ద్వారా నియమించాలని ఉత్తర్వులు జారీ అయినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల ఎత్తివేత!

- విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయం
- బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక యాప్‌లు



సాక్షి, అమరావతి: ప్రతి నెలా వచ్చే కరెంట్ బిల్లును ఇప్పటి వరకూ దగ్గర్లోని వసూలు కేంద్రాల్లో వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఇక నుంచీ ఈ అవకాశం ఉండదు. ఎందుకంటే బిల్ కలెక్షన్ సెంటర్లను ఎత్తివేయబోతున్నారు. నెలవారీ కరెంట్ బిల్లులు డిజిటల్ పద్ధతిలోనే చెల్లించాలి. ఇందుకోసం డిస్కమ్‌లు ప్రత్యేకంగా యాప్‌లు అందుబాటులోకి తెస్తాయి. విజయవాడలోని విద్యుత్ సౌధలో బుధవారం జరిగిన విద్యుత్ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు త్వరలో విద్యుత్ అధికారులు ప్రచార కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్, జేఎండీ దినేశ్ పరుచూరి, డిస్కమ్‌ల సీఎండీలు హెచ్‌వై దొర, నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ లావాదేవీలపై లోతుగా చర్చించారు. ఇప్పటికిప్పుడు బిల్ కలెక్షన్ సెంటర్లను ఎత్తివేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని డిస్కమ్‌ల అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో దశలవారీగా బిల్లులను డిజిటలైజ్ చేయాలని అధికారులు సూచించారు. తొలిదశలో నెలకు రూ.2,500కు పైబడిన కరెంట్ బిల్లులను ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రెండు డిస్కమ్‌ల్లో రూ.40 లక్షల వరకూ ఈ విధంగా చెల్లింపులు ఉండొచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత రూ.500కు పైబడిన వారికి, మూడో దశలో అన్ని వర్గాలను డిజిటల్ పరిధిలోకి తేవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల్లో వ్యయ తగ్గింపు చర్యలపై జరుగుతున్న కసరత్తుపై ఉన్నతాధికారులు సమీక్ష జరిపారు. కేంద్ర నిధులు, ప్రపంచబ్యాంక్ అందించే సహాయంతో నిర్వహించే పథకాల పురోగతిని మరింత పెంచాలని సూచించారు. 2019 నాటికి పథకాలను పూర్తిచేస్తే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీ నుంచి గ్రాంట్ పొందవచ్చని జైన్ ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు తెలిపారు.

రాఘవేంద్రునికి వెంకన్న పట్టువస్త్రాలు

మధ్వారాధనకు పట్టు వస్త్రాలతో విచ్చేసిన టీటీడీ ఈవో



పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రుడి 346వ ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీ రాఘవేంద్రులు సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన శుభదినాన తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాల సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. పట్టువస్త్రాలను తీసుకొచ్చిన సింఘాల్‌ను స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద మంగళవాయిద్యాలు, శ్రీమఠం పూర్ణ కుంభంతో స్వాగతించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఎదురెళ్లి సాదరంగా పవిత్ర పట్టు వస్త్రాలను స్వీకరించి తలపై ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చారు. ఊంజల మంటపం చేరుకొని రాఘవేంద్రుని సన్నిధిలో పట్టువస్త్రాలను ఉంచారు. అక్కడ పట్టు వస్త్రాల సందేశాన్ని.. వెంకన్న, రాఘవన్న క్షేత్రాలకు ఉన్న అనుబంధాన్ని పీఠాధిపతి భక్తులకు ప్రవచించారు. రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేసి.. వెంకన్న పట్టు వస్త్రాలతో అలంకరించారు.

వరుణుడి కరుణ

▶ మొదటి పేజీ తరువాయి

అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బుధవారం రాత్రి వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈశాన్య మధ్యప్రదేశ్ ప్రాంతంలో మంగళవారం ఏర్పడిన అల్పపీడన ద్రోణి బుధవారం ఉత్తర మధ్యప్రదేశ్ దిశగా కదులుతోంది. ఈ ఉపరితల ద్రోణి సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉంది. మరో ఉపరితల ఆవర్తనం చత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకూ విస్తరించి ఉంది. వీటి ప్రభావం వల్ల గురు, శుక్రవారాల్లో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో జల్లులు లేదా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. శని, ఆదివారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. విశాఖపట్నంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో రాయచోటిలో 11, తిరువూరులో 9, పొదిలి, చీమకుర్తిల్లో 8, పిడుగురాళ్ల, పమిడి, ఆరోగ్యవరంలలో 7, చాపాడు, వేంపల్లె, కారంచేడుల్లో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రకాశం జిల్లాలో జోరుగా వర్షాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/గుంటూరు: ప్రకాశం జిల్లాలో బుధవారం అర్ధరాత్రి నుంచి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా నాగులుప్పలపాడు మండలంలో 9.8 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 56 మండలాలకుగాను, 30 మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రాచర్ల మండలంలోని నెలమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం వద్ద ఉన్న గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి బేస్తవారిపేట మండలంలోని జె.బి.కృష్ణాపురానికి చెందిన పెళ్లి బృందం వాగులో చిక్కుకుంది. అధికారులు వారిని కాపాడారు. ఈ వర్షానికి కంది, సజ్జ, పెసర, పత్తి తదితర పంటలతో పాటు నిమ్మ, బత్తాయి తదితర ఉద్యాన పంటలకు ప్రాణం పోసినట్లయింది. గుంటూరు జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగానికి ఊరటనిస్తున్నాయి.

209 మండలాల్లో ఇప్పటికీ వర్షాభావమే

రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నా నేటికీ రాష్ట్రంలో 209 మండలాల్లో వర్షాభావ పరిస్థితి ఉంది. 191 మండలాల్లో వర్షాభావం, 18 మండలాల్లో పెను కరువు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ జిల్లాలవారీగా చూస్తే అనంతపురం జిల్లాలో 29.9 శాతం, చిత్తూరులో 21.5, కర్నూలులో 19.7, వైఎస్సార్ జిల్లాలో 18.1, విజయనగరం జిల్లాలో 16.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

మృత్యుంజయుడు

- 50 అడుగుల ఎత్తు నుంచి కింద పడిన బాలుడు
- స్వల్ప గాయాలతో బయటపడిన వైనం



నిఖిల్‌చంద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న పోలీసులు

గన్నవరం: నాలుగేళ్ల చిన్నారి మృత్యుంజయుడని నిరూపించుకున్నాడు. పాఠశాలలో ఆడుకుంటూ సుమారు 50 అడుగుల ఎత్తులో ఉన్న మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందకు పడ్డాడు. అయితే స్వల్పగాయాలతో తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన కృష్ణా జిల్లా, గన్నవరంలోని శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం జరిగింది. కంకిపాడు మండలం ఉప్పులూరుకు చెందిన నాలుగేళ్ల నిఖిల్‌చంద్ శ్రీచైతన్య స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. ఉదయం 10.30 గంటల సమయంలో మూడో అంతస్తులోని నర్సరీ క్లాస్‌రూమ్ పక్కనే ఉన్న ఖాళీ గది కిటికీలో నుంచి కిందకు పడిపోయాడు. అయితే సన్‌సైడ్‌ను పట్టుకుని కొద్దిసేపు వేలాడిన ఆ చిన్నారిని సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసించే మహిళ శ్రీదేవి గట్టిగా కేకలు వేస్తూ కాపాడేందుకు స్కూల్ వద్దకు పరుగులు తీశారు. అయితే బాలుడు కిందపడిపోయాడు. అప్పటికి బాలుడిని గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయులు గమనించి గుట్టుచప్పుడు కాకుండా తరగతి గదిలోకి తీసుకెళ్లి ఓదార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు చిన్నారి నిఖిల్‌చంద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

అలిపిరి వద్ద రివాల్వర్ స్వాధీనం

- మహారాష్ట్ర వరకే అనుమతి ఉన్నా రివాల్వర్‌ను తిరుమలకు తీసుకెళ్తున్న భక్తుడు
- అడ్డుకున్న టీటీడీ విజిలెన్స్



స్వాధీనం చేసుకున్న రివాల్వర్‌ను పరిశీలిస్తున్న టీటీడీ సీవీఎస్‌వో రవికృష్ణ

తిరుపతి అర్బన్: తిరుమలకు మారణాయుధాలను తీసుకెళ్లకూడదన్న నిబంధనలను అతిక్రమించిన మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబాన్ని టీటీడీ విజిలెన్స్ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. రివాల్వార్‌తో పాటు 14 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి ఏవీఎస్‌వో దాసరి దండు గంగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది టోల్‌గేట్ చెక్ పాయింట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రకు చెందిన సుధాకర్ తన వాహనంలోని సీటు కవర్ కింద ఉంచుకున్న రివాల్వర్‌ను గుర్తించారు. తనిఖీల సమయంలో రివాల్వర్‌కు సంబంధించిన సమాచారాన్ని సుధాకర్ తనిఖీ అధికారులకు వివరించకపోవడంతో సిబ్బంది సీవీఎస్‌వో రవికృష్ణకు సమాచారం తెలిపారు. సీవీఎస్‌వో అలిపిరికి చేరుకుని రివాల్వర్‌ను, దాంతోపాటు ఉన్న 6 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ రివాల్వర్‌కు లైసెన్స్ ఉన్నప్పటికీ మహారాష్ట్ర దాటి వెళ్లేటప్పుడు వెంట తీసుకువెళ్ల కూడదన్నది నిబంధనగా గుర్తించారు. అతనితోపాటు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారించారు. సుధాకర్ కుమారుడు మరో 8 బుల్లెట్లను పాత చెక్ పాయింట్ వద్ద చెత్తకుప్పలో పడేసినట్లు చెప్పడంతో వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆ టీచర్లందరినీ వెంటనే రిలీవ్ చేయాలి

వైఎస్సార్ టీఎఫ్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇటీవల బదిలీ అయిన టీచర్లందరినీ రిలీవర్‌లతో సంబంధం లేకుండా వెంటనే రిలీవ్ చేయాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాలిరెడ్డి, ఓబుళపతి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. బదిలీ అయినా రిలీవ్ చేయనందున వారు ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఇలా ఉండగా 2013, 2015లో బదిలీ అయి రిలీవర్ లేక అదే పాఠశాలల్లో సింగిల్ టీచర్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉండిపోయారని, ఇప్పుడు కూడా బదిలీల్లో అదే పరిస్థితి ఏర్పడుతోందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నేత ఎం.శ్రీనివాస్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం

ఢిల్లీలో మాలమహానాడు ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పునకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తే సమయం వచ్చినప్పుడు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వర్గీకరణ అనేది మనువాదుల కుట్ర అని, ఇది దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

'నైట్ సఫారీ'గా తిరుపతి 'జూ'

200 ఎకరాల్లో ఏర్పాటుకు మాస్టర్‌ప్లాన్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలను సింగపూర్ తరహా నైట్ సఫారీగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జూ అధికారులు తయారుచేసిన మాస్టర్ ప్లాన్, లే అవుట్‌లతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. మొత్తం 200 ఎకరాల విస్తీర్ణంలో సందర్శకులను ఆకట్టుకునేలా దీన్ని తీర్చిదిద్దాలని అటవీ శాఖ యోచిస్తోంది. రూ.50 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనలకు ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయం ఆమోదం తెలియజేస్తే జూ అధికారులు టెండర్లకు వెళ్లే అవకాశం ఉంది. సెంట్రల్ జూ అథారిటీ అనుమతుల మేరకు నైట్ సఫారీ ఏర్పాటుకు పనులు చేపట్టాల్సి ఉంది. జూ మెయిన్ గేటు నుంచి శ్రీవారి మెట్లకు వెళ్లే రోడ్డుకు కుడివైపున నైట్ సఫారీ పనుల కారణంగా సందర్శకుల సంఖ్య పెరిగే వీలుందని అధికారులు భావిస్తున్నారు.

ఐసెట్ సీట్ల కేటాయింపు పూర్తి

మిగిలిపోయిన 7,789 సీట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఐసెట్ తుదివిడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తి చేశారు. ఈ మేరకు అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ కేటాయింపు జాబితా విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించి 494 కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 36,637 సీట్లుండగా, తుది విడత కౌన్సెలింగ్ ముగిసే నాటికి 28,848 మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 7,789 సీట్లు మిగిలి ఉన్నాయి.

'బీసీలు రాజకీయశక్తిగా ఎదగాలి'

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలని జేడీయూ చీఫ్ శరద్‌యాదవ్ ఆకాంక్షించారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలా ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య బుధవారం శరద్‌యాదవ్‌ను ఢిల్లీలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శరద్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని బీసీలు చైతన్యవంతులని చెప్పారు. కాగా, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల అంశంపై కేంద్ర మంత్రి దత్తాత్రేయతోనూ కృష్ణయ్య సమావేశమయ్యారు.

కాబోయే చైర్మన్ నేనే!

- మామూళ్లు ఎవరెవ్వరికి ఇస్తున్నారో వివరాలివ్వండి
- వక్ఫ్‌బోర్డు అధికారులను బెదిరించిన ఎమ్మెల్యే జలీల్‌ఖాన్



సాక్షి, అమరావతి: వక్ఫ్‌బోర్డుకు కాబోయే చైర్మన్‌ను నేనే.. ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యేకు ఎంత మామూళ్లు ఇచ్చారు.. ఆదాయం, ఖర్చు వివరాలు చెప్పండి అంటూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే జలీల్ ఖాన్ వక్ఫ్‌బోర్డు అధికారులను బెదిరించారు. అంతేకాకుండా రాష్ట్రంలో తాను సూచించిన వారిని ముతవల్లీలుగా గెలిపించాలని, లేకుంటే అందుకు సహకరించని అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. వక్ఫ్‌బోర్డుకు ఎలాంటి సంబంధంలేని ఎమ్మెల్యే బెదిరింపులకు పాల్పడటం ఏమిటని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుతోనే తేల్చుకుంటామని ఉద్యోగులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ల సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి హాజరవుతానని ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ వక్ఫ్‌బోర్డు అధికారులకు ముందుగా సమాచారం ఇచ్చారు. అయితే వక్ఫ్‌బోర్డులో ఏ హోదా లేకుండా సమావేశానికి హాజరవడానికి వీలులేదని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. అయితే ఎమ్మెల్యే భోజనాలు ఏర్పాటు చేయడంతో ఇన్‌స్పెక్టర్లతోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. ఆ సమయంలో ఎమ్మెల్యే జలీల్ ఖాన్ బెదిరింపులకు దిగడంతో అధికారులు ఖంగుతిన్నారు. అంతేకాకుండా కర్నూలు, విజయవాడలకు చెందిన ఖాజా, ఇంతియాజ్ అనే వ్యక్తులను పరిచయం చేస్తూ ఆయా ప్రాంతాల్లో వీరు ముతవల్లీలుగా పోటీ చేయనున్నారని, వీరిని గెలిపించే బాధ్యత మీదే అంటూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులకు సూచించారు. అందుకు సహకరించని వారిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వక్ఫ్‌బోర్డులో ముస్లిం వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇద్దరు ముతవల్లీలు, ఒక న్యాయవాది ఇతరులను సభ్యులుగా నియమించాల్సి ఉంటుంది. అయితే టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవ్వరూ లేకపోవడంతో వైఎస్సార్ సీపీ నుంచి వలసలు వచ్చిన ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చేయకుండా నాన్చుతూ వస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాక్షి
గురువారం, ఆగస్టు, 10


గుజరాత్ షాక్!

రాజ్యసభలో ఆధిక్యత సాధించడం కేంద్రంలో ఉండే పాలక పక్షానికి కీలకమే కావొచ్చుగానీ ఆ సభకు జరిగే ఎన్నికలపై జాతీయ స్థాయిలో ఎవరికీ పెద్దగా ఆసక్తి ఉండదు. ఎందుకంటే చాలా సందర్భాల్లో అవి లాంఛనప్రాయమే అవుతాయి. శాసనసభల్లో ఆయా పార్టీలకుండే బలాబలాలే, ఆ పార్టీల మధ్య ఏర్పడే అవగాహనలే ఫలితాల్లో కీలకపాత్ర పోషిస్తాయి. కనుకనే గత నెలలో జరిగిన రాజ్యసభ ఎన్నికలు చడీచప్పుడూ లేకుండా ముగిశాయి. కానీ గుజరాత్‌లో మంగళవారం మూడు స్థానాలకు జరిగిన ఎన్నికలు దేశవ్యాప్తంగా పెను ఉత్కంఠను కలిగించాయి. అనూహ్యమైన పరిణామాలతో ఆసక్తిని రేకెత్తించాయి. ప్రధాన రాజకీయ పక్షాలు బీజేపీ, కాంగ్రెస్‌లు హోరాహోరీ పోరాడిన ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించినా చివరకు అర్ధరాత్రి దాటాక విజయాన్నందించి ఊరట కలిగించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, సోనియాగాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడమే దీనంతకూ కారణం. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు తిరుగుబాటు ఎమ్మెల్యేలు తెలివితక్కువగా బ్యాలెట్ పత్రాలు చూపి బీజేపీ ఆశల్ని తలకిందులు చేశారు. అమిత్ షా గెలుపునకు అవసరమైన ఓట్ల కేటాయింపు ఆయనకుంది. అదే పార్టీకి చెందిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి సైతం ఇలాంటి ఏర్పాటే ఉంది. ఈ రెండు స్థానాలు మాత్రమే గెల్చుకోగల స్థితిలో ఉన్న బీజేపీ... కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్న అహ్మద్ పటేల్ ఓటమే ధ్యేయంగా మూడో అభ్యర్థిని రంగంలోకి దించడంతో ఎన్నికల తీరుతెన్నులు మారిపోయాయి. పటేల్‌పై బీజేపీ అభ్యర్థిగా పోటీపడిన బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుట్ మొన్నటి వరకూ శాసనసభలో పార్టీ చీఫ్ విప్. ఆయన, మరో ఆరుగురు ఇటీవల కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు మరణించారు. అయినా గెలుపునకు అవ సరమైన 44 ఓట్లు ఆ పార్టీకి ఉన్నాయి. వారిని బీజేపీ గాలం నుంచి తప్పించడానికి తమ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకకు ఆ ఎమ్మెల్యేలను తరలించడం, అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ మంత్రి అధికారిక నివాసంలోనూ, ఆయన మిత్రుల ఇళ్లలోనూ ఆదాయం పన్ను శాఖ దాడులు నిర్వహించడం సంచలనం కలిగించాయి. ఆ ఒక్క స్థానాన్ని గెల్చుకోవడానికి ఒకరు... దాన్ని దక్కనీయరాదని మరొకరు ఇన్నివిధాలుగా ప్రయత్నించడం అసాధారణం.

అహ్మద్ పటేల్ సామాన్యుడు కాదు. రాజీవ్‌గాంధీ గుర్తించి అందలం ఎక్కించిన నేతల్లో ఆయనొకరు. రాజీవ్ అనంతరం ఆయన సోనియాగాంధీకి కూడా దగ్గరయ్యారు. పేరుకు ఆమె రాజకీయ కార్యదర్శే అయినా గత రెండు దశాబ్దాలుగా పార్టీలో చక్రం తిప్పుతున్నారు. పటేల్ ఓటమి కాంగ్రెస్‌కూ, ప్రత్యేకించి సోనియాకూ నైతికంగా కోలుకోలేని దెబ్బ అవుతుందని... మరికొన్ని నెలల్లో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ఇది చాలా అవసరమని బీజేపీ భావించింది. అందుకే అమిత్ షా తన గెలుపు కంటే కూడా అహ్మద్ పటేల్ ఓటమిపైనే దృష్టంతా కేంద్రీకరించారు. స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. సర్వశక్తులూ ఒడ్డారు. ఈ క్రమంలో పార్టీపై ఎలాంటి ముద్ర పడుతుందన్న బెంగ ఆయనకు కలగలేదు. ఏం చేసైనా పటేల్‌ను ఓడించడమే ఆయన ఏకైక లక్ష్యం. ఇది తన గెలుపు కాదని... డబ్బు, కండబలం, అధికార దుర్వినియోగం ఉమ్మడిగా పొందిన ఓటమి అని అహ్మద్ పటేల్ అనడంలోని అంతరార్థం ఇదే.

అయితే గెలుపునకు చాలినన్ని ఓట్లు లేకపోయినా మూడో అభ్యర్థిని రంగంలోకి దించినందుకు బీజేపీని తప్పుబట్టి ప్రయోజనం లేదు. ఆ మాదిరి సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది, దాన్ని అనేక సందర్భాల్లో విజయవంతంగా ప్రయోగించిందీ కాంగ్రెస్ పార్టీయే. ఇప్పుడు డబ్బు, కండబలం, అధికార దుర్వినియోగం లాంటి ఆరోపణలు చేస్తున్న అహ్మద్ పటేల్ ఇలాంటి పనుల్లో తానే సిద్ధహస్తుడు. తెరవెనక ఉంటూ ఇవన్నీ ఎడాపెడా చేయడం ద్వారా హేమాహేమీలైన నేతలెందరి తలరాతలనో ఆయన మార్చాడు. సోనియా దగ్గర తనకున్న ప్రాపకాన్ని ఉపయోగించుకుని పార్టీలో సమర్థులైన నాయకులను శంకరగిరి మాన్యాలు పట్టించాడు. అనర్హులను అందలం ఎక్కించాడు. రాహుల్‌గాంధీతో మాత్రం పొసగలేదు. ఆయన సమర్థుడైన పక్షంలో బహుశా ఈపాటికే పటేల్ దుకాణం సర్దుకునేవారు. అటు రాహుల్, ఆయన అనుచరగణం ఎక్కడా ఏమీ సాధించలేక చతికిలబడుతున్న సమయంలో ఎంతో చాకచక్యంగా ఎత్తులు వేసి ప్రత్యర్థిని చిత్తు చేయగలనని నిరూపించుకునేందుకు... మరికొన్నాళ్లపాటు పార్టీలో వెలిగిపోయేందుకు రాజ్యసభ స్థానం గెల్చుకోవడం ద్వారా అహ్మద్ పటేల్‌కు 'గొప్ప అవకాశం' వచ్చిపడింది.

తమది విలక్షణమైన పార్టీ అని ఎప్పుడో రెండు దశాబ్దాలక్రితం బీజేపీ చెప్పుకుని ఉండొచ్చుగానీ... దాన్ని పట్టుకుని వేలాడాలన్న యావ ఆ పార్టీకి పోయి చాన్నాళ్లయింది. గెలవడం ముఖ్యం తప్ప ఎలా గెలిచామన్నది ప్రధానం కాదని చాలా పార్టీలు భావిస్తున్నాయి. అయితే ఫార్ములా తెలిసినంతగా దాన్ని ప్రయోగించడానికి అవసరమైన నైపుణ్యం బీజేపీకి పూర్తిగా పట్టుబడలేదని గుజరాత్ పరిణామాలు నిరూపించాయి. గుజరాత్‌లో ఓట్లు లెక్కింపు ఆగిపోగా ఢిల్లీలో రెండు పార్టీలూ ఈసీ ప్రధాన కార్యాలయం చుట్టూ తిరిగి మహజర్లు సమర్పించాయి. పోటీలు పడి కొన్ని గంటల వ్యవధిలోనే ఫిర్యాదులు, అభ్యంతరాలు వినిపించాయి. చివరకు మూడు స్థానాల్లో రెండు గెల్చుకుని కూడా చివరకు బీజేపీ ఓడిపోయిన భావనతో మిగిలిపోతే... రావలసిన ఒక్కటీ దక్కించుకోవడానికి తెగ కష్టపడి ఏదో ఘనకార్యం సాధించినట్టు ప్రకటించుకుని కాంగ్రెస్ బీరాలు పోతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు ఇలాంటి అవకాశాన్నిచ్చి తప్పు చేశామని, కోమాలోకెళ్లిన ఆ పార్టీకి జవసత్వాలిచ్చామని బీజేపీ ఇప్పుడు తీరిగ్గా చింతిస్తూ ఉండొచ్చు. కానీ కనీస విలువలను పాటించలేకపోతున్నామని, నైతికతకు నీళ్లొదులుతున్నామని ఈ రెండు పార్టీలతోపాటు ఇలాంటి ఎత్తుగడలకే పూనుకుంటున్న ఇతర పార్టీలు కూడా గ్రహించగలిగినప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుంది.




ప్రజాస్వామ్య భావన పరిరక్షణకు బాధ్యత పడకుండా ప్రజాస్వామ్యాన్ని గెలుపోటములకు చెందిన ఎత్తుగడల ప్రక్రియగా మాత్రమే చూస్తే అది మరెంత కాలమో మనజాలదు.

– శామ్ షెపర్డ్
అమెరికన్ నటుడు, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి బ.తదియ రా.11.30 వరకు, తదుపరి చవితి, నక్షత్రం, శతభిషం ఉ.6.05 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం ప.12.30 నుంచి 2.05 వరకు దుర్ముహూర్తం ఉ.9.58 నుంచి 10.48 వరకు, తదుపరి ప.3.02 నుంచి 3.53 వరకు, అమృతఘడియలు రా.10.15 నుంచి 11.54 వరకు.

సూర్యోదయం	: 5.45	3.00 వరకు	
సూర్యాస్తమయం	: 6.26	యమగండం :	
రాహుకాలం :		ఉ.6.00 నుంచి	
ప 1.30 నుంచి		7.30 వరకు	



నమాజ్ వేళలు

ఫజర్	: 4.41	మగ్రీబ్	: 6.45
జొహర్	: 12.21	ఇషా	: 8.01
అసర్	: 4.49		

వేకువ వచ్చేనా ఎన్నటికైనా?

విశ్లేషణ



దేవిందర్‌శర్మ

ఆర్థిక సంస్కరణల అమలు కోసం ప్రభుత్వాలు కావాలనే వ్యవసాయరంగాన్ని హతమారుస్తున్నాయి. ఆర్థిక వృద్ధి పేరిట వ్యవసాయ జనాభాలో చాలా భాగాన్ని నగరాలలో అల్ప వేతనాల శ్రామికులుగా దిగజార్చాలని యత్నిస్తున్నారు. ఆహారాన్ని కార్పొరేట్ వ్యవసాయం ద్వారా లేదా దిగుమతుల ద్వారా సమకూర్చుకోవచ్చు. సరిగ్గా ఇదే ప్రపంచ బ్యాంకు తదితర సంస్థలు మన దేశం కోసం సిద్ధం చేసిన మార్గం. ఈ లక్ష్యం సాధిస్తే రేటింగ్ సంస్థలు మనకు అధిక ర్యాంకింగ్ ఇస్తాయి అతి చాకచక్యంగా రూపొందించిన ఆర్థిక నమూనా ఇది.

ఎప్పుడు నేను ఏ రైతు మొహంలోకి చూసినా ''ఓ సుభా కభీ తో ఆయేగీ'' (ఆ వేకువ వచ్చేనా ఎన్నటికైనా) అనే రాజ్‌కపూర్ పాట గుర్తుకు వస్తుంటుంది. దైన్యం నిండిన ఆ వదనంలో కొట్టవచ్చినట్టుగా నిరాశ కనిపిస్తుంటుంది. ఆ పాట పాడిన రాజ్‌కపూర్ కథ ఎలాగో సుఖాంతమైందిగానీ, భారత రైతు మాత్రం ఒక **చక్రవ్యూహపు** బంధనాల లోలోతుల్లోకి కూరుకుపోతూనే ఉన్నాడు. ఇదొక అంతేలేని నిరీక్షణ. పుష్కలంగా పంటలను పండించడానికి రైతులు గత 70 ఏళ్లుగా కష్టించి చమటోడుస్తూనే ఉన్నారు. అయినా ఏటికేడాది గడిచేకొద్దీ రైతు కుటుంబం పరిస్థితి అధ్వానమౌతూనే ఉంది. మరీ సుదూరమైనది కాని గతంలో 'ఓడ నుంచి నోటికి' (ఆహార దిగుమతులపై ఆధారపడిన స్థితి) అని పిలిచే దశలో మనుగడ సాగించిన దేశం మనది. ఆనాడు ఆహార సహాయం పెద్ద ఎత్తున జనాభాను ఆకలి కోరలనుంచి కాపాడింది.

ఒకప్పుడు దేశానికి గర్వకారణమైన రైతు నేడు ఆర్థిక భారంగా మారాడు. కృతజ్ఞతలేని దేశం ఆ భారాన్ని వదుల్చుకోడానికి ఎప్పుడు ఏ అవకాశం దొరుకుతుందా? అని ఎదురు చూస్తోంది.

రైతు భిక్ష ఆహార స్వయంసమృద్ధి

1965లో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వియత్నాం యుద్ధాన్ని ''దురాక్రమణ చర్య''గా పేర్కొనడం అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్‌కు ఆగ్రహాన్ని కలిగించింది. ఒక ఆకలిగొట్టు దేశం అమెరికాను దురాక్రమణదారు అనడానికి ఎలా సాహసిస్తుంది? అని ఆహార సరఫరాలను నిలిపి వేయడంతో మన ప్రభుత్వం అయోమయంలో పడిపోయింది. ఒక సమయంలో ఆహార ధాన్యాల నిల్వలు వారానికి మాత్రమే సరిపోయే స్థితి ఏర్పడింది. దీంతో సర్వత్రా భయాందోళనలు వ్యాపించిపోయాయి. లోతుగా విస్తరిస్తున్న ఆహార సంక్షోభానికి జవాబుగా శాస్త్రి, ప్రతి సోమవారం ఉపవాసం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆహార స్వయంసమృద్ధిని సాధించడంలో రైతు నిర్వహించగల గొప్ప పాత్రను గుర్తించిన ఆయన ***జై జవాన్, జై కిసాన్*** నినాదాన్ని రూపొందించారు. ఆ తర్వాత విజయవంతంగా పాల సహకార సంఘాలను ప్రారంభించారు. అవే ఆ తర్వాత క్షీర విప్లవాన్ని తెచ్చాయి. ప్రధాని ఇందిరాగాంధీ వాస్తవంగానే హరిత విప్లవానికి బీజాలు వేశారు. ప్రభుత్వం మెక్సికో నుంచి అధిక దిగుబడినిచ్చే గోధుమ పొట్టి వంగడాలను దిగుమతి చేసుకుని, నీటి పారుదల సదుపాయాలను, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలను అందుబాటులో ఉంచగా, ఆ మిగతా పనిని రైతులు చేశారు. 1967లో హరిత విప్లవ సాంకేతికతను ప్రవేశపెట్టిన తర్వాతి తొలి పంట నూర్పిడి కాలానికి ఆహారధాన్యాల ఉత్పత్తి 50 లక్షల టన్నుల రికార్డు స్థాయికి చేరింది. ఇక దేశం వెనక్కు చూసిందే లేదు. భారతదేశం ఆహార స్వయంసమృద్ధిని సాధించింది.

అయితే, ప్రభుత్వం ఆనాడు రైతులకు అందించిన ఆర్థిక ప్రోత్సాహకాలు పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు. 1970లో పాఠశాల ఉపాధ్యాయుల వేతనం నెలకు రూ.90 ఉన్నప్పుడు, గోధుమ కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) క్వింటాలుకు రూ. 76. అధిక ధరకు, మార్కెట్‌కు హామీని (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటుతో) రైతుకు కల్పించారు. రైతులకు 'ఘననీయమైనది' అయిన ఆ కాలం ఓ దశాబ్దిన్నర పాటూ కొనసాగింది. హరిత విప్లవం చిన్న రైతుల జీవితాల్లోకి తొంగి చూడకుండానే సాగినా, అది సౌభాగ్యం గురించి ఆశాజనకమైన చిత్రాన్ని ఆవిష్కరించింది. అభ్యుదయ రైతు ట్రాక్టర్ నడుపుతున్న బొమ్మ సౌభాగ్యానికి సంకేతమైంది. వాస్తవానికి, ఉత్పత్తిలోని పెరుగుదలకు అనుగుణంగా వ్యవసాయ ఆదాయాలు పెరగలేదు. వరుసగా వచ్చిన



ప్రభుత్వాలు భారీ దిగుబడులతో సంతృప్తిచెంది, రైతాంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. ప్రభుత్వరంగ పెట్టుబడుల రేటు క్షీణించడం దీనికి తోడు కాగా, 1980ల మధ్య నుంచి వ్యవసాయరంగ పతనం ప్రారంభమైంది.

కొనితెచ్చుకుంటున్న ఆహార పరాధీనత

1991 నాటికి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) అస్తిత్వంలోకి వచ్చాక, దేశం వ్యవసాయం మీద నుంచి దృష్టిని మరల్చడం మొదలెట్టింది. అదే సమయంలో యూరప్, అమెరికాలు కూడా భారీ ఎత్తున ఆహారం, పాలు, వెన్న భారీ నిల్వలను కూడబెట్టసాగాయి. దీంతో, ప్రధాన స్రవంతి ఆర్థిక చింతన ప్రపంచ పోటీపైకి మరలింది. చౌక దిగుమతులకు అనువుగా దిగుమతి సుంకాలను తగ్గించడం మొదలైంది. అదేసమయంలో, ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ భారాన్నంతటినీ రైతులపై మోపారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 1990–2010 మధ్య ప్రపంచస్థాయిలోనే స్థిరంగా ఉండిపోయాయి. నిరాశాజనకమైన ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. రైతులకు న్యాయమైన ఆదాయాన్ని నిరాకరిస్తున్నా, సమాజంలోని ఇతర సెక్షన్ల జీతాలు భారీగా పెరిగాయి. 1970–2015 మధ్య పాఠశాల ఉపాధ్యాయుల వేతనాలు 280 నుంచి 320 రెట్లు, ప్రభుత్వోద్యోగుల జీతాలు 120 నుంచి 150 రెట్లు పెరిగాయి. అదే కాలంలో రైతులకు ఇచ్చే గోధుమ ధర మాత్రం 19 రెట్లే పెరిగింది. వ్యవసాయం లాభసాటిగా కాకుండా పోయింది, ఇతరులతో సమానమైన పరిస్థితులను వ్యవసాయానికి కల్పించాలని ఏళ్ల తరబడి చేస్తున్న డిమాండు ప్రభుత్వాల చెవికి ఎక్కడం లేదు.

1996–2015 మధ్య 20 ఏళ్లలో భారత్ 40 కోట్ల మందిని వ్యవసాయం నుంచి బయటకు పంపాలని ప్రపంచ బ్యాంకు నిర్దేశించింది. అదిచ్చే ప్రతి రుణానికి దాదాపు 140 నుంచి 150 షరతులు ఉంటాయి. కాబట్టి దాని ప్రతి రుణమూ రైతులను వ్యవసాయం నుంచి తొలగించడాన్ని నొక్కి చెబుతూనే ఉంది. 70 శాతం రైతాంగాన్ని వ్యవసాయం నుంచి తరలించాల్సిన అవసరం ఉన్నదని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పదే పదే చెప్పేవారు. అదే మన దేశంలో అతి పెద్ద ఆర్థిక సంస్కరణ అవుతుందని రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. అది జరిగినప్పుడే మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చౌక శ్రమ అందుబాటులోకి వస్తుందని వారి భావన. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెడుతూ వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని చూపింది. ప్రభుత్వాలన్నీ వ్యవసాయాన్ని లాభదాయకం కానిదిగా చేసి, పెద్ద ఎత్తున రైతులు వ్యవసాయాన్ని వీడి పట్టణాలకు పోక తప్పని పరిస్థితులను కావాలనే కల్పించాయి. ఈలోగా ఆహార దిగుమతులు విపరీతంగా పెరిగాయి. 2015–16లో అవి రూ.1,40,268 కోట్లకు చేరాయి. ఇది, వార్షిక వ్యవసాయ బడ్జెట్ కంటే ఎక్కువ.

రైతును భూమి నుంచే గెంటేస్తేనే వృద్ధి!

రైతులను వ్యవసాయం నుంచి గెంటేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నప్పటి నుంచి దిగుమతులకు మళ్లడం కూడా జరిగింది. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ భారాన్ని రైతులపై మోపడంతో, వారికి ఉత్పత్తి ఖర్చులకు సైతం సరిపోని ధరలను చెల్లించడం అలవాటుగా జరిగిపోతోంది. పప్పులు, నూనె గింజల దిగుమతుల కోసం ఆఫ్రికా, బ్రిక్స్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. భవిష్యత్తులో గోధుమ దిగుమతులూ మొదలౌతాయి. ఆహార స్వయంసమృద్ధి నుంచి ఆహారం కోసం దిగుమతులపై ఆధారపడటం వైపునకు మళ్లే కృషి జరుగుతోంది. ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం అంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమేనని గుర్తించడం లేదు. ఆహార దిగుమతులు మొదట చిన్న రైతులను దెబ్బతీసి, సాగు మానేసి వారు పట్టణాలకు వలసపోయేలా చేస్తాయి. ఇలాంటి వివరాలు ప్రధాన స్రవంతి ఆర్థిక వేత్తలకు అర్థరహితమైవిగా తోస్తాయి. వారి దృష్టంతా రైతులను వ్యవసాయం నుంచి తరిమేయడం మీదనే ఉంది. దాన్నే మన విధానకర్తలు ఆర్థికవృద్ధి వ్యూహంగా అనుసరిస్తున్నారు. ప్రపంచంలోని దేశాలన్నీ ఉద్యోగాలు లేని వృద్ధిని చవి చూస్తున్నాయి. మనం అందుకు మినహాయింపు కాదు. ఈ పరిస్థితిలో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించగలిగేది వ్యవసాయమేనని గుర్తించడం లేదు.

ఏదిఏమైనా, ప్రతి కోతల కాలం తర్వాత వ్యవసాయ మార్కెట్లలో ధరలు ఘోరంగా పడిపోతున్నాయి. రైతులకు కనీస మద్దతు ధరల హామీనైనా కల్పించకుండా ప్రభుత్వం ఆదుకోవడానికి నిరాకరిస్తున్నది. రైతులు అంతేలేని రుణ విషవలయం అనే **చక్రవ్యూహం** లోలోతులకు కూరుకుపోతున్నారు. ఎమ్ఎస్‌పీ ఇచ్చిన సందర్భాల్లో కూడా అది ఉత్పతి వ్యయం కంటే తరచూ తక్కువగా ఉంటోంది. ఉదాహరణకు మహారాష్ట్రలో కందిపప్పు ఉత్పతి వ్యయం క్వింటాలుకు రూ.6,240, ఎమ్ఎస్‌పీ రూ.5,050, రైతులు వాస్తవంగా మార్కెట్లో అమ్ముకోగలుగుతున్న ధర రూ. 3,500 నుంచి రూ. 4,200 మాత్రమే. హరియాణా రైతు మూడు నెలలు కష్టించి బంగాళాదుంపలు పుష్కలంగా పండిస్తే, వాటిని కిలో 9 పైసలకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఇవేవో చెదురు మదురు ఘటనలు కావు, ఇలా ఏటా పంట రైతు చేతికొచ్చాక ధరలు కుప్పకూలడం ఆనవాయితీగా మారింది. అందువల్లనే ఇటీవల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో రైతులు ఆగ్రహంతో ఆందోళనలు సాగించారు. ఈ నిరసనలు, ముందు రానున్న సినిమాకు ట్రైలర్ మాత్రమేనని నా అభిప్రాయం.

ఏటికేడాది రెట్టింపయ్యే అప్పుల ఊబిలో బతకమని ప్రభుత్వాలు రైతులను వదిలేశాయి. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగానే పేదరికంలో మగ్గేలా చేస్తున్నాయి. రైతాంగంలో 58 శాతం ప్రతి రాత్రీ ఆకలి కడుపుతో పడుకోవాల్సి వస్తోందని ఒక అంచనా. దేశంలోని 17 రాష్ట్రాల అంటే దాదాపు సగభాగంలో రైతుకుటుంబాల సగటు వార్షిక ఆదాయం రూ. 20,000, అంటే నెలకు రూ. 1,700 అని 2016 ఆర్థిక సర్వే చెబుతోంది. ఇది ఒక ఆవును పెంచడానికే సరిపోదు, మరి రైతు కుటుంబాలు ఎలా నెట్టుకొస్తున్నాయా? అని ఆశ్చర్యం కలుగుతుంది. ఈ రైతాంగానికి వ్యవసాయాన్ని గర్వకారణంగా మార్చే ఆ ఉదయం ఎన్నటికైనా వస్తుందా?

ఆర్థిక సంస్కరణలను అమలు చేయడం కోసం ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని హతమారుస్తున్నాయి. ఆర్థిక వృద్ధిని సాధించాలంటూ ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రవేత్తలు వ్యవసాయంలోని జనాభాలో చాలా భాగాన్ని నగరాలలో చౌకగా దొరికే శ్రామికులుగా మార్చాలని చూస్తున్నారు. ఆహారాన్ని కార్పొరేట్ వ్యవసాయం ద్వారా లేదా దిగుమతుల ద్వారా సమకూర్చుకోవచ్చు. సరిగ్గా ఇదే ప్రపంచ బ్యాంకు, ఇతర ఆర్థిక సంస్థలు మన దేశం కోసం రూపొందించిన మార్గం. ఈ లక్ష్యం సాధించినందుకు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు మనకు అధిక ర్యాంకింగ్ ఇస్తాయి. అతి చాకచక్యంగా రూపొందించిన ఆర్థిక నమూనా ఇది.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు | hunger55@gmail.com

అగ్రస్థానాల్లో ఆ నలుగురూ..!

ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యంలేని నలుగురు నేతలు కోవింద్, వెంకయ్య, నరేంద్ర మోదీ, సుమిత్రా మహాజన్ నేడు నాలుగు అత్యున్నత రాజ్యాంగ పదవులను అలంకరించడం బీజేపీ చరిత్రలో మేలిమలుపు.

సందర్భం



పురిఘళ్ల రఘురాం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల కంచుకోటలు మోదీ, షా నాయకత్వంలో బీటలువారాయి. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నంలో నిలిస్తే... కమ్యూనిస్టులు తొలిసారిగా బెంగాల్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యాన్ని కోల్పోయిన పరిస్థితి ఇప్పుడు నెలకొంది. మరోవైపు దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీకి నేతృత్వం వహించిన నలుగురు సామాన్యులు దేశ అత్యున్నత పీఠాలను అధిరోహిస్తున్నారు.

కాంగ్రెస్ ముక్తి భారత్ అంటున్న బీజేపీ ఇప్పుడు ఆ దిశగా తొలి అడుగు వేసిందని చెప్పవచ్చు. తొలిసారి నాలుగు అగ్ర స్థానాల్లో నలుగురు బీజేపీ నేతలు ఇమిడిపోయారు. గతంలో పూర్తి మెజార్టీ రానందున భాగస్వామ్య పక్షాలన్నింటినీ కలిపి పనిచేయాల్సిన తరుణంలో వాజ్ పేయి తన అనుభవాన్ని రంగరించి సుపరిపాలన అందించారు. అయితే నేడు ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ లోక్‌సభలో పూర్తి మెజార్టీ సాధించగా.. త్వరలో రాజ్యసభలో పూర్తి మెజార్టీ సాధించబోతోంది.



దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతి అభ్యర్థికి న్యాయకోవిదుడు రామ్‌నాథ్ కోవింద్ వచ్చారు. న్యాయశాస్త్ర కోవిదుడిగా, బాల స్వయం సేవక్ సంఘ్‌గా ఆర్ఎస్ఎస్‌లో ఓనమాలు నేర్చుకున్న కోవింద్ ఇప్పుడు దేశ ప్రథమ పౌరుడు. నిష్కళంకుడిగా, దళితుల ఔన్నత్యం కోసం పనిచేసిన కోవింద్... న్యాయవాదిగా, రాజ్యసభ సభ్యుడిగా, గవర్నర్‌గా రాజ్యాంగ పరిరక్షణలో నేను సైతం అంటూ ముందుకు కదిలారు. అదే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్‌లో బాల స్వయం సేవక్ సంఘ్‌గా జీవితం ఆరంభించి, బీజేపీ కార్యకర్తగా, పార్టీ నాయకుడిగా, ప్రధాన కార్యదర్శిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా... ప్రధానిగా ఒకదాని తర్వాత మరో పదవిలోకి ఇమిడిపోయారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా మోదీ తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి... నేడు దేశ అత్యున్నత పదవిని అధిరోహించారు. టీ అమ్మడం దగ్గర్నుంచి, స్వయం సేవక్ కార్యకర్తగా, బీజేపీ నేతగా దశాబ్దాలపాటు అకుంఠిత దీక్షతో పార్టీకి సేవలందించారు. పదేళ్ల యూపీఏ ఏలుబడిలో జరిగిన అవినీతిని పాతరేసేందుకు, ప్రధాని అభ్యర్థిగా రంగ ప్రవేశం చేసి నెంబర్ 1 పీఠాన్ని మోదీ దక్కించుకున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ బీజేపీ బలోపేతం అవుతూ.. ఇప్పటికే భాగస్వామ్య పక్షాలతో కలిసి 17 రాష్ట్రాల్లో అధికారాన్ని దక్కించుకుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్‌లో ఒక పార్టీకి అత్యధిక సంఖ్యలో లోక్‌సభ స్థానాలుగానీ, అసెంబ్లీ స్థానాలను గానీ సంపాదించడంలో అటు మోదీ, అమిత్ షా కృషి మరువలేనిది. ఇక ఎమర్జెన్సీ రోజుల నుంచి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను చీల్చి చెండాడుతూ... జనసంఘ్ పార్టీలో కీలక సభ్యునిగా కొనసాగుతూ... ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా మరో బీజేపీ కీలక నేత వెంకయ్య నాయుడు చరిత్ర సృష్టించారు. అంత్య, ఆది ప్రాసలతో విపక్ష పార్టీలను చీల్చిచెండాడి.. ఒకే దేశం... ఒకటే సిద్ధాంతమంటూ వెంకయ్య దేశమంతా బీజేపీ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన పార్టీ తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికై గెలుపొందారు. ఇక మరో కీలక నేత లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆర్ఎస్ఎస్ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చారు. ఎవరికీ సాధ్యం కాని రీతిలో వరుసగా లోక్‌సభకు 8 సార్లు ఎన్నికై ఆమె సంచలనం సృష్టించారు. సుమిత్రాతోపాటు లోక్‌సభకు 8 సార్లు ఎంపికైన ఎంపీలు ముగ్గురిలో ఆమె ఒకరు. మహిళా ఎంపీగా మహాజన్ ఒక్కరే ఇన్నిసార్లు విజయాలు సాధించడం విశేషం. వివాదాలకు తావివ్వకుండా తన పని తాను చేసుకుపోతూ... ముందుకు సాగే మహాజన్... రెండేళ్లపాటు మానవ వనరుల అభివృద్ధి మంత్రిగానూ పనిచేశారు.

ఎలాంటి రాజకీయ కుటుంబం నుంచి ప్రాతినిధ్యం వహించని ఈ నలుగురు నేతలూ, స్వశక్తితో రాజకీయాల్లో ఎదిగి వచ్చి ఇప్పుడు దేశ ఔన్నత్యాన్ని కాపాడే విశిష్ట వ్యక్తులయ్యారు. కోవింద్, వెంకయ్య, మోదీ, సుమిత్రా మహాజన్ నలుగురిపైనా ఒక్కటంటే ఒక్క మచ్చ లేదు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నప్పటికీ చిన్న అవినీతి, ఆశ్రితపక్షపాతమన్నది లేకుండా వారు రాజకీయ ప్రస్థానం సాగించారు. దేశంలో అత్యున్నతమైన పదవి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ఉపరాష్ట్రపతి, లోక్ సభ స్పీకర్ ఇలా నాలుగు రాజ్యాంగ పదవులను అలంకరిస్తున్న నలుగురు వ్యక్తులు బీజేపీలో కీలక సేవలందించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ఓనమాలు దిద్దిన అనుభవం ఆ నలుగురిది. నలుగురు నేతలు విచారధార... సిద్ధాంతాన్ని పట్టుకొని ఈ స్థాయికి చేరుకున్నవారే. సిద్ధాంత రాజకీయాలకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. ఆర్ఎస్ఎస్‌లో నేర్చుకున్న క్రమశిక్షణతో పార్టీలో పనిచేశారు. నేడు ప్రభుత్వంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేశ స్వరూపాన్ని మార్చడానికి పిలుపిస్తున్న నరేంద్ర మోదీ కీలక పయనంగా ఈ పొందికను విశ్లేషించవచ్చు.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

చాపకింద నీరు

మానవాళి ప్రకృతిపై చేస్తున్న జులుంకి ప్రకృతి చాలా క్రూరంగా సమాధానం చెప్పబోతోంది. దానికి సూచనే ఈ మంచు శకలం విడివడటం. ఇది మానవుడు తెలిసి తెలిసి– తనకు తానే తవ్వుకుంటున్న భయంకరమైన గొయ్యి.

విశ్లేషణ



గొల్లపూడి మారుతీరావు

మన చాపకిందకి నీరు వస్తే గాని మనం చెమ్మని గుర్తుపట్టం. ఈ దేశం మీద పరాయిదేశం దండయాత్ర చేసినా దక్షిణాదివారికి అది కేవలం వార్తే. కశ్మీర్ పొలిమేరల్లో పాకిస్తాన్ కాల్పులు జరుపుతూంటే– తమ జీవితాల్ని ప్రశాంతంగా గడిపే ఎన్నో సరిహద్దు కుటుంబాలను సైనిక దళాలు అప్పటికప్పుడు కదుపుతూంటాయి. పాక్ కాల్పులు మనకి వార్త. వారికి ప్రాణ సంకటం. అలాగే డోక్లాంలో చైనా దళాల మోహరింపు మనకు కేవలం వార్త. సరిహద్దు పల్లెలకు జీవన్మరణ సమస్య. యుద్ధం పంజాబ్‌లో ఎన్నో కుటుంబాలను పునాదులతో కదుపుతుంది. యుద్ధం కారణంగా సరిహద్దులో పుట్టిన తెలివైన కుర్రాడు చదువుకోలేక కేవలం కారు మెకానిక్ కావచ్చు. కాని అమలాపురంలో, త్రివేండ్రంలో యుద్ధం కేవలం పేపరు చెప్పిన సంఘటన.

నా చిన్నతనంలో ఇప్పటి విశాఖపట్నం పోర్టు ఉన్న చోట రెండు ఫర్లాంగుల దూరంలో సముద్రపు నీరు ఉండేది. ఇప్పుడు రోడ్డుదాకా వచ్చేసింది. ఇటీవల రామకృష్ణా బీచ్ దగ్గర సముద్రం దాదాపు రోడ్డుని కొట్టేసింది. ఎందుకని? ఏమో. అది మన చాపకాదు.

జీవన కాలమ్



మరో ముప్పై ఏళ్లకు ఇప్పటి జలాంతర్గామి మునిగిపోవచ్చు. కొత్తగా పెడుతున్న విమానం నీటిలోకి పోవచ్చు. ఈ విషయం ఏ కలెక్టరూ చెప్పలేదు. కొన్ని లక్షల సంవత్సరాల కింద దక్షిణ ధ్రువం నుంచి విడిపోయిన గోండ్వానా భూమి ఖండాలయింది. దేశ పటాలను చూస్తే పశ్చిమ భారతం సరిగ్గా తూర్పు ఆఫ్రికా తీరానికి అతుక్కుపోతుంది. కొన్ని లక్షల సంవత్సరాలలో రెండు వేర్వేరు సంస్కృతులు ఆయా దేశాలలో నిలదొక్కుకున్నాయి. ఇప్పటికీ తూర్పు ఆఫ్రికా దేశాలలో గోపాలురు ఉన్నారు. వారి అష్ట భార్యలున్నారు. నేను చూశాను. అందరూ కలసి ఒకచోటే జీవిస్తారు. వారు నల్లనివారు. పద్మనయనమ్ములవారు. సింహబలురు. ఆఫ్రికాలో సింహాలు ఒక్క ఈ గోపాలురను చూస్తేనే పారిపోతాయి! ఏమయినా ఇది ఆంత్రోపాలజిస్టులు తేల్చవలసిన కథ.

ఇప్పుడీ కథకు పెట్టుబడి– ఇటీవల అంటార్కిటిక్ ధ్రువంలో మంచు గడ్డ నుంచి 12 ట్రిలియన్ టన్నుల ముక్క విడిపోయి భూమి వేపు ప్రయాణం చేస్తోంది అని చదివాం. ఇది బొత్తిగా పొరుగువాడి చాప.

ట్రిలియన్ అంటే? ఒకటి తరువాత 12 సున్నాలు. ఇలా చెప్పినా మన మనస్సుల్లో ఒక దృశ్యం రాదు. దాదాపు మన హర్యానా రాష్ట్రం కన్నా పెద్దది– కదిలింది. ఇప్పుడేమవుతుంది? ఈ గ్రహం మీద మూడు వంతులు నీరు. ఒక వంతే నేల. నీరు కొన్ని కోట్ల మైళ్ల మేరకు అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనీభవించి ఉండడం వల్ల– మన దేశాలను అంటిపెట్టుకుని ఉన్న సముద్ర మట్టాలు ఇలా స్థిరంగా ఉన్నాయి. మరి రామకృష్ణా బీచ్ దగ్గర సముద్రం వెర్రితలలు వేయడానికీ, ఈ హరియాణా పరిమాణంలో మంచు తెగిపడడానికీ సంబంధం ఉందా? ఉంది బాబూ ఉంది. భూమి ఉపరితలం నానాటికీ వేడెక్కి– మంచు కరిగి– ఈ గ్రహం మీద మిగిలిన ఆ కాస్త భూమినీ ఆక్రమించుకుంటోంది. నేను ఆ మధ్య నార్వేలో ''అరోరా బోరియాలిస్' అనే ప్రకృతి వైభవాన్ని చూడడానికి వెళ్లాను. ట్రోమ్సో అనే ఊరు భూమికి కొన. అక్కడికి 2,500 మైళ్ల వరకూ సముద్రమూ, మంచూ ఉంది. అంటే ''కరగని' మంచు ఈ భూమిని ఎంత కాపాడుతోందో ఊహించవచ్చు. మరి ఈ నీరు తిరగబడితే? కరిగితే? అదిన్నీ– ఓ హరియాణా అంత మంచు ముక్క విరిగి భూమిని ఆక్రమించుకుంటే?

ఇంత పెద్ద విషయాన్ని పామర జనానికి–అంటే మీకూ నాకూ అర్థమయ్యేటట్టు చెప్పడానికి తంటాలు పడుతున్నాను. మొన్న పారిస్ పర్యావరణ సమావేశం నుంచి ట్రంపు దొరగారు– ఈ పర్యావరణ కాలుష్యానికి మా ప్రమేయం లేదు అని సెలవు తీసుకున్నారు కానీ– రేపు తడిసే చాపల్లో వారి చాప పెద్దది.

వాతావరణ నిపుణుల మాటల్ని వీలయినంత చిన్న పదాలలో చెప్పడానికి ప్రయత్నిస్తాను:

మానవాళి ప్రకృతిపై చేస్తున్న జులుంకి ప్రకృతి చాలా క్రూరంగా సమాధానం చెప్పబోతోంది. దానికి సూచనే ఈ మంచు శకలం విడివడటం.

మానవుడు చేస్తున్న అనర్థాన్ని సామూహిక చర్య ద్వారా సవరించవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. పర్యావరణం వేడెక్కడం ఒక నమూనా అనర్థం. ఈ అనర్థానికి పెద్ద వాటా అమెరికాది. కళ్లుమూసుకుని ''నన్ను ముట్టుకోకు'' అని పెదవి విరిస్తే మన చేతల్తో మనమే మన వినాశనాన్ని కొని తెచ్చుకుంటున్నట్టు. ఇందులో తిలాపాపం తలా ఒక్కరిదీ ఉంది.

రాబోయే దశాబ్దాలలో ఉత్తర హిందూదేశం, దక్షిణ పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లోని 1.5 బిలియన్ల ప్రజలు భరించలేని వడగాడ్పులకు లోనవుతారని శాస్త్రజ్ఞులు తేల్చి చెప్పారు. అప్పుడు జనాభా 70 శాతం పెరుగుతుంది. కనీసం రెండు శాతం ఈ వేడికి ఆహుతయిపోతారు. అయితే మన అదృష్టం – మనం అప్పటికి ఉండం. కాకపోతే– మనం మన పిల్లల సంక్షేమాన్ని పూర్తిగా ధ్వంసం చేసి నిష్క్రమిస్తాం.

అంటార్కిటిక్ ప్రాంతంలో ఈ మంచు శకలం విరిగిపడడం– మానవుడు తెలిసి తెలిసి– తనకు తానే తవ్వుకుంటున్న భయంకరమైన గొయ్యి. సర్వనాశనానికి సూచన. ''ప్రళయం'' వస్తుందని మన పురాణాలు చెప్తున్నాయంటారు.

'ప్రైవేటు' సేవలో హెల్త్ వర్సిటీ

- ముందు యాజమాన్య కోటా సీట్ల భర్తీకి వర్సిటీ తహతహ
- ఈనెల 11, 12 తేదీల్లో బి–కేటగిరీ సీట్లకు నోటిఫికేషన్
- అదే తేదీల్లో ప్రముఖ వర్సిటీలన్నీ జాబితా ప్రకటన
- ప్రైవేటు వైద్య కళాశాలలకు మంత్రి అండదండలే కారణమన్న అధికార వర్గాలు
- అందుకే వర్సిటీపై మంత్రి ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణలు
- బి–కేటగిరీ సీట్ల తేదీలపై పునరాలోచిస్తాం: రిజిస్ట్రార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో సీట్లు భర్తీ చేసే ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రైవేట్ వైద్య కళాశాలలకు అనుకూలంగా నడుస్తోంది. వారు ఎలా చెబితే అలా ఆచరిస్తున్న ఘటనలు వైద్య వర్గాలను విస్మయపరుస్తోంది. ఓ వైపు దేశవ్యాప్తంగా ప్రధాన వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కాకముందే రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి తొందరపడుతుండటం చూస్తే దీని వెనుక ప్రైవేటు కళాశాలల ఒత్తిళ్లు ఎలా ఉన్నాయో తెలుసుకోవచ్చు. డీమ్డ్ వర్సిటీలతోపాటు ప్రముఖ వైద్య సంస్థల్లో బి–కేటగిరీ సీట్ల భర్తీకి.. రాష్ట్రంలో బి–కేటగిరీ సీట్ల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ జారీ చేయడంపై ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులను ప్రశ్నిస్తే... మంత్రి ఆదేశాల మేరకే నడుచుకుంటున్నట్టు చెబుతున్నారు.

రెండూ ఒకేరోజు కౌన్సెలింగ్‌పై గందరగోళం

ఈనెల 11న రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి 2వ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ ఇచ్చారు. అదే రోజు దేశవ్యాప్తంగా ఉన్న పలు డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ వర్సిటీలు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నాయి. దీంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. దేశవ్యాప్తంగా పేరున్న డీమ్డ్, సెంట్రల్ వర్సిటీలతోపాటు పలు వైద్య సంస్థల్లో 8,200 సీట్లు ఉన్నాయి. సేవాగ్రాం, మణిపాల్, హిందూ బెనారస్ వంటి పేరున్న వైద్య కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. రాష్ట్రంలో బి–కేటగిరీ సీటుకు ఏడాదికి రూ.12.12 లక్షలు ఉంటే అదే డీమ్డ్ వర్సిటీల్లో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల లోపే ఉంది. రాష్ట్రంలో బి–కేటగిరి సీటుకు ఫీజు చెల్లించి రెండో కౌన్సెలింగ్ తర్వాత రద్దు చేసుకుంటే మొత్తం ఐదేళ్ల ఫీజు రూ.60లక్షలు చెల్లించాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ అభ్యర్థి అయినా తక్కువ ఫీజులున్న సంస్థలో చేరాలనుకోవడం సహజం. కానీ, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు ఆ అవకాశం లేకుండా చేస్తున్నారు. అంతేకాదు.. ఇప్పటివరకూ ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా సీట్లను కూడా భర్తీ చేయకుండానే బి–కేటగిరీ సీట్లకు తొందరపడడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎంసీఐ నిబంధనల ప్రకారం 19 వరకూ గడువు

వాస్తవానికి భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) నిబంధనల ప్రకారం ఈనెల 19లోగా 2వ కౌన్సెలింగ్ నిర్వహించుకోవచ్చునని చెప్పింది. ఈలోగా ప్రధాన వర్సిటీల్లో ఉన్న సీట్లు భర్తీ అయితే ఆ తర్వాత రాష్ట్రంలో ప్రైవేటు కళాశాలల్లో బి–కేటగిరీ సీట్లు భర్తీ చేసుకోవచ్చు. కానీ, ముందుగా రాష్ట్రంలో యాజమాన్య కోటా సీట్లు భర్తీ అయితే చాలు తర్వాత మిగతావి చూసుకోవచ్చునన్న ధోరణిలో యూనివర్సిటీ అధికారులు వ్యవహరించడం విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రంలో నీట్ ప్రవేశ పరీక్షలో 32వేల పైచిలుకు అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో చాలామంది బి–కేటగిరీ సీట్లకు కూడా ఎదురుచూస్తున్నారు. అయినా సరే.. వారికి అవకాశం ఇవ్వకుండా వీలైనంత త్వరగా భర్తీ చేసుకుంటే, చేరిన వాళ్లు సీటు రద్దు చేసుకుని మంచి కళాశాలలకు వెళ్తే ఆ తర్వాత ఆ సీట్లను సీ–కేటగిరీ సీట్లకు మార్చుకోవచ్చునని వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లగా సీట్ల కౌన్సెలింగ్ నిర్వహణ చూస్తున్న హెల్త్ వర్సిటీ అధికారి ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ... ఇలాంటి కౌన్సెలింగ్ తాను ఎప్పుడూ చూడలేదని, దీనివల్ల ప్రతిభ కలిగిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు.

ప్రైవేటుకు మంత్రి అండదండలు పుష్కలం

ప్రైవేటు వైద్య కళాశాలలకు మంత్రి కామినేని శ్రీనివాస్ అండదండలు పుష్కలంగా ఉన్నట్టు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవలే సీనియర్ రెసిడెన్సీ విషయంలో కూడా ప్రైవేటులో చదివిన వైద్య విద్యార్థులు ప్రైవేటులో ఏడాది సర్వీసు చేసుకోవచ్చని జీవో నెం.99ను ఇచ్చారు. దీనిపై కొంతమంది అభ్యర్థులు కోర్టునాశ్రయించడంతో దానిని రద్దు చేశారు. బాలకృష్ణ బంధువు ఎంవీఎస్ మూర్తి కళాశాల గీతంకు డీమ్డ్ హోదా ఇవ్వడంలోనూ మంత్రి కామినేని అప్పట్లో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. ఇక ఫాతిమా విద్యార్థులకు ఎలాంటి న్యాయమూ చేయలేకపోయారన్న అపవాదూ లేకపోలేదు.

ఆ తేదీల్లో కౌన్సెలింగ్ అంటే అభ్యర్థులకు కష్టమే

ఈనెల 11, 12వ తేదీల్లో బి–కేటగిరీ సీట్లకు కౌన్సెలింగ్ అంటే అభ్యర్థులకు కష్టమే. అదే తేదీల్లో ప్రముఖ వర్సిటీలన్నీ జాబితా ప్రకటిస్తున్నాయి. ఈనెల 8, 9 తేదీల్లో ఈ జాబితా ఇస్తారని తెలిసి ఇచ్చాం. ఎంసీఐ నిబంధనల ప్రకారం 19వరకూ 2వ కౌన్సెలింగ్‌కు సమయముంది. గురువారం ఒకసారి దీనిపై వీసీతో మాట్లాడి ఏ మాత్రం అవకాశమున్నా తేదీలు మార్చేందుకు ప్రయత్నిస్తాం.

– డా.ఎస్.అప్పలనాయుడు,
రిజిస్ట్రార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా ఆచార్య హరశ్రీరాములు



నూజివీడు: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాల డైరెక్టర్‌గా ఆచార్య సాసుబిల్లి హరశ్రీరాములు బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగంలో 31 సంవత్సరాలు ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయనను ఆర్జీయూకేటీ చాన్సలర్ రాజిరెడ్డి శ్రీకాకుళం డైరెక్టర్‌గా నియమించారు. ప్రొఫెసర్‌గానే కాకుండా హెచ్‌వోడీగా, వైజాగ్‌లోని సెంటర్ ఫర్ రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారు. భువనేశ్వర్‌లోని మిట్స్ స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీకి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ స్థాయిలోని బయోటెక్నాలజీ బోర్డు సభ్యుడిగా, రాష్ట్రస్థాయిలోని కాలుష్య నియంత్రణ మండలి గౌరవ సభ్యుడిగా కొనసాగుతున్నారు. బోధనా రంగంలో ఆరు పుస్తకాలు రాయడంతో పాటు, వివిధ అంశాలపై 116 పరిశోధనపత్రాలను ఆయన సమర్పించారు. శ్రీకాకుళం డైరెక్టర్ పదవికోసం 75 మంది వరకూ దరఖాస్తు చేసుకోగా హరశ్రీరాములను నియమించారు.

మూడు పిల్లలకు జన్మనిచ్చిన సింహం

తిరుపతి మంగళం: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో కుమారి అనే సింహం మూడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ పిల్లలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు జూ క్యూరేటర్ వై.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇటీవల ఎస్వీ జూలో పులులు, సింహాలు సుమారు 22 పిల్లలకు జన్మనిచ్చాయి. పులులు, సింహాల పిల్లల సందడితో జూలో అహ్లాదకర వాతావరణం నెలకొంది.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి- కాచిగూడ మధ్య నడపండి

రైల్వే మంత్రికి ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, మైసూరారెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: రాయసీమ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి–హైదరాబాద్ మధ్య కాకుండా తిరుపతి–కాచిగూడ మధ్య నడిపి ప్రయాణ దూరాన్ని తగ్గించాలని రైల్వేశాఖ మంత్రి సురేశ్‌ప్రభుకు టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మైసూరారెడ్డి, మాజీ ఎంపీ సి.రామచంద్రయ్య విజ్ఞప్తిచేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను మహబూబ్‌నగర్, గద్వాల్, రాయచూర్ మీదుగా మళ్లిస్తే రాయలసీమ ప్రజలు హైదరాబాద్ చేరుకోవడానికి రెండు గంటల సమయం తగ్గుతుందన్నారు.

ట్రిపుల్‌ఐటీల్లో మరిన్ని సూపర్‌న్యూమరరీ సీట్లు

వీసీ ఆచార్య వేగేశ్న రామచంద్రరాజు

నూజివీడు: రాష్ట్రంలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కాలేజీలకు సంబంధించి మరిన్ని సూపర్ న్యూమరరీ సీట్లు రానున్నట్లు ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య వేగేశ్న రామచంద్రరాజు బుధవారం తెలిపారు. రాష్ట్రంలో 122 మండలాల్లో ట్రిపుల్ ఐటీలకు ఒక్కళ్లు కూడా ఎంపికకాని నేపథ్యంలో ప్రభుత్వం 122 సీట్లు సూపర్‌న్యూమరరీ సీట్లు మంజూరు చేయగా, వాటికి అడ్మిషన్‌లు నిర్వహించినట్లు తెలిపారు. అయితే ఆర్జీయూకేటీ చాన్సలర్ డి.రాజిరెడ్డి 122 మండలాల్లో సామాజికంగా న్యాయం చేయాలనే ఆశయంతో అన్ని వర్గాలకూ ఒక్కో సీటు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరిన మీదట ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు, ఓసీలకు మూడేసి సీట్ల చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. అయితే దీనిపై జీవో విడుదల కావాల్సి ఉందన్నారు. గతంలోని 122 సీట్లను ఏ ఏ సామాజిక వర్గాలు పొందాయో వాటిని మినహాయించి మిగిలిన వారికి సీట్లు ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఎన్ని సీట్లు అనేది నిర్ణయానికి రాలేదని, జీవో విడుదలయ్యాక ఎన్ని సీట్లో ప్రకటించి భర్తీచేస్తామని వివరించారు.

డ్రగ్స్ రాకెట్‌పై సీబీఐతో విచారణ జరిపించండి

ప్రధానికి లేఖరాసిన డ్రగ్స్ వ్యతిరేక సంస్థ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణతోపాటు దేశంలో పెరుగుతోన్న డ్రగ్స్ రాకెట్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ప్రధాని మోదీకి నేషనల్ యాంటీ డ్రగ్ వారియర్స్ సంస్థ బుధవారం లేఖ రాసింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కనిమొళికి కూడా ఈ మేరకు వినతిపత్రం అందించినట్టు సంస్థ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

అవినీతి అధికారికి రెండేళ్ల జైలు

విజయవాడ లీగల్: లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంగయ్య బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా, రావులపాలెం ఫారెస్టు సెక్షన్ అధికారి కె.వెంకటరమణమూర్తి. ఆత్రేయపురానికి చెందిన డి.శంకర శివానందం ఎస్‌జీఆర్‌వై పథకంలో రోడ్ల పక్కన చెట్లు నాటడం తదితర పనులకు కాంట్రాక్టర్. ఆయనకు కాంట్రాక్టుకు సంబంధించిన నిధులు ఇచ్చేందుకు వెంకటరమణమూర్తి లంచం డిమాండ్ చేశాడు. 2005 మే 26న లంచం తీసుకుంటుండగా రాజమండ్రి రేంజ్ ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

58 ఏళ్లకే రిటైరైన ఉద్యోగులకు ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: పదవీ విరమణ వయసు పెంపునకు సంబంధించిన అంశంలో వివిధ కార్పొరేషన్ సంస్థలు, సొసైటీలు, గిరిజన, సాంఘిక, గురుకుల విద్యా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సుప్రీం కోర్టు బాసటగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆంధ్రప్రదేశ్‌లో వయోపరిమితి పెంపును అమలు చేయలేదని ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ అంశంలో ఇదివరకే మే నెలలో మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తూ అందరికీ పదవీ విరమణ పెంపును వర్తింపజేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈనెల 8న ఆయా సంస్థల్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసును కూడా 60 ఏళ్లకు పెంచుతూ తక్షణం అమలులోకి వస్తుందని పేర్కొంది. అయితే మిగిలిన ఉద్యోగుల్లాగే రాష్ట్ర విభజన సమయం నుంచే తమకూ వర్తింపజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఉద్యోగులు విన్నవించుకున్నారు. వారి తరఫున సీనియర్ న్యాయవాదులు ఆదినారాయణ రావు, వై.రాజగోపాలరావు, ఎం.ఎస్.రావు, వి.వి.ఎస్.రావు, అల్లంకి రమేశ్ తదితరులు వాదనలు వినిపించారు. ఇప్పటికే నష్టపోయిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని వారు న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. 58 ఏళ్లకే పదవీ విరమణ పొంది ఉండి.. ఇంకా పదవీ విరమణ వయస్సు దాటనిపక్షంలో వారిని ఉద్యోగంలో కొనసాగనివ్వాలని, దాటిన పక్షంలో వారు ఉద్యోగం నుంచి వైదొలిగిన సమయం నుంచి వారికి 60 ఏళ్ల వయస్సు వచ్చిన నాటికి గల కాలానికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అమలు చేయకపోతే అధికారులను బాధ్యులుగా చేయాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు మరోసారి హెచ్చరించింది.

కాకినాడ ఎన్నికకు ఎ-ఫారం అందజేత

అడిషనల్ కమిషనర్‌కు ఇచ్చిన విజయసాయిరెడ్డి



అడిషనల్ కమిషనర్‌కు ఎ-ఫారం అందజేస్తున్న విజయసాయిరెడ్డి

కాకినాడ: కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల బి-ఫారాలకు సంబంధించి ఎ-ఫారాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అదనపు కమిషనర్ వై. శ్రీనివాసరావుకు అందజేశారు. బి-ఫారం జారీచేసే అధికారాన్ని విజయసాయిరెడ్డికి ఇస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన లేఖను ఆయన పార్టీ నేతలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి ఏసీకి అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, పాముల రాజేశ్వరీదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, మిండగుదిటి మోహన్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'కాకినాడ' ఎన్నికల వ్యాజ్యాలపై మొదలైన వాదనలు

సాక్షి, హైదరాబాద్: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజన జీవో, ఎన్నికల నోటిఫికేషన్‌లను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ఉమ్మడి హైకోర్టులో వాదనలు మొదలయ్యాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎం.ఎస్. ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, కాకినాడ కార్పొరేషన్‌లో మూడు గ్రామాల విలీనంపై గతంలో హైకోర్టు స్టే విధించిందన్నారు. ఆ మూడు గ్రామాలను కలిపి రెండు వార్డులుగా చేసి, మొత్తం 50 వార్డులకు ఎన్నికల నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. గతంలో స్టే ఇచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఆ వార్డులను మినహాయించి మిగిలిన 48 వార్డులకు ఎన్నికలు నిర్వహించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వార్డుల పునర్విభజనకు ముందు కూడా 50 వార్డులే ఉన్నాయని, వాటినే పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవని వివరించారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తరువాత ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వి.వి.ప్రభాకరరావు వాదనలు వినిపిస్తూ, హైకోర్టు ఆదేశాలతో 48 వార్డులకే ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీలు

ఆయుష్ కమిషనర్‌గా సుజాతాశర్మకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు చెందిన నలుగురు అధికారులను ప్రభుత్వం బదిలీచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) చీఫ్ జనరల్ మేనేజరుగా పనిచేస్తున్న డాక్టర్ గోపీనాథ్ కర్నూలు ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్)గా బదిలీ అయ్యారు. రాష్ట్ర అటవీ దళాల అధిపతి కార్యాలయంలో సీసీఎఫ్‌గా పనిచేస్తున్న ఆర్‌కే సుమన్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆయుష్ కమిషనర్‌గా పనిచేస్తున్న రేవతి రాష్ట్ర అటవీ దళాల అధిపతి కార్యాలయంలో విజిలెన్స్ విభాగం ముఖ్య అటవీ సంరక్షణాధికారిగా బదిలీ అయ్యారు. ఎర్రచందనం పరిరక్షణకు సంబంధించిన టాస్క్‌ఫోర్సు విభాగంలో ఉప సంరక్షణాధికారిగా ఉన్న బీఎన్ఎన్ మూర్తి ఏపీఎఫ్‌డీసీ ఎకో టూరిజం విభాగం కార్యనిర్వాహక డైరెక్టర్ (ఈడీ)గా బదిలీ అయ్యారు. కర్నూలులో సీసీఎఫ్‌గా పనిచేస్తున్న జేఎస్ఎన్ మూర్తిని తదుపరి పోస్టింగ్ కోసం రాష్ట్ర అటవీ దళాల అధిపతికి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యనిర్వాహక శాఖ ప్రత్యేక కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యనిర్వాహక డైరెక్టర్‌గా ఉంటున్న ఐఏఎస్ అధికారి సుజాతా శర్మకు ఆయుష్ విభాగం కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి విలేకరికి ఎస్ఎస్ఏ పురస్కారాలు

సాక్షి, అమరావతి: డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ విద్యారంగ వార్తాకథన పురస్కారం-2016లను ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ బుధవారం ప్రకటించింది. ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు చెందిన పాత్రికేయుడు షేక్ జానీబాషా (సాక్షి), కృష్ణా జిల్లా పెడనకు చెందిన పాత్రికేయుడు వీవీకే వెంకటేశ్వరరావు (ఈనాడు)లు ఈ పురస్కారాలకు ఎంపికైనట్టు సర్వశిక్షా అభియాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడలో త్వరలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని ఆ ప్రకటనలో తెలిపారు.



నంద్యాల ఉప ఎన్నికలో భాగంగా... బుధవారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి నంద్యాల పట్టణం 33వ వార్డులో ప్రచారం నిర్వహించారు. - నంద్యాల

నంద్యాలలో టీడీపీ ఓటమి ఖాయం: నల్లి రాజేశ్

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి భూ కబ్జాలు, కుంభకోణాలకు పాల్పడుతున్న టీడీపీ ప్రభుత్వానికి నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి తప్పదని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నల్లి రాజేశ్ హెచ్చరించారు. నెల్లూరులో బుధవారం మాల మహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్ విలేకరులతో మాట్లాడారు.



స్వామిరెడ్డి మృతదేహాన్ని కర్రకు కట్టి కొండలు లోయల మధ్య తరలిస్తున్న బంధువులు

పాపం.. గిరిపుత్రుల వెతలు

- రహదారుల్లేక మన్యంవాసుల ఇక్కట్లు
- ఆస్పత్రికి వెళ్లాలన్నా ఆగచాట్లే
- రాజమహేంద్రవరం ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని గ్రామానికి చేర్చేందుకు అష్టకష్టాలు పడ్డ గిరిజనులు

మారేడుమిల్లి (రంపచోడవరం): ఏజెన్సీ అభివృద్ధికి పాలకులు బాటలు వేస్తామంటున్నారే తప్ప కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదనడానికి ఈ కష్టమే ఓ సాక్ష్యం. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయించేందుకు కొండలు, లోయలు దాటి రోగిని మైళ్ల తరబడి మోసుకుంటూ తీసుకువెళ్లే పరిస్థితి ఏజెన్సీలోని కుగ్రామాల్లో ఉంది. రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజనుడి మృతదేహాన్ని గ్రామానికి చేర్చేందుకు అష్టకష్టాలు పడిన ఉదంతం బుధవారం వెలుగులోకి వచ్చింది.

మృతిచెందిన మూడురోజులకు..

తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం మండలం దారగడ్డ పంచాయతీకి చెందిన కారమామాడి గొంది కుగ్రామం. కొండలు, వాగులు, పుట్టలు దాటుకుంటూ అక్కడి వెళ్లాలి. గత శుక్రవారం రంపచోడవరం సమీపంలో ఆటో ప్రమాదంలో కారమామిడిగొందికి చెందిన గిరిజనుడు పల్లాల స్వామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడె మృతి చెందాడు. 5వ తేదీ సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కారమామిడిగొంది చేరుకోవడానికి సమయం సరిపోనందు న ఆ రాత్రి మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఉంచారు. 6వ తేదీన అంబులెన్స్‌లో దారగడ్డవార కు తరలించారు. అక్కడ నుంచి మృతదేహాన్ని కర్రకు కట్టి రాళ్ల మార్గంలో కొండలు, లోయల మధ్య ప్రమాదకరమైన దారుల్లోంచి దాదాపు పది కిలోమీటర్లు అతి కష్టంపై మోసుకువెళ్లి 8వ తేదీన అంటే మంగళవారం గ్రామానికి చేర్చి అదే రోజు అంత్యక్రియలు ముగించారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. బొడ్డగంటి పంచాయతీ పరిధిలోని చాపరాయి గ్రామంలో విష జ్వరాలతో 16 మంది గిరిజనులు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ గ్రామం కూడా చాపరాయికి సమీపంలోనే ఉంది. పాలకులు మాటలు మానుకుని చేతలు చూపాలని, ఇప్పటికైనా తమ గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని ఈ గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, శాంతరెడ్డి, మంగిరెడ్డి, పల్లాల సుగ్గయ్య, పల్లాల లక్ష్మయ్య కెచ్చెల సీతయ్య తదితరులు కోరుతున్నారు.

పదవికి వన్నె తెచ్చేలా పని చేస్తా..

- అర్థవంతమైన చర్చ జరిగేలా రాజ్యసభను నడిపిస్తా
- పార్టీకి దూరమవుతుంటే బాధగా ఉంది
- విలేకరులతో ఇష్టాగోష్టిలో వెంకయ్యనాయుడు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎంతో ఉద్వేగానికి లోనయ్యానని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు అన్నారు. తాను ముక్కు సూటి మనిషినని, ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చేలా పని చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై సభలో అర్థవంతమైన చర్చ జరిగేలా నడిపిస్తానని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, హిదాయతుల్లా, జాకీర్ హుస్సేన్ వంటి వారు సభను నడిపిన తీరును అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ఇదే తన చివరి పాత్రికేయ సమావేశమని చెప్పారు. 20 ఏళ్లుగా ఎంపీగా పని చేసిన వ్యక్తి ఉపరాష్ట్రపతి కావడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని, పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలంటే బాధగా ఉందని వ్యాఖ్యానించారు. ఇకపై రాజకీయాలు మాట్లాడనని, ప్రజా జీవితంలో దేశానికి అవసరమైన విషయాలపైనే మాట్లాడతానని, దేశాభివృద్ధే ఎజెండాగా ఉంటానని స్పష్టం చేశారు. ఇప్పటివరకు దేశంలోని 623 జిల్లాల్లో పర్యటించినట్లు ఆయన చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో కనీసం 20 సార్లు పర్యటించానని, రాజకీయ నేతలు ప్రజల్లో ఉంటేనే రాణిస్తారని పేర్కొన్నారు. 1972 జై ఆంధ్ర ఉద్యమం కోసం పోరాటం చేశానని, తనకు మీడియా అత్యంత ప్రాధాన్యం కల్పించిందని తెలిపారు. 1991 నుంచి బీజేపీ జాతీయ ఆఫీసులో పని చేసిన అందరినీ సన్మానించినట్లు చెప్పారు. పని, మీటింగులు అంటే చాలా సరదా అని, నాయకుడు అనే వాడు ఎంత తిరిగితే అంత పేరు వస్తుందని పేర్కొన్నారు. 'బీజేపీ ఆఫీసుకు దూరం అవుతున్నా. ఎవరు రాజకీయ విమర్శలు చేసినా ప్రతివిమర్శలు చేసే వరకు నాకు నిద్ర పట్టదు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి అయిన అరగంటకే పార్టీకి రాజీనామా చేశా. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాత రాజ్యసభకు రాజీనామా చేయమని అమిత్ షా చెప్పారు. లేకపోతే రాజ్యసభకు అప్పుడే రాజీనామా చేసేవాడిని..' అని వివరించారు. తన కుటుంబ సభ్యులకు రాజకీయం తెలియదని, వారిని రాజకీయాల్లోకి ప్రోత్సహించ లేదని తెలిపారు. వారసత్వ రాజకీయాలు మంచివి కావని, జవసత్వంతో రాజకీయాల్లోకి రావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, బీజేపీ ఎల్పీనేత కిషన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి భూములపై ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతి భూముల్లో అక్రమాలపై స్పందించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, సివిల్ సర్వీసెస్ అధికారులు, జర్నలిస్టులు తదితర విశేష వ్యక్తులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో మాజీ ఎమ్మెల్యే అడుసుమల్లి జయప్రకాష్, రిటైర్డ్ లెక్చరర్ లక్ష్మణ రెడ్డి వల్లం రెడ్డి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం రాష్ట్ర సర్కారుకు నోటీసులు జారీ చేసింది. ఇళ్ల స్థలాల కేటాయింపుపై ఒక విధానం ఉంటే సబబుగా ఉంటుందని.. కేంద్రం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ విషయంలో తమ వైఖరిని తెలపాలని గత విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అయితే అటార్నీ జనరల్ మారినందున తన వైఖరిని తెలిపేందుకు మరికొంత సమయం కావాలని కేంద్రం అడగడంతో ధర్మాసనం విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఏఏ సూత్రాల ప్రాతిపదికన స్థలాలు కేటాయిస్తున్నారు? నిర్దిష్ట సొసైటీలు, వ్యక్తులకు మాత్రమే ఎందుకు స్థలాలు కేటాయిస్తున్నారన్న రెండు ప్రాథమిక అంశాలపై లోతుగా విచారణ జరుపుతామని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి విధానం లేకుండా వందలాది ఎకరాలను వివిధ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఇంప్లీడ్ పిటిషన్ వేసిన అడుసుమల్లి జయప్రకాష్, లక్ష్మణ రెడ్డిల తరపు సీనియర్ న్యాయవాదులు సత్యప్రసాద్, మహేష్ బాబు వివరించారు. అనేక సంస్థలకు వందలాది ఎకరాలు కట్టబెట్టిందని చెబుతూ సంబంధిత జీవోలను పిటిషన్‌కు జతపరిచారు. విశాఖపట్నంలోనూ ప్రభుత్వ భూములను మాయం చేశారన్నారు.

సుద్దాల, గోరటికి జాలాది పురస్కారాల ప్రదానం



సుద్దాల అశోక్‌తేజ, గోరటి వెంకన్నలను సత్కరిస్తున్న మంత్రి గంటా, జాలాది విజయ, సినీనటి యమున తదితరులు

విశాఖ కల్చరల్: జాలాది రచనలు అద్భుతం, అనితరసాధ్యమని ప్రముఖ సినీరచయిత సుద్దాల అశోక్‌తేజ కొనియాడారు. సుప్రసిద్ధ సినీగేయ రచయిత, రంగస్థల ప్రయోక్త డాక్టర్ జాలాది రాజారావు 86వ జయంతి వేడుక సిరిపురం వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ, ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్నలకు జాలాది పురస్కారాలను రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, జాలాది ట్రస్ట్ వ్యవస్థాపకురాలు జాలాది విజయ తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా సుద్దాల మాట్లాడుతూ జాలాది, కొసరాజులు సినీజగత్తులో రారాజులని, వారి స్ఫూర్తితోనే 23 సంవత్సరాలుగా రచనలు చేస్తున్నట్లు తెలిపారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ జాలాదిని తమిళంలో భైరవమూర్తితో పోల్చారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు ఆలపించిన జాలాది గీతాలు సభికులను అలరించాయి. సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, నటి యమున, పలువురు టీవీ, సినీ కళాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నంద్యాలలో తిష్టవేసిన మంత్రులను ఖాళీ చేయించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

సాక్షి, అమరావతి: నంద్యాల ఉపఎన్నిక కోసం అక్కడ తిష్టవేసిన మంత్రులు అందరినీ ఖాళీ చేయించేందుకు ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంత్రులంతా కరువు ప్రాంతాల్లోని రైతులను ఆదుకోకుండా.. ఉపఎన్నిక కోసం నంద్యాలలో మకాం వేస్తారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బుధవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రామకృష్ణ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 237 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రాయలసీమలో వేరుశనగ ఎండిపోయిందని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై చంద్రబాబు ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు.

నంద్యాలబరిలో 15 మంది

ముగిసిన నామినేషన్ల ఘట్టం
9 మంది నామినేషన్ల ఉపసంహరణ

నూనెపల్లి (నంద్యాల): కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక నామినేషన్ల ఘట్టం బుధవారం ముగిసింది. తుదిపోరుకు 15 మంది అభ్యర్థులు సిద్ధమయ్యారు. గత నెల 29 నుంచి ఈ నెల 5 వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 30 మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 7న పరిశీలన (స్క్రూట్నీ) చేపట్టగా.. ఆరుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఉపసంహరణకు చివరిరోజైన బుధవారం తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 15 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్.చంద్రమోహన్‌రెడ్డి (శిల్పా మోహన్‌రెడ్డి), టీడీపీ తరఫున భూమా బ్రహ్మానందరెడ్డి పోటీ చేస్తున్నారు. వీరితో పాటు వివిధ పార్టీల తరఫున గడ్డం అబ్దుల్ సత్తార్ (కాంగ్రెస్), రావుస్ సుబ్రహ్మణ్యం (నవతరం పార్టీ), షేక్ మహబూబ్‌బాషా (అన్న వైఎస్ఆర్ పార్టీ), గాజుల అబ్దుల్ సత్తార్ (బీసీ యునైటెడ్ ఫ్రంట్), భవనాసి పుల్లయ్య (ఆర్పీఎస్), రాఘవేంద్ర (సమాజ్‌వాదీ పార్టీ), రెడ్డప్ప వల్లిగట్ల (రాజ్యాధికార పార్టీ) ఉన్నారు. ఇంకా ఎం.నాగనవీన్, ఎస్.రఘునాథరెడ్డి, సంగ లక్ష్మీకాంతరెడ్డి, భూపండపాడు నరసింహులు, బాలసుబ్బయ్య, బి.గురువయ్య స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు.

బాబూ.. నంద్యాలలో నీ గ్రాఫిక్స్ పనిచేయవు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రోజా



రోజాను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ బెంగళూరు వింగ్ నాయకులు, అభిమానులు

వైట్‌ఫీల్డ్ (బెంగళూరు): నంద్యాల ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలని సీఎం చంద్రబాబు కుటిల పన్నాగాలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా ధ్వజమెత్తారు. మూడేళ్లయినా ఎన్నికల హామీలను నెరవేర్చని చంద్రబాబు.. నంద్యాలలో కూడా గ్రాఫిక్స్‌తో మాయ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కానీ చంద్రబాబు గ్రాఫిక్స్ నంద్యాలలో పనిచేయవన్నారు. బుధవారం బెంగళూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రోజా.. మీడియాతో మాట్లాడారు. 13 జిల్లాల్లో ఎలాంటి అభివృద్ధి చేయని చంద్రబాబు.. నంద్యాలలో మాత్రం ఏం చేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచి టీడీపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు.. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మాట్లాడుతుండే ప్రజలు నవ్వుతున్నారన్నారు. దిగజారుడు రాజకీయాలు చేస్తున్న మంత్రులు అఖిలప్రియ, ఆదినారాయణరెడ్డి, అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ తదితరులకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాగా, నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని రోజా చెప్పారు.

మంత్రులకు ప్రొటోకాల్ వద్దు

కర్నూలు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం ఆదేశాలు

సాక్షి, అమరావతి: నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఎలాంటి ప్రొటోకాల్ సదుపాయాలు కల్పించరాదని, అలాగే రాష్ట్ర గెస్ట్‌హౌసుల్లో వసతి కల్పించరాదని రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం కార్యదర్శి బుధవారం కర్నూలు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా అంతటా ఈ నెలాఖరు వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అప్పటి వరకు ఎన్నికకు సంబంధించి పర్యటనలకు వచ్చే మంత్రులకు ఎలాంటి ప్రొటోకాల్ కల్పించరాదని ఆదేశించారు. నంద్యాల ఉప ఎన్నికకు సంబంధించిన అధికారులందరూ ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేస్తారు. ఈ నేపథ్యంలో మంత్రుల పర్యటనల సమయంలో అధికారులను సమావేశాలకు ఆహ్వానించరాదని, అధికారులు కూడా అలాంటి సమావేశాలకు హాజరు కాకూడదని ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

నిఘా తంత్రం.. ఇదేం చోద్యం!




- నంద్యాల్లో వార్డుల వారీగా అధికారులకు బాధ్యతలు
- రంగంలోకి ఇంటెలిజెన్స్, ఎస్బీ, రెవెన్యూ, విజిలెన్స్ బృందాలు
- వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల వద్ద కాపలా

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి : నంద్యాల ఉప ఎన్నికలో గెలుపు కోసం అధికార పార్టీ అన్ని విలువలకూ పాతరేసింది. ఎలాగైనా విజయం సాధించాలని ప్రభుత్వ అధికారులను సైతం వాడుకుంటోంది. అధికారులకు దిశా నిర్దేశం చేసి.. కార్యకర్తల్లా వార్డుల్లో తిప్పుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ఇంటెలిజెన్స్, రెవెన్యూ, ఎస్బీ, విజిలెన్స్ అధికారులకు వార్డుల వారీగా బాధ్యతలు అప్పగించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని.. వారి నివాసాల వద్ద కాపలా పెట్టింది. ఈ నెల 23న జరగనున్న ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని వారి సర్వేల్లోనే వెల్లడవడంతో సర్కారు పెద్దలు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రయోజనాల కోసం పని చేయాల్సిన వివిధ శాఖలకు చెందిన సుమారు 500 మంది అధికారులను అక్రమంగా వాడుకుంటోంది. రెవెన్యూ శాఖ నుంచి 45 మంది, విజిలెన్స్ నుంచి 39, ఇంటెలిజెన్స్ నుంచి 51, ఎస్బీ నుంచి 63 మందితో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని 250 మందికిపైగా రంగంలోకి దింపింది. సర్కారు తరఫున విధులు నిర్వర్తిస్తున్న వారిలో కానిస్టేబుల్ మొదలు.. డీఎస్పీ, ఎస్పీ స్థాయి అధికారుల వరకు ఉన్నారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహశీల్దార్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు ఉన్నారు. వీరందరినీ బృందాలుగా విభజించి వార్డు బాధ్యతలను అప్పగించారు. వీరికి విడియో కెమెరాలు ఇచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల నివాసాల వద్ద కాపలా ఉంచారు. వీరు వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ప్రతి కార్యకలాపాన్ని వీడియోలో చిత్రీకరించి వెంటనే ప్రభుత్వ పెద్దలకు వాట్సప్ ద్వారా పంపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

ఓటమి భయంతో అధికార పార్టీ కుత్ర రాజకీయాలకు తెరలేపింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి బంధువులు, స్నేహితుల పూర్తి వివరాలను అధికారుల ద్వారా సేకరించే పనిలో నిమగ్నమైంది. వార్డుల్లో బలాబలాల వివరాలను తెప్పించుకుని.. టీడీపీ బలహీనంగా ఉన్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఓటు బ్యాంకు ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను.. అధికారులు సేకరించిన వివరాల ఆధారంగా భయభ్రాంతులకు గురిచేసి లొంగదీసుకునే పనిలో పడింది. వైఎస్సార్‌సీపీ నేతల నివాసాలకు ఎవరెవరు వస్తున్నారు? వారి వివరాలతో పాటు వీడియోలు, ఫొటోలు తెప్పించుకుంటున్నారు. వాటి ఆధారంగా టీడీపీ నేతలు వారితో రాయబారాలు నెరిపే పనిలో పడ్డారు. తటస్థంగా ఉన్న వారిపై నిఘా పెట్టారు.



అధికారులపైనా నిఘా

పార్టీ గెలుపు కోసం అధికారులు పనిచేస్తున్నారా? లేదా? అని విషయాన్ని నిర్ధారించుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో వివరాలు తెప్పించుకుంటున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఒకరు తీవ్రంగా జ్వరం రావటంతో బుధవారం తనకు కేటాయించిన గదికే పరిమితమయ్యారు. ఈ విషయాన్ని వివరించినా వినిపించుకోకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షోకు వెళ్లి.. ఏం జరుగుతోందో తెలియజేయాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. వెళ్లకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించినట్లు బాధిత డిప్యూటీ తహసీల్దార్ తోటి ఉద్యోగి వద్ద కన్నీరు పెట్టుకున్నట్టు సమాచారం.


చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే..ఔనా? కాదా? అని వైఎస్ జగన్ అడగ్గా... ఔను అంటూ చేతులెత్తిన నంద్యాల మండలం కానాల గ్రామస్తులు


గోస్పాడు మండలం జూలెపల్లె గ్రామంలో రోడ్‌షోలో ప్రసంగిస్తున్న ప్రతిపక్షనేత

నా గుండెల్లో నంద్యాల

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


హైస్కూల్‌కొట్టాల, చింతకుంట గ్రామాల మధ్య వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న విపక్షనేత

- అధికారం కోసం దిగజారిపోయే మనస్తత్వం లేదు..
- జగన్ మాట ఇస్తే తప్పడు.. చెప్పింది చేస్తాడు..
- విలువలతో కూడిన రాజకీయాలు నా ఆస్తి..
- ఉప ఎన్నికలో న్యాయానికి ఓటేయండి
- ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ రోడ్ షో

సాక్షి ప్రతినిధి, కర్నూలు

‘‘నంద్యాలను నా గుండెల్లో పెట్టుకుంటా. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా నంద్యాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తా. నంద్యాలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతా’’ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు స్థానిక రైతు నగరం నుంచి ప్రారంభమైన జగన్ రోడ్ షో రాత్రి 9 గంటల వరకూ పసురు పాడు వరకూ సాగింది. ఈ సందర్భంగా అశేషంగా హాజరైన జనాన్ని ఉద్దేశించి జగన్ పలు చోట్ల ప్రసంగించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ పెట్టబట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, తెలుగుదేశం పార్టీకి చెందిన పెద్ద పెద్ద నేతలు నంద్యాల రోడ్లపై తిరుగుతున్నారని జగన్ వ్యాఖ్యానించారు. ఎన్నిక ఏకగ్రీవం చేసి ఉంటే వీరంతా నంద్యాలవైపు తొంగిచూసేవారా అని ఆయన ప్రశ్నించారు. ఈ ఓటు ద్వారా నంద్యాల ప్రజలు ధర్మం, న్యాయం వైపు నిలిచారని రాష్ట్ర ప్రజలకు తెలియజెప్పాలని పిలుపునిచ్చారు. ‘‘మీరు వేసే ఓటుతో నేను సీఎం కాకపోవచ్చు. కానీ ఈ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు మోసాలకు, అన్యాయానికి, అబద్ధాలకు, అధర్మానికి, అవినీతికి వ్యతిరేకంగా మీరు ఓటు వేస్తున్నారు. ఇవాళ జరిగే ఈ ఉప ఎన్నికలు... రాబోయే కురుక్షేత్ర మహా సంగ్రామానికి నాంది పలకాలని కోరుతున్నా’’ అని జగన్ పిలుపు నిచ్చారు. చంద్రబాబు మాదిరిగా తన దగ్గర డబ్బుల మూటలు, పోలీసు బలగం, ముఖ్యమంత్రి పదవి, బాకా ఛానళ్లు, పత్రికలు లేవని.... దివంగత ముఖ్యమంత్రి, నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డి మీద మీకున్న అభిమానం. నాన్న సంక్షేమపథకాలు ఇంకా మీ గుండెల్లో బతికే ఉండడమే నాకున్న ఆస్తి అని పేర్కొన్నారు. ‘‘జగన్ అబద్ధం ఆడడు. జగన్ మోసం చేయడు... జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు అన్న విశ్వసనీయ రాజకీయాలే నాకు ఉన్న బలం’’ అని ఆయన వివరించారు. అహంకారంతో చంద్రబాబుకు కళ్లు నెత్తికి ఎక్కాయి. డబ్బుతో ఎమ్మెల్యేల మాదిరిగా ప్రజలనూ కొనవచ్చునని అనుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు మొట్టికాయలు వేసి... అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు శిల్పా మోహన్ రెడ్డి మీద చూపించి ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ పెట్టబట్టే....!

‘‘ఈ ఎన్నికలు ఎందుకు జరుగుతున్నాయనే విషయం మీకు తెలిసిందే. ధర్మానికి, అధర్మానికి....న్యాయానికి, అన్యాయానికి మధ్య యుద్ధంగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. నంద్యాల ఎన్నికలు రాకముందు ఎప్పుడైనా నంద్యాల రోడ్ల మీద చంద్రబాబు, మంత్రులు, ఆ పార్టీ నేతలు కనిపించారా? నంద్యాలలో తిష్టవేయడం ఎప్పుడైనా కనిపించిందా? మూడున్నర సంవత్సరాల కాలంలో ఏ రోజూ నంద్యాల అభివృద్ధి గురించి చంద్రబాబు పట్టించుకోలేదు. కానీ ఇపుడు అందరూ నంద్యాలరోడ్ల మీద ఎందుకు తిరుగుతున్నారు. ఇన్ని రోజులు గుర్తుకురానివాళ్లం ఇవ్వాళే ఎందుకు గుర్తుకొచ్చామంటే....ఇక్కడ ఉప ఎన్నికలు వచ్చాయి కాబట్టి....వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ పెట్టింది కాబట్టి. తెలుగుదేశంపార్టీ నాయకులు, చంద్రబాబు, మంత్రులు ఇక్కడకు వచ్చినప్పుడు అడగండి. నంద్యాలలో ఈ ఉప ఎన్నికలు రాకపోతే, ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పోటీ పెట్టకపోతే నంద్యాలకు వచ్చేవారా? అదే ఈ ఎన్నికలో జగన్ అనే వ్యక్తి పోటీపెట్టకుండా ఏకగ్రీవం అని ఉంటే చంద్రబాబు నంద్యాల రోడ్లపై తిరుగుతూ ఇక్కడే తిష్టవేసేవారా అని అడుగుతున్నా. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పోటీ పెట్టింది కాబట్టే చంద్రబాబు అనే వ్యక్తి మోసపూరితంగా జీవోలు ఇస్తున్నారు...శంకుస్థాపనలు చేస్తున్నారు. చంద్రబాబు నైజం గురించి భూమా నాగిరెడ్డి బావమరిది ఏమన్నారో అందరికీ తెలుసు. ‘నంద్యాల చుట్టుపక్కల నియోజకవర్గాల ప్రజలందరూ తమ ఎమ్మెల్యేలు ఎప్పుడు పైకి పోతారా అని ఎదురుచూస్తున్నారు.... ఎమ్మెల్యేలు పైకి పోతే.. ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పోటీ చేస్తే అప్పుడు చంద్రబాబు నిద్ర లేస్తారు’ అని సాక్షాత్తూ భూమానాగిరెడ్డి బావమరిది మాట్లాడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అన్ని వర్గాలకూ మోసమే...!

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ చంద్రబాబు అమలు చేయలేదు. ఫలానా పని చేశానని గొప్పగా చెప్పుకునే కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటీ లేదు. రైతుల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నారు. ఎన్నికల తర్వాత వారికి వెన్నుపోటు పొడిచారు. వారికి వచ్చే సున్నా వడ్డీని కూడా రాకుండా చేశారు. బ్యాంకుల్లో బంగారం ఇంటికి రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. బ్యాంకుల్లో బంగారం ఇంటికి వచ్చిందా? జాబు రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలని గోడల మీద రాతలు రాయించారు. జాబు ఇవ్వకపోతే ఇంటింటికీ రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తా అన్నారు. జాబు వచ్చిందా?. మరి జాబు ఇవ్వకపోతే నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలి. బాబు అధికారంలోకి వచ్చి 38 నెలలు అయింది. ఈ 38 నెలల కాలానికి ఇంటింటికీ రూ. 76 వేలు ఇవ్వాలి అని చంద్రబాబును నిలదీయాల్సిన అవసరం ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కర్నూలుకు వచ్చి జిల్లాకు ఏవేవో చేస్తానన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు కడతానన్నారు. పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టు కట్టి ఉంటే కేసీ కెనాల్‌లో నీళ్లు పుష్కలంగా వచ్చేవి. సిద్దేశ్వరం అలుగుపై సాధ్యాసాధ్యాల నివేదిక కూడా చేయించని అన్యాయస్తుడు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబే. ఇవాళ నంద్యాల ఉప ఎన్నికలు వచ్చేసరికి మళ్లీ టేప్ రికార్డర్ ఆన్ చేశారు. నంద్యాలకు అది చేసేస్తాను...ఇది చేసేస్తాను అని మొదలుపెట్టారు. మోసం చేసే కార్యక్రమం చేస్తున్నారు. ఇదే చంద్రబాబు ఇక్కడకు వచ్చినప్పుడు నిలదీయండి. కేసీ కెనాల్‌ను చూపించి అడగండి. నీళ్లు లేక సతమతమవుతున్న పరిస్థితిని చంద్రబాబుకు చెప్పండి.

చంద్రబాబు మాదిరిగా మోసం చేయడం, అబద్ధాలు చెప్పడం నా చేతగాదు. నిజంగా నాకు ఆ గుణమే ఉంటే...నేను కూడా నిన్నటి ఎన్నికల్లో చంద్రబాబు మాదిరిగా రైతులందరికీ రుణాలన్నీ మాఫీ చేస్తానని అని ఉంటే బహుశా ఆ ముఖ్యమంత్రి సీట్లో నేను కూర్చొని ఉండేవాడినేమో. ఆ రోజు ఎంత ఒత్తిడి వచ్చినా నా నోట్లో నుంచి అబద్ధాలు రాలేదు. నేను ఈ రోజు ఒక్క హామీ ఇస్తున్నా. సంవత్సరం, సంవత్సరన్నరలో కురుక్షేత్ర సంగ్రామం రాబోతోంది. ఈ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు మోసాలకు, అన్యాయానికి, అబద్ధాలకు, అధర్మానికి, అవినీతికి వ్యతిరేకంగా మీరు ఓటు వేస్తున్నారు. ఇవాళ జరిగే నంద్యాల ఉప ఎన్నికలు... రాబోయే కురుక్షేత్ర సంగ్రామానికి నాంది పలకాలని కోరుతున్నా. న్యాయం, ధర్మం వైపు నిలబడాలని కోరుతున్నా. నంద్యాల ప్రజలు ధర్మం, న్యాయం వైపు నిలబడ్డారని రాష్ట్ర ప్రజలకు తెలపండి. మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యేను ఎన్నుకోవడానికి మాత్రమేకాదు... ఇటువంటి మోసగాళ్లను మేం క్షమించం. ఇటువంటి అవినీతిపరులు మాకొద్దు అని ఓటు వేస్తున్నాం అని తెలియజేయడానికి.. చంద్రబాబు మాదిరిగా నా దగ్గర డబ్బుల్లేవు. నా దగ్గర ముఖ్యమంత్రి పదవి లేదు. పోలీసుల బలం నా దగ్గర లేదు. లేనిది ఉన్నట్టుగా...ఉన్నది లేనట్టుగా చూపించే టీవీ చానళ్లు నా దగ్గర లేవు. అలా రాసే పేపర్లు నా దగ్గర లేవు. చంద్రబాబు మాదిరిగా నా దగ్గర దుర్బుద్ధి లేదు. అధికారం కోసం ఎంతకైనా దిగజారిపోయే మనస్తత్వం అంతకన్నా లేదు. నాకున్న ఆస్తి దివంగత నేత వైఎస్సార్....నాన్నగారి మీద మీకున్న అభిమానం. నా కున్న ఆస్తి నాన్నగారు చేసిన ఆ సంక్షేమపథకాలు ఇంకా మీ గుండెల్లో బతికే ఉండటం. జగన్ అబద్ధం ఆడడు. జగన్ మోసం చేయడు. జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు అన్న విశ్వసనీయత నాకున్న ఆస్తి. విలువలతోకూడిన రాజకీయాలు చేయడం నాకున్న ఆస్తి. నవరత్నాలతో జగన్ కూడా ప్రతీ పేదవాడి ఇంట్లో వాళ్ల నాన్న మాదిరిగానే వెలుగులు నింపుతాడు అన్న నమ్మకం నాకున్న ఆస్తి. నాకున్న ఆస్తి దేవుడి దయ. చంద్రబాబు దగ్గర ఉన్నట్లుగా పెద్దపెద్ద పదవులు, పోలీసు బలగం లేకపోవచ్చు. తానా అంటే తందానా అనే టీవీ చానళ్లు, పేపర్ల సపోర్టు లేకపోవచ్చు. మీ అందరికీ ఓ మాట చెబుతున్నా. నేనైతే కచ్చితంగా చేసి చూపిస్తాను అని మాట ఇస్తున్నా. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రతీ పేదవాడికి ఈ నవరత్నాలు చేరాలి. అలా చేరాలంటే ఇప్పుడున్న వ్యవస్థలో మార్పురావాలి. పేదవాడికి మరింత దగ్గరయ్యే వ్యవస్థ కావాలి. దాని కోసమే జిల్లాలను మార్చబోతున్నాం. ప్రతీ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేస్తూ 25 జిల్లాలుగా చేయబోతున్నాము. నంద్యాల ఒక జిల్లా అవుతుంది. జిల్లా కేంద్రంగా నంద్యాల ఉంటుంది. నంద్యాలను మోడల్ టౌన్‌గా చేస్తాం. చంద్రబాబుకు మునిశాపం ఉంది కాబట్టి ఎప్పుడూ నిజాలు చెప్పరు. నేను ఎప్పుడూ అబద్ధమాడనని గట్టిగా చెబుతున్నా. నంద్యాలను నా గుండెల్లో పెట్టుకుంటా.


జూలెపల్లె రోడ్‌షోలో చిన్నారిని ముద్దాడుతున్న వైఎస్ జగన్

పాపానికి ఓటడిగేది దెయ్యాలు మాత్రమే...



రాబోయే రోజుల్లో చంద్రబాబు మూటలు మూటలు డబ్బులతో వస్తారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో విపరీతంగా సంపాదించిన ఆ డబ్బులతో విపరీతంగా పంచే కార్యక్రమం చేస్తారు. ఎమ్మెల్యేలను ఏ విధంగా కొనుగోలు చేశాడో... మళ్లీ ప్రజలను అదేమాదిరిగా కొనుగోలు చేసేదానికి డబ్బుల మూటలతో వస్తాడు. ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబు ట్రాక్టర్లు, కుట్టుమిషన్లు పంచుతున్నారు. ప్రతీ ఒక్కరికీ రూ.5 వేలు ఇస్తానన్నాడు. చంద్రబాబుకు ఎక్కడి నుంచి వచ్చింది ఈ డబ్బు అని అడుగుతున్నా. రాష్ట్ర జనాభా మొత్తం 6 కోట్లు అయితే...ఈ మూడున్నరేళ్ల కాలంలో చంద్రబాబు అక్షరాలా మూడున్నర లక్షలకోట్లు దోపిడీ చేశారు. 6 కోట్ల జనాభాలో సగటున ప్రతీ ఒక్కరి దగ్గరి నుంచి అక్షరాలా రూ.60 వేలు దోపిడీ చేశారు. ఈ దోపిడీలో నుంచి రూ.5 వేలు పంచుతాను అంటున్నారు. గుడి భూములను కూడా వదలకుండా దోచారు. రాజధాని భూములను సైతం వదలకుండా దోచారు. ఈ దోచిన దాంట్లోనుంచి శనక్కాయలు వేసినట్టు రూ.5 వేలు ఇస్తానంటున్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు వచ్చి రూ.5 వేలు చేతిలో పెడతారు. ఆ తర్వాత జేబులో నుంచి దేవుడి పటం తీసి చేతిలో పెట్టి...దేవుడి మీద ప్రమాణం వేయించుకుని మరీ డబ్బులు పంచే కార్యక్రమం చేస్తారు. ఏ దేవుడు కూడా పాపానికి ఓటు వేయమని చెప్పడు. పాపానికి ఓటెయ్యండి అని చెప్పేది దెయ్యాలు మాత్రమే. మనస్సులో దేవుణ్ణి తలచుకోండి. ధర్మంవైపే మేముంటామని అని అనుకుని ఆ తర్వాత లౌక్యంగా ఈ దుర్బుద్ధిని అరికట్టండి. దుర్మార్గులను ఇంటికి పంపండి. ధర్మానికి, న్యాయానికి ఓటు వేయండి. చంద్రబాబు మాటలను మళ్లీ నమ్మకండి. ఆయన మాటలకు మోసపోకండి. అహంకారంతో చంద్రబాబునాయుడికి కళ్లు నెత్తికి ఎక్కాయి. డబ్బు ఉంది...ఎవరినైనా కొనగలుగతా...ఏమైనా చేయగలుగుతా అనుకుంటున్నారు. ’’ అని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

అందరూ నా తోడు ఉంటారు...!

‘‘అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది చేశానని చెప్పుకునే ఏ ఒక్క గొప్ప పని చంద్రబాబు చేయలేదు. ఏ ఒక్క గొప్ప పని చేయని ఇదే చంద్రబాబు నంద్యాల రోడ్ల మీదకు వస్తే....ఇక్కడే బస చేయండి...పొద్దున్నే బ్యాంకు దాకా వెళదాం. మా రుణాలు ఏ మేరకు మాఫీ అయ్యాయో మీరే చూడండి అని రైతు అడిగితే చంద్రబాబుకు కోపం వస్తుంది. కోపం వచ్చి కళ్లు పెద్దవి చేస్తారు. కళ్లు పెద్దవి చేసి మీరంతా జగన్ మనుషులే అని అంటారు. డ్వాక్రా చెల్లెమ్మలు మా రుణాలు మాఫీ కాలేదు అని ప్రశ్నిస్తే వాళ్లందరూ జగన్ మనుషులే అంటారు. ఎవరైనా పిల్లలు కడుపు మండి జాబు వస్తుందన్నావు. ఏదీ నా జాబు అని అడిగితే...జాబు ఇవ్వకపోతే ఇంటింటికీ నెలకు రూ.2 వేల చొప్పున ఇస్తానన్నావు.. ముఖ్యమంత్రి అయ్యి 38 నెలలయ్యింది...నువ్వు మాకు రూ.76 వేలు బాకీ పడ్డావని పిల్లలు నిలదీస్తే జగన్ మనుషులే అని అంటారు. ఇల్లు లేని పేదవాళ్లు...ఒక్కటంటే ఒక్క ఇల్లు కట్టించలేదని నిలదీస్తే మీరంతా జగన్ మనుషులే అంటారు. వీళ్లందరూ జగన్ మనుషులే. వీరంతా జగన్‌కు కచ్చితంగా తోడు ఉండే కార్యక్రమం చేస్తారు. చంద్రబాబును బంగాళాఖాతంలో కలిపే రోజు కూడా తొందరలోనే ఉంది అని చెబుతున్నా.’’ అని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

- వైఎస్ జగన్ రాక కోసం ఊరూరా వేచి ఉన్న జనం
- పిల్లా పాపలతో మహిళలను మిద్దెలెక్కించిన అభిమానం
- అడుగడుగునా అడ్డుపడిన అభిమానం..
- 16 కిలోమీటర్ల రోడ్ షోకు 6.30 గంటలు

ఊరూ వాడా ఏకం..
జననేతకు బ్రహ్మరథం



నంద్యాల మండలం రైతునగరం, కానాల గ్రామాల మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి: చిన్నారుల నుంచి వయసు మళ్లిన వృద్ధుల వరకు.. దిన కూలీల నుంచి రైతన్నల వరకూ తర తమ భేదం లేకుండా ఆ రహదారిపైకొచ్చారు. జననేతను తనివితీరా చూడాలని పిల్లా పాపలతో కలసి మహిళలు మిద్దెలెక్కారు. ఊరు.. వాడ ఏకమై జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనం పలికారు. అన్నయ్యొచ్చారంటూ పలువురు మహిళలు హారతి పట్టారు. ప్రభుత్వ పెద్దలు కుట్రలెన్ని పన్నినా సోదరీమణులుగా తాము అండగా ఉన్నామని రాఖీలు కడుతూ మరికొందరు మహిళలు అభిమానం చాటుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బుధవారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా నంద్యాల నియోజకవర్గంలో రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఉదయం నుంచి ఓ వైపు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే, రాజన్న బిడ్డకు వరుణుడు స్వాగతం పలుకుతున్నారని ప్రజానీకం చర్చించుకున్నారు. అంతకు ముందు.. ఇంత వర్షంలో జగన్ ఎక్కడ వస్తారని కొందరు పెదవి విరిచినా, ఆయన మాట చెప్పారంటే వచ్చి తీరుతారంటూ పలువురు వృద్ధులు రోడ్డుపై తిష్ట వేశారు. మధ్యాహ్నం 2.20 గంటలకు వైఎస్ జగన్ కాన్వాయ్ రైతు నగరం చేరుకుంది. అక్కడి నుంచి ప్రారంభమైన రోడ్‌షో 16 కిలోమీటర్లు పూర్తి చేయడానికి 6.30 గంటల సమయం పట్టింది. అడుగడుగునా అభిమానం అడ్డుపడటంతో రోడ్ షో ఆలస్యంగా సాగింది. దీనిని బట్టి వైఎస్ జగన్ రోడ్‌షోకు ఏస్థాయిలో మద్దతు లభించిందన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. రోడ్డుకు ఇరు వైపులా నిలుచున్న, మిద్దెలపైకి ఎక్కిన.. రైతులు, యువకులు, మహిళలు, వృద్ధులను పలకరిస్తూ, ఎన్నికల్లో ధర్మానికి, న్యాయానికి మద్దుతుగా నిలవాలని అభ్యర్థిస్తూ జగన్ ముందుకు వెళ్లారు. రైతునగరంలో 2.20 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో 3.15 గంటలకు రామకృష్ణనగర్, 3.45కు కానాల, 5 గంటలకు హైస్కూల్ కొట్టాల, 5.50కి చింతకుంట్ల, 7.30కి జూలేపల్లె, 8.30 గంటలకు పసురపాడు చేరుకుంది. అప్పటికే ఆలస్యం కావడంతో తెల్లపురి వెళ్లకుండా పసురపాడులో ముగించారు. ప్రతిగ్రామంలో ప్రజలు రోడ్డుపైకి చేరి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి సంఘీభావంగా ప్రతిస్పందించారు. రెండు చేతులు పైకెత్తి ప్రభుత్వ పథకాలు అమలు కావడంలేదని స్పష్టం చేశారు.

రాజన్న బిడ్డ కోసం ఎదురు చూపులు..

‘పాలు పిండుకునే సమయమైంది.. జగన్ వచ్చేలోపు వెళ్లొద్దాం’ అని కానాలకు చెందిన బాలమ్మను అమె కోడలు పదేపదే పిలుస్తోంది. ‘ఉండమ్మా.. రాజన్న బిడ్డ వస్తున్నాడు.. ఒక్క రోజు ఆలస్యమైతే నష్టమేమీ లేదులే. కాసేపు ఉండు’ అని బాలమ్మ నచ్చజెప్పింది. ఈ తరహా మాటలు రోడ్‌షో సాగిన పల్లెలన్నీంటిలోనూ వినిపించాయి. జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని చాలా చోట్ల గంటల తరబడి ముందుగానే రోడ్ల కిరువైపులా బారులు తీరారు. చిన్న పిల్లలు, విద్యార్థులు సైతం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. హైస్కూల్ కొట్టాల గ్రామంలోకి వైఎస్ జగన్ వస్తున్నారని తెలుసుకున్న విద్యార్థులు రోడ్డుపై వరస క్రమంలో నిల్చొని స్వాగతం పలికారు. జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ క్రమంలోనే ఆయా గ్రామాలల్లో మహిళలు హారతి పట్టి.. నుదుట తిలకం దిద్దుతూ అభిమానం చాటుకున్నారు. మరికొందరు మహిళలు ముందుగా తెచ్చుకున్న రాఖీలు కట్టారు. ‘ఈ ఎన్నిక న్యాయానికి, అన్యాయానికి.. ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న పోరాటం. మీరంతా ధర్మం, న్యాయం వైపు నిలవాలి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలి. నంద్యాలను నా గుండెల్లో పెట్టుకుంటా’ అని వైఎస్ జగన్ అన్నప్పుడు ప్రజలు చేతులు పైకెత్తి మద్దతు తెలిపారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చింతకుంట్ల రోడ్‌షోలో ఉండగా 108 వాహనం వచ్చింది. ఆ వాహనానికి దారి ఇవ్వాల్సిందిగా జగన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చింతకుంట్ల నుంచి జూలేపల్లె వరకూ రహదారి వెంట ఉన్న జనం అడ్డు తప్పుకుని ఆ వాహనానికి దారి ఇచ్చారు. ఆ సమయంలో 108 వాహనాన్ని చూడగానే అక్కడి జనం దివంగత సీఎం వైఎస్సార్‌ను గుర్తు చేసుకున్నారు. ఆ మహానుభావుని కృషి వల్లే ఈ వాహనం వచ్చిందని, ఆపత్కాలంలో ఎంతో మందికి అండగా నిలిచిందని చర్చించుకున్నారు. అయితే కొంత కాలంగా సరిగా సేవలందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్‌షోలో వైఎస్ జగన్ వెంట పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డితోపాటు ఎంపీలు బుట్టా రేణుక, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, ఐజయ్య, గౌరు చరిత, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, గంగుల ప్రభాకర్ రెడ్డి, పార్టీ నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, పీపీ నాగిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పార్టీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

యువత అటు వెళ్లకుండా
కట్టడి చేయండి
మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఎస్పీజీ గ్రౌండులో నిర్వహించిన వైఎస్ జగన్ బహిరంగ సభ ప్రకంపనలు అధికార పార్టీని తాకుతూనే ఉన్నాయి. తాజాగా జగన్ రోడ్‌షోల సెగ కూడా ఆ పార్టీని బలంగా తాకింది. బుధవారం జగన్ రోడ్‌షోకు యువత బాగా తరలి వచ్చారనే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే రంగంలోకి దిగారు. యువత జగన్ రోడ్ షోలకు వెళ్లకుండా నిలువరించాలని కొందరు మంత్రులను ఆదేశించినట్టు తెలిసింది. అవసరమైతే వారిని ప్రలోభపరచి, పక్కదారి పట్టించాలని పేర్కొన్నట్టు సమాచారం. జగన్ బహిరంగ సభ తర్వాత నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహం బాగా పెరిగిందని ఇంటెలిజెన్స్ నివేదికలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో జగన్ ప్రస్తుతం నంద్యాలలోనే ఉండి ప్రచారం నిర్వహించడానికి విచ్చేయడంతో ప్రభుత్వ పెద్దలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే యువత జగన్ రోడ్ షోలకు వెళ్లకుండా చూడటంలో పలువురు మంత్రులు తలమునకలైనట్లు తెలిసింది. కాగా, ఇటీవల జగన్ బహిరంగ సభకు కూడా మహిళలు రాకుండా చూసేందుకు అధికార పార్టీ నేతలు విఫల యత్నం చేసిన సంగతి తెలిసిందే.

త్వరలో తెలంగాణలో పర్యటిస్తా..
నంద్యాల వెళ్తున్న జగన్‌కు ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

పెబ్బేరు: నంద్యాల ఉప ఎన్నికలు ముగిశాక త్వరలోనే తెలంగాణ జిల్లాల్లో పర్యటిస్తానని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు 44వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు మీదుగా నంద్యాలలో ఉప ఎన్నికల ప్రచారానికి బుధవారం వెళ్తున్న జగన్‌కు ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వనపర్తి, పెబ్బేరు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు మద్దిరాల విష్ణువర్ధన్‌రెడ్డి జగన్‌కు పూలమాల వేయగా.. తిరిగి అదే పూలమాల అతడికి వేసి ‘విష్ణూ బాగున్నావా!’ అని ఆప్యాయంగా పలకరించారు.

సాక్షి
భవిత
గురువారం 10-8-2017
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: జీకే అండ్ కరెంట్ అఫైర్స్
- ఎస్సెస్సీ సీజీఎల్: అర్థమెటిక్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్

జాతీయం

ఆక్రమణలో 33 లక్షల ఎకరాల అటవీ భూమి



దేశంలో 33.21 లక్షల ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైందని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ ఆగస్టు 1న లోక్‌సభకు తెలిపారు. గోవా, లక్షద్వీప్, పుదుచ్చేరి మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయన్నారు. తెలంగాణలో 7,551 ఎకరాలు, ఏపీలో 4,177 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు వెల్లడించారు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 13 లక్షల ఎకరాలు, అసోంలో 7 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు.

2050 నాటికి అంతరించిపోనున్న 4000 భాషలు

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండొంతుల భాషలు అంతరించే ప్రమాదం లో ఉన్నట్లు పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ) తెలిపింది. ప్రపంచంలో మొత్తం 6000 భాషలు ఉన్నట్లు అంచనా. వాటిలో 2050 నాటికి 4000 భాషలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని భాషా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో 10 శాతం భారతీయ భాషలున్నాయి. అయితే ఎక్కువ సంఖ్యలో ప్రజలు మాట్లాడుతున్న హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, కన్నడ, మలయాళం, గుజరాతీ, పంజాబీ భాషలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపింది.

ఈ-రకమ్ పోర్టల్ ప్రారంభం

రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 1న ఈ-రకమ్ (ఈ-రాష్ట్రీయ కిసాన్ అగ్రి మండి) పోర్టల్ ప్రారంభించింది. ఇది కుగ్రామ రైతులను ప్రపంచంలోని పెద్ద మార్కెట్లకు అనుసంధానించే మొట్టమొదటి ఆన్‌లైన్ పోర్టల్.

భారత్‌లో వ్యవసాయం ప్రమాదకరం

భారతదేశంలో ప్రస్తుతం వ్యవసాయం చేయడం ప్రమాదకరంగా పరిణమించిందని అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఒక నివేదికలో పేర్కొంది. పంట ఎదిగే కాలంలో 20 డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరిగే ప్రతి డిగ్రీకి 67 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆగస్టు 1న ప్రచురితమైన ప్రొసీడింగ్స్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన జర్నల్‌లో వెల్లడించింది. 2050 నాటికి దేశంలో భూతాపోన్నతి మరో మూడు డిగ్రీలు పెరుగుతుందని, అప్పుడు రైతుల పరిస్థితి మరెంత దారుణంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో 130 కోట్ల జనాభా ఉండగా.. వారిలో 58 శాతం మంది రైతులు ఉన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, పంటలు దెబ్బతిని ఏటా లక్షా 30 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నేషనల్ హైవేల పక్కన వినోద కేంద్రాలు

జాతీయ రహదారుల పక్కన ప్రయాణికులు, డ్రైవర్ల కోసం ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సౌకర్య కేంద్రం(వేసైడ్ ఎమినిటీ సెంటర్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆగస్టు 3న నూతన విధానాన్ని ఆవిష్కరించారు. ఈ కేంద్రాల ఏర్పాటు బాధ్యతలను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ చూడనుంది. వీటిలో కార్లు, బస్సులు, ట్రక్కుల పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తారు. పెట్రోల్ బంకులు, వాహన మరమ్మతు కేంద్రాలు, విశ్రాంతి గదులు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, వ్యవసాయ, చేనేత ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. తొలి విడతలో 183 చోట్ల ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

మరణ ధ్రువీకరణ పత్రానికి ఆధార్ తప్పనిసరి

దేశవ్యాప్తంగా మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి అక్టోబర్ 1 నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వ్యక్తుల గుర్తింపులో మోసాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోం శాఖ పేర్కొంది.

అంతర్జాతీయం

ప్రపంచ బ్యాంక్‌లో పాక్‌కు ఎదురుదెబ్బ

జమ్మూకశ్మీర్‌లో భారత్ చేపట్టిన క్రిష్ణగంగ, రత్లే జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కొనసాగించవచ్చని ప్రపంచ బ్యాంకు ఆగస్టు 1న పేర్కొంది. అయితే 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని అనుసరించి.. కొన్ని పరిమితులకు లోబడి ఆనకట్టల నిర్మాణాలు ఉండాలని సూచించింది. ఈ మేరకు పాకిస్థాన్, భారత్‌లకు చెందిన కార్యదర్శి స్థాయి అధికారులతో చర్చల అనంతరం ఓ ప్రకటన విడుదల చేసింది. సింధు జలాల ఒప్పందం ప్రకారం భారత్ నుంచి పాక్‌కు ప్రవహిస్తున్న పశ్చిమ నదులపై ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్.. ఈ వ్యవహారంతో సంబంధం లేని వ్యక్తి లేదా సంస్థ నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. సింధు నది ఉప నదులైన జీలం, చీనాబ్‌లపై భారత్ క్రిష్ణగంగ, రత్లే జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఇప్పటికే ప్రారంభించింది. దీనిపై పాకిస్థాన్ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించింది.



టిబెట్ పీఠభూమిపై ఎక్స్‌ప్రెస్ హైవే

ప్రపంచంలోనే ఎత్తయిన టిబెట్ పీఠభూమిపై చైనా ఎక్స్‌ప్రెస్ హైవేను ప్రారంభించింది. కింఘై ప్రావిన్స్‌లోని గాంగ్హె కౌంటీని వుషు నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించారు. 634.8 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి చైనా వేల కోట్లను ఖర్చు చేసింది. దీన్ని సగటున 4 వేల మీటర్ల ఎత్తులో నిర్మించారు. రహదారిలో 36 శాతం పెర్మాఫ్రాస్ట్(మంచు)నేలపై ఉంటుంది. వాహనాల వల్ల ఏర్పడే ఉష్ణోగ్రత మార్పుల కారణంగా నేల కరిగిపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేలను స్థిరంగా ఉంచి నిర్మాణం చేపట్టారు.

2050 నాటికి 15 కోట్ల మందికి పౌష్టికాహార లోపం

వాతావరణంలోకి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు పెరగడం వల్ల భూతాపోన్నతి పెరగడంతోపాటు వరి, గోధుమ వంటి పంటల్లో ప్రొటీన్ వంటి పౌష్టికాహార పదార్థాలు లుప్తమవుతాయని శాస్త్రవేత్తలు ఆగస్టు 2న హెచ్చరించారు. పర్యవసానంగా 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది పౌష్టికాహార లోపానికి గురై అకాల మృత్యువాత పడతారని హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

మనీలాలో ఆసియాన్-భారత్ విదేశాంగ మంత్రుల సదస్సు

15వ ఆసియాన్-భారత్ విదేశాంగ మంత్రుల సదస్సు ఆగస్టు 6న మనీలాలో ముగిసింది. భారత విదేశాంగ సహాయ మంత్రి వి.కె.సింగ్ పాల్గొన్నారు. దక్షిణ చైనా సముద్ర వ్యవహారాలపై సదస్సు ఉమ్మడి ప్రకటన చేసింది.

వార్తల్లో వ్యక్తులు

పాకిస్థాన్ ప్రధానిగా అబ్బాసీ

పాకిస్థాన్ 18వ ప్రధానిగా పాకిస్థాన్ ముస్లిం లీగ్ పార్టీ నేత షాహిద్ ఖాకన్ అబ్బాసీ ఆగస్టు 3న బాధ్యతలు స్వీకరించారు. ఆ దేశ జాతీయ అసెంబ్లీలో ఆగస్టు 1న జరిగిన ఓటింగ్‌లో ఆయనకు 221 ఓట్లు వచ్చాయి. అక్రమాస్తుల వ్యవహారంలో నవాజ్ షరీఫ్‌పై ఆ దేశ సుప్రీంకోర్టు అనర్హత వేటు వేసిన నేపథ్యంలో అబ్బాసీ ఆపద్ధర్మ ప్రధానిగా ఎన్నికయ్యారు.



నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్



నీతి ఆయోగ్ కొత్త ఉపాధ్యక్షుడిగా ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ రాజీవ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 5న ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా పదవి నుంచి వైదొలుగుతున్న దృష్ట్యా ఆయన స్థానంలో రాజీవ్ కుమార్‌ను నియమించింది. పనగారియా ఆగస్టు 31 వరకు పదవిలో కొనసాగుతారు. రాజీవ్ కుమార్ ప్రస్తుతం సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌లో సీనియర్ ఫెలోగా ఉన్నారు.

సీసీఎంబీ వ్యవస్థాపక డైరెక్టర్ పీఎం భార్గవ కన్నుమూత

ప్రఖ్యాత శాస్త్రవేత్త, సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ (89) ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. ఆధునిక జీవశాస్త్రానికి ఆర్కిటెక్ట్‌గా ప్రశంసలందుకున్న భార్గవ.. సీసీఎంబీ డైరెక్టర్‌గా 13 ఏళ్లపాటు విశేష సేవలందించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 500కు పైగా వ్యాసాలు రాశారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో వెంకయ్య విజయం

ఎన్డీఏ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడు భారత 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆయన ఆగస్టు 5న జరిగిన ఎన్నికలో 516 ఓట్లతో (68 శాతం) విజయం సాధించారు. విపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగిన గోపాలకృష్ణ గాంధీకి 244 ఓట్లు లభించాయి.

ప్రపంచ బ్యాంకు ఈడీగా ఐఏఎస్ అధికారిణి అపర్ణ

గుజరాత్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఎస్.అపర్ణ ప్రపంచ బ్యాంకులో కార్యనిర్వాహక సంచాలకులు(ఈడీ)గా ఆగస్టు 5న నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం గుజరాత్ సీఎంకు ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈడీ హోదాలో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకలకు ప్రపంచ బ్యాంకులో ప్రాతినిధ్యం వహిస్తారు.

ఆర్థికం

రెపో రేటు 0.25 శాతం తగ్గింపు

రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును పావు శాతం (0.25) తగ్గించింది. ఫలితంగా రెపో రేటు ఆరున్నరేళ్ల కనిష్ట స్థాయి(6 శాతాని)కి చేరింది. దీంతోపాటు రివర్స్ రెపో రేటును 0.25 శాతం తగ్గించి 5.75 శాతానికి పరిమితం చేసింది. ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఆగస్టు 2న ప్రకటన చేసింది. వీటితోపాటు మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటును 6.25 శాతానికి తగ్గించారు. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన 4 శాతం నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)లో ఎలాంటి మార్పు లేదు.

అవార్డులు

గోరటి, అశోక్‌తేజలకు జాలాది పురస్కారం

సినీ కవి డాక్టర్ జాలాది పేరిట ప్రదానం చేస్తున్న జాతీయ ప్రతిభా పురస్కారాలకు సుప్రసిద్ధ ప్రజాకవి గోరటి వెంకన్న, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఎంపికయ్యారు.

భారత వ్యాపారవేత్తకు యూఏఈ పురస్కారం

జైళ్లలో మగ్గుతున్న ఖైదీలను విడిపించడంలో ప్రత్యేక చొరవ చూపిన భారత వ్యాపారవేత్త ఫిరోజ్ మర్చెంట్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ఆయన ఇటీవల యూఏఈ ఉపప్రధాని హెచ్‌హెచ్ షేఖ్ నుంచి కమ్యూనిటీ సర్వీస్ మెడల్‌ను స్వీకరించారు.

క్రీడలు

ఉసేన్ బోల్ట్‌కు కాంస్యం

ఉసేన్ బోల్ట్ (జమైకా) తన కెరీర్ చివరి 100 మీటర్ల రేసులో కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. లండన్‌లో ఆగస్టు 5న జరిగిన ఫైనల్లో 9.95 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు.

విజేందర్‌కు డబ్ల్యూబీవో టైటిల్

భారత బాక్సర్ విజేందర్‌సింగ్.. డబ్ల్యూబీవో టైటిల్‌ను గెలుచుకున్నాడు. జుల్ఫికర్ మైమైటియాలి(చైనా)పై విజయం సాధించాడు.

ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్



భారత రాష్ట్రపతులు.. వారి ప్రత్యేకతలు

- **ప్రభుత్వాలు తమ విధి నిర్వహణను మూడు వ్యవస్థల ద్వారా కొనసాగిస్తాయి. వీటిలో రెండోది కార్యనిర్వాహక శాఖ. మన రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలోని ఐదో భాగంలో 52 నుంచి 78 వరకు గల అధికరణలు కేంద్ర కార్యనిర్వాహక శాఖ గురించి తెలియజేస్తాయి. ఇందులోకి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రిమండలి, అటార్నీ జనరల్ వస్తారు.**
- **రాష్ట్రపతి:** రాష్ట్రపతి రాజ్యాంగాధినేత, ప్రధాన కార్యనిర్వాహణాధికారి. ప్రథమ పౌరుడు. సర్వసైన్యాధ్యక్షుడు. అధికరణ 52 ప్రకారం భారతదేశానికి రాష్ట్రపతి ఉంటాడు. ఈయనే అత్యున్నత వ్యక్తి. అధికరణ 53 ప్రకారం దేశ పరిపాలనను రాష్ట్రపతి ప్రత్యక్షంగా నిర్వహించవచ్చు (లేదా) తన కింది అధికారుల ద్వారా నిర్వహించవచ్చు. రాష్ట్రపతికి సాయపడేందుకు అధికరణ 74(1) ప్రకారం ప్రధానమంత్రి నేతృత్వంలో మంత్రిమండలి ఉంటుంది.
- **రాష్ట్రపతి పదవీ కాలం:** అధికరణ 56 ప్రకారం రాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు. ఏదైనా కారణం వల్ల రాష్ట్రపతి పదవి ఖాళీ అయితే ఆరు నెలల లోపు కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవాలి. అధికరణ 57 ప్రకారం ఒక వ్యక్తి రాష్ట్రపతిగా ఎన్నిసార్లయినా పోటీ చేయవచ్చు. రాజ్యాంగం ప్రకారం పరిమితులు లేవు. కానీ మొదటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ద్వారా రెండు సార్లు అనే సంప్రదాయం ఏర్పడింది. రాష్ట్రపతి తన రాజీనామాను ఉపరాష్ట్రపతికి/సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి/సీనియర్ న్యాయమూర్తికి సమర్పించవచ్చు. ఈ విషయాన్ని లోక్‌సభ స్పీకర్‌కు కూడా తెలియజేయాలి.
- **రాష్ట్రపతి వేతనం, భత్యాలు:** ఆర్టికల్ 59 ప్రకారం రాష్ట్రపతి వేతన, భత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. వేతన, భత్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించే అవకాశంలేదు. ప్రస్తుతం రాష్ట్రపతి వేతనం రూ.1,50,000. దీన్ని రూ.5,00,000కు పెంచాలని ప్రతిపాదించారు. ఉచిత నివాసం, ఇతర సౌకర్యాలు ఉంటాయి.
- రాష్ట్రపతి భవన్ రూపశిల్పి ఎడ్విన్ లుటెయన్స్. ఇది ఢిల్లీలో ఉంది. రాష్ట్రపతికి హైదరాబాద్‌లో శీతాకాల, సిమ్లాలో వేసవి విడిది కేంద్రాలు ఉన్నాయి. ఆయన పదవీ కాలంలోని చర్యలపై ఏ న్యాయస్థానంలోనూ దావా వేయరాదు.
- **రాష్ట్రపతి తొలగింపు-మహాభియోగ తీర్మానం** రాష్ట్రపతి తొలగింపు పద్ధతిని అమెరికా నుంచి స్వీకరించారు. రాష్ట్రపతి రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తే మాత్రమే ఆయన్ను తొలగించవచ్చు. ఇతర కారణాల ద్వారా తొలగించే అవకాశం లేదు. మహాభియోగ తీర్మానాన్ని పార్లమెంట్ ఉభయ సభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. ఇందుకు ఆ సభ సభ్యుల్లో 1/4వ వంతు మంది మద్దతుతో 14 రోజుల ముందు నోటీసు జారీ చేయాలి. అనంతరం ఈ తీర్మానంపై చర్చ జరుగుతుంది. తర్వాత జరిపిన ఓటింగ్‌లో 2/3 మెజారిటీతో ఆమోదిస్తే రెండో సభకు పంపిస్తారు. రెండో సభ కూడా 2/3 మెజార్టీతో తీర్మానిస్తే రాష్ట్రపతి.. పదవి కోల్పోతాడు.
- మహాభియోగ తీర్మాన ప్రక్రియ కొనసాగుతున్నపుడు రాష్ట్రపతి పదవిలో కొనసాగవచ్చు. రాష్ట్రపతి చేత పార్లమెంటుకు నియమితులైన సభ్యులకు ఈ ప్రక్రియలో ఓటు హక్కు ఉంటుంది. విధాన సభ సభ్యులకు ఓటు హక్కు లేదు.
- **భారత రాష్ట్రపతులు**

1. **డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్(1950 జనవరి 26 నుంచి 1962 మే 13 వరకు):** ఈయన స్వరాష్ట్రం బిహార్. రాష్ట్రపతి పదవికి ఈయనతో పోటీ పడి ఓడిపోయినవారు ప్రొఫెసర్ కె.టి.షా (1952), ఎన్.ఎన్.దాస్(1957). రెండు సార్లు రాష్ట్రపతి అయిన ఏకైక వ్యక్తి. అత్యధిక మెజార్టీతో ఎన్నికైన రాష్ట్రపతి. ఈ పదవిలో అత్యధిక కాలం కొనసాగారు. ఎక్కువ సార్లు సుప్రీంకోర్టు సలహా కోరిన రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి. ఈయన రాసిన ప్రధాన గ్రంథం 'ఇండియా డివైడెడ్'.
2. **డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (1962 మే 13 నుంచి 1967 మే 13 వరకు):** తమిళనాడుకు చెందినవారు. ఈయన చేతిలో ఓడిపోయిన వ్యక్తి సి.హెచ్.హరిరామ్. ఉపరాష్ట్రపతిగా చేసి రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి. రాయబారిగా చేసి రాష్ట్రపతి అయ్యారు. 1962లో చైనాతో, 1965లో పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో రాష్ట్రపతిగా కొనసాగారు. ఈయన రాసిన ప్రధాన గ్రంథాలు.. ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్, యాన్ ఐడియలిస్ట్ వ్యూ ఆఫ్ లైఫ్.



3. **జాకీర్ హుస్సేన్(1967 మే 13 నుంచి 1969 మే 3 వరకు):** ఉత్తరప్రదేశ్ వాసి. పదవిలో కొనసాగుతూ మరణించిన మొదటి రాష్ట్రపతి. ఈ పదవిలో అతి తక్కువ కాలం ఉన్నారు. ఉపరాష్ట్రపతిగా చేసి రాష్ట్రపతి అయిన రెండో వ్యక్తి. ఈయన చేతిలో ఓడిపోయినవారు జస్టిస్ కోకా సుబ్బారావు.

- **వీవీ గిరి(1969 మే 3 నుంచి 1969 జూలై 20 వరకు):** ఒడిశా వాసి. తొలి తాత్కాలిక రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతిగా ఉంటూ తాత్కాలిక రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి.
- **జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా(1969 జూలై 20 నుంచి 1969 ఆగస్టు 24):** తాత్కాలిక రాష్ట్రపతిగా చేసిన ఏకైక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. తాత్కాలిక రాష్ట్రపతి అయిన రెండో వ్యక్తి. తాత్కాలిక రాష్ట్రపతిగా తక్కువ కాలం పని చేశారు.

4. **వీవీ గిరి(1969 ఆగస్టు 24 నుంచి 1974 ఆగస్టు 24 వరకు):** అతి తక్కువ మెజార్టీ ద్వారా, ఓటు బదలాయింపు ద్వారా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి రాష్ట్రపతి అయిన ఏకైక వ్యక్తి. ఎన్నికల వివాదంలో సుప్రీంకోర్టుకు ప్రత్యక్షంగా హాజరైన రాష్ట్రపతి. కార్మిక నేతగా చేసి రాష్ట్రపతి అయ్యారు. ఉపరాష్ట్రపతిగా చేసి రాష్ట్రపతి అయిన మూడో వ్యక్తి. ఈయన చేతిలో ఓడిపోయినవారు నీలం సంజీవరెడ్డి.
5. **ఫక్రుద్దీన్ అలీ అహ్మద్(1974 ఆగస్టు 24 నుంచి 1977 ఫిబ్రవరి 11 వరకు):** స్వరాష్ట్రం అసోం. రెండో ముస్లిం రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన, ఈ పదవిలో ఉండగా చనిపోయిన రెండో వ్యక్తి. ఎమర్జెన్సీ సమయంలో రాష్ట్రపతిగా కొనసాగారు. ఈయన చేతిలో ఓడిపోయినవారు టి. చతుర్వేది.

- **బి.డి.జెట్టి(1977 ఫిబ్రవరి 11 నుంచి 1977 జూలై 25 వరకు):** కర్ణాటక వాసి. ఎక్కువ కాలం తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేశారు. ఉపరాష్ట్రపతిగా ఉండి తాత్కాలిక రాష్ట్రపతి అయిన రెండో వ్యక్తి.

6. **నీలం సంజీవరెడ్డి(1977 జూలై 25 నుంచి 1982 జూలై 25 వరకు):** ఆంధ్రప్రదేశ్ వాసి. ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి. స్పీకర్‌గా చేసి రాష్ట్రపతి అయిన ఏకైక వ్యక్తి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన మూడో వ్యక్తి. జనతా ప్రభుత్వాన్ని రద్దు చేసినప్పుడు రాజ్యాంగ ప్రక్రియను పాటించ లేదనే విమర్శ ఉంది.
7. **జ్ఞానీ జైల్ సింగ్(1982 ఏప్రిల్ 25 నుంచి 1987 జూలై 25 వరకు):** పంజాబ్ వాసి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన నాలుగో వ్యక్తి. మొదటి బీసీ రాష్ట్రపతి. ప్యాకెట్ వీటో అధికారం ఉపయోగించుకున్న ఏకైక రాష్ట్రపతి (పోస్టల్ బిల్లు విషయంలో). 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం రాజీవ్ గాంధీని ప్రధానమంత్రి చేసే విషయంలో రాజ్యాంగ ప్రక్రియను పాటించలేదనే విమర్శ ఉంది.
8. **ఆర్.వెంకట్రామన్(1987 జూలై 25 నుంచి 1992 జూలై 25 వరకు):** తమిళనాడు వాసి. ఉపరాష్ట్రపతి నుంచి రాష్ట్రపతి అయిన నాలుగో వ్యక్తి. ఎక్కువ మంది ప్రధానులతో ప్రమాణ స్వీకారం చేయించారు. 1989లో జరిగిన 9వ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజార్టీ రాకపోవడంతో అతిపెద్ద పార్టీ నాయకుణ్ని ప్రధానిగా నియమించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఇతని ప్రధాన గ్రంథం 'మై ప్రెసిడెన్షియల్ ఇయర్స్'.
9. **డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ(1992 జూలై 25 నుంచి 1997 జూలై 25 వరకు):** స్వరాష్ట్రం మధ్యప్రదేశ్. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా చేసి రాష్ట్రపతి అయ్యారు. ఉపరాష్ట్రపతి పదవి నుంచి రాష్ట్రపతిగా పదోన్నతి పొందిన ఐదో వ్యక్తి. వివాదాస్పద దళిత క్రైస్తవ రిజర్వేషన్ల బిల్లుపై వీటో చేసిన రాష్ట్రపతి. ఈయన చేతిలో ఓడిపోయినవారు జార్జ్‌స్వెల్.
10. **కె.ఆర్‌నారాయణన్ (1997 జూలై 25 నుంచి 2002 జూలై 25 వరకు):** కేరళ వాసి. ఉపరాష్ట్రపతి నుంచి రాష్ట్రపతి అయిన ఆరో వ్యక్తి. ఓట్ల సంఖ్య పరంగా అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. తొలి దళిత రాష్ట్రపతి. విదేశీ రాయబారిగా చేసి రాష్ట్రపతి అయిన రెండో వ్యక్తి. సాధారణ పౌరునిగా లోక్‌సభ ఎన్నికలో ఓటేసిన రాష్ట్రపతి. మైనార్టీల పట్ల జరిగిన దాడులపై ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ సిఫారసులను పునఃపరిశీలనకు పంపారు. అమెరికా ప్రభుత్వం నుంచి బెస్ట్ స్టేట్స్‌మెన్ అవార్డు పొందారు. ఈయన చేతిలో ఓడిపోయినవారు టీఎన్ శేషన్.
11. **డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం(2002 జూలై 25 నుంచి 2007 జూలై 25 వరకు):** స్వరాష్ట్రం తమిళనాడు. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన ఐదో వ్యక్తి. రాజకీయ నేపథ్యం లేకుండా రాష్ట్రపతిగా ఎన్నికైన మొట్టమొదటివారు. రాష్ట్రపతిభవన్‌ను ప్రజాదర్బార్‌గా మార్చిన రాష్ట్రపతి. భారతదేశ క్షిపణుల పితామహునిగా పేరుగాంచారు. రాష్ట్ర శాసన ఎన్నికల్లో ఓటుహక్కు ఉపయోగించుకున్న ఏకైక రాష్ట్రపతి. జోడు పదవుల బిల్లును పునఃపరిశీలనకు పంపిన రాష్ట్రపతి. ఈయన జన్మదినమైన అక్టోబర్ 15ను ఐక్య రాజ్యసమితి ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించింది. తమిళనాడు ప్రభుత్వం యువతను మేల్కొలిపే దినోత్సవంగా ప్రకటించింది. ఈయన రాసిన ప్రధాన గ్రంథం 'వింగ్స్ ఆఫ్ ఫైర్'. కలాం చేతిలో ఓడిపోయినవారు కెప్టెన్ లక్ష్మీ సెహగల్.
12. **ప్రతిభా పాటిల్(2007 జూలై 25 నుంచి 2012 జూలై 25 వరకు):** మహారాష్ట్రకు చెందినవారు. ఏకైక మహిళా రాష్ట్రపతి. రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా, గవర్నర్‌గా చేసి రాష్ట్రపతి అయ్యారు. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన ఆరో వ్యక్తి. రాష్ట్రపతిగా అత్యధిక విదేశీ పర్యటనలు చేశారు. ప్రజాధనాన్ని అధికంగా ఖర్చు పెట్టారు. గుజరాత్ ప్రభుత్వం రూపొందించిన కోకా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు తిరస్కరించారు. ఈమె చేతిలో ఓడిపోయినవారు భైరాన్‌సింగ్ షెకావత్.
13. **ప్రణబ్ ముఖర్జీ(2012 జూలై 25 నుంచి 2017 జూలై 25 వరకు):** పశ్చిమ బంగా వాసి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన ఏడో వ్యక్తి. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా పనిచేశారు. కేంద్ర ఆర్థిక, వాణిజ్య, సమాచార శాఖల మంత్రిగా; రక్షణ, విదేశాంగ శాఖల మంత్రిగా పనిచేసి రాష్ట్రపతి అయ్యారు. 1997లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందారు. ఉగ్రవాదులు అఫ్జల్‌గురు, కసబ్ క్షమాభిక్ష పిటిషన్‌లను తిరస్కరించారు.
14. **రామ్‌నాథ్ కోవింద్(2017 జూలై నుంచి..):** స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్. రాష్ట్రపతిగా ఎన్నికైన రెండో దళితుడు. రాజ్యసభ సభ్యునిగా, బిహార్ గవర్నర్‌గా చేసి రాష్ట్రపతి అయ్యారు. ఈయన 15వ రాష్ట్రపతి ఎన్నికల ద్వారా ఎన్నికైన 14వ రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన 8వ వ్యక్తి. ఈయన చేతిలో ఓడిపోయినవారు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్.

కాంతారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ,
హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీస్



బులెటిన్ బోర్డ్

నార్తర్న్ రైల్వే సెంట్రల్ హాస్పిటల్‌లో 14 ఖాళీలు

న్యూఢిల్లీలో ఉన్న నార్తర్న్ రైల్వే సెంట్రల్ హాస్పిటల్‌లో 14 సీనియర్ రెసిడెంట్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఈ హాస్పిటల్ నార్తర్న్ రైల్వేకు చెందినది.

- **పోస్టు పేరు:** సీనియర్ రెసిడెంట్
- **విభాగాల వారీ ఖాళీలు:** మెడిసిన్-2, సర్జరీ-1, ఆర్థోపెడిక్స్-2, అనస్థీసియా-2, ఈఎన్‌టీ-1, పీడియాట్రిక్స్-2, ఆంకాలజీ-1, ఆప్తాల్మాలజీ-1, పాథాలజీ-2.
- **వేతనం:** రూ.15,600-రూ.39,100+ ఇతర అలవెన్సులు.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ / డీఎం/ డీఎన్‌బీ/ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా. అలాగే ఎంసీఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)/ ఢిల్లీ మెడికల్ కౌన్సిల్(డీఎంసీ)/ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఉండాలి.
- **వయో పరిమితి:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ అభ్యర్థులకు 33 ఏళ్లు, పోస్ట్ డాక్టోరల్ డిగ్రీ అభ్యర్థులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఏ4 సైజు వైట్ పేపర్‌లో నిర్దేశిత విధానంలో వివరాలు పొందుపర్చాలి. దానికి సంబంధిత విద్యార్హతలు తదితర ధ్రువపత్రాలు జతచేసి నిర్దేశిత తేదీల్లో నేరుగా వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి. ❖ **ఎంపిక విధానం:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ.
- **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు:** ఆగస్టు 23,24, 2017.
- **వెబ్‌సైట్:** www.nr.indianrailways.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో 80 ట్రేడ్ అప్రెంటీసెస్ ఖాళీలు

కర్ణాటకలోని కైగాలో ఉన్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్).. 80 ట్రేడ్ అప్రెంటీసెస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** ట్రేడ్ అప్రెంటీస్
- **ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు:** ఫిట్టర్-15, టర్నర్-5, మెషినిస్ట్-5, ఎలక్ట్రీషియన్- 20, వెల్డర్ (గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్, స్ట్రక్చరల్ వెల్డర్ అండ్ గ్యాస్ కట్టర్)-10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్-15, ఎలక్ట్రానిక్ మెకానిక్-10. ❖ **అప్రెంటీస్‌షిప్ వ్యవధి:** ఏడాది.
- **అర్హతలు:** సంబంధిత ట్రేడ్ విభాగాలను అనుసరించి ఐటీఐ.
- **వయోపరిమితి:** 2017 జూలై 31 నాటికి 16-24 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ ఓబీసీ/ దివ్యాంగ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఫిజికల్ స్టాండర్డ్స్ (శారీరక ప్రమాణాలు):** ఎత్తు-137 సెం.మీ, బరువు-25.4 కేజీలు లేదా అంతకంటే ఎక్కువ. ఛాతీ-కనీసం 3.8 సెం.మీ వ్యాకోచించగలగాలి (ఛాతీ సైజును బట్టి).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 24, 2017.
- **వెబ్‌సైట్:** www.npcil.nic.in

మిధానిలో 6 'మేనేజర్' పోస్టులు


హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌లో ఉన్న మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని)లో 6 'మేనేజర్' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్ (క్లోజ్డ్ డై ఫోర్జింగ్)-1, డిప్యూటీ మేనేజర్ (క్లోజ్డ్ డై ఫోర్జింగ్)-1, సీనియర్ మేనేజర్/డీజీఎం(ఎన్‌డీటీ-2 + క్యూసీఎల్-2)-4.
- **వేతనం:** అసిస్టెంట్ మేనేజర్-రూ.16,400-రూ.40,500; డిప్యూటీ మేనేజర్- రూ.20,600-రూ.46,500; సీనియర్ మేనేజర్/ డీజీఎం (ఎన్‌డీటీ)-రూ.29,100- రూ.54,500; సీనియర్ మేనేజర్/ డీజీఎం (క్యూసీఎల్)- రూ.32,900-రూ.58,000.
- **వయో పరిమితి:** అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, సీనియర్ మేనేజర్/డీజీఎం(ఎన్‌డీటీ/క్యూసీఎల్)కు 45 ఏళ్ల లోపు ఉండాలి.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి 60 శాతం మార్కులతో బీటెక్. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఆగస్టు 16, 2017.
- **వెబ్‌సైట్:** www.midhani.com

దీక్షగా.. పరీక్షకు

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌కు వారం రోజులు

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు.. ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. అంటే.. మరో వారం రోజులు మాత్రమే. దీక్షగా పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ వ్యవధి ఎంతో అమూల్యం. ఇప్పటివరకు చదివింది ఒక ఎత్తయితే.. అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం మరో ఎత్తు. దీనిపైనే విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రిపరేషన్‌తో పాటు పరీక్ష రోజు అనుసరించాల్సిన వ్యూహంపై విశ్లేషణ..!



గ్రూప్స్ ప్రత్యేకం

- మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు: 3,900
- పరీక్ష తేదీలు: ఆగస్టు 17 నుంచి ఆగస్టు 28 వరకు
- మొత్తం పేపర్లు: 06 (క్వాలిఫయింగ్ పేపర్ ఇంగ్లిష్ సహా)
- ఒక్కో పేపర్‌కు మార్కులు: 150
- సమయం: 3 గంటలు
- పరీక్ష కేంద్రాలు: విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: ఆగస్టు 8 నుంచి ఆగస్టు 17 ఉదయం 8 గంటల వరకు
- మెయిన్స్ నుంచి ఇంటర్వ్యూకు ఎంపికయ్యే అభ్యర్థుల నిష్పత్తి : 1:2
- వివరాలకు వెబ్‌సైట్: psc.ap.gov.in

గ్రూప్ 1 మెయిన్స్.. పూర్తిగా వ్యాసరూప విధానంలో జరుగుతుంది. ఈ ఎగ్జామినేషన్‌లో రాణించేందుకు మంచి కసరత్తు అవసరం. అర్హత పరీక్షగా పేర్కొనే జనరల్ ఇంగ్లిష్ పేపర్ సహా మొత్తం ఆరు పేపర్లు. ఒక్కో పేపర్‌కు లభించే సమయం మూడు గంటలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన నాటి నుంచి మెయిన్స్ కోసం శ్రమిస్తున్న అభ్యర్థులు.. ఈ వారంలో మరింత పటిష్ట ప్రిపరేషన్ సాగించాలి. ముఖ్యంగా ఎక్కువ సమయం రివిజన్‌తో పాటు సమాధానాల రైటింగ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

రివిజన్ ఇలా

అభ్యర్థులు శాస్త్రీయ దృక్పథ రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటివరకు సబ్జెక్ట్‌లకు సంబంధించి సొంతంగా రూపొందించుకున్న షార్ట్ నోట్స్, అంశాలవారీ సినాప్సిస్‌లపై ఎక్కువ దృష్టిసారించాలి. సినాప్సిస్ చదివితే.. ఆ టాపిక్ పై పూర్తి సమాచారం మదిలో మెదిలేలా ఉండాలి. ముఖ్యంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్‌ను గ్రాఫికల్ అప్రోచ్‌తో రివిజన్ చేయడం మేలు. సొంత నోట్స్ రూపొందించుకోని అభ్యర్థులు.. చదివిన మెటీరియల్‌లోనే ముఖ్యాంశాలను, సబ్ హెడ్డింగ్స్‌ను తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలి.

ప్రాక్టీస్ టెస్ట్స్

రివిజన్‌తో పాటు ప్రతి రోజు రెండు పేపర్లకు సంబంధించి ప్రాక్టీస్ టెస్ట్ రాయడం ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది. తద్వారా పరీక్ష నాటికి.. ఒక్కో పేపర్‌కు రెండు ప్రాక్టీస్ టెస్ట్‌లు రాసిన అనుభవం సొంతమవుతుంది. ఇది పరీక్ష హాల్లో సమాధానాలు రాయడంలో సమయపాలనకు దోహదపడుతుంది. ఫలితంగా పరీక్ష రోజు ఒత్తిడి (ఎగ్జామ్ డే టెన్షన్) నుంచి ఉపశమనం కలుగుతుంది. వీలుంటే సబ్జెక్ట్ పరంగా కొత్త అంశాలు తెలుసుకునేందుకు సహచర అభ్యర్థులతో చర్చించవచ్చు. ఫలితంగా ప్రిపరేషన్‌పరంగా విస్మరించిన లేదా దృష్టికిరాని కొత్త అంశాల గురించి కొంతమేరకైనా అవగాహన కలుగుతుంది.

ఇంగ్లిష్‌పైనా దృష్టి

చాలామంది అభ్యర్థులు మిగతా పేపర్లపై ఎక్కువ సమయం కేటాయిస్తూ.. జనరల్ ఇంగ్లిష్‌ను నిర్లక్ష్యం చేస్తారు. అలాకాకుండా అర్హత పరీక్షగా పేర్కొనే జనరల్ ఇంగ్లిష్ పేపర్‌పైనా దృష్టిపెట్టాలి. ఇందులో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే తుది దశకు అవకాశం లభిస్తుంది. ఈ పేపర్‌లో ఓసీ అభ్యర్థులకు 40 శాతం, బీసీ అభ్యర్థులకు 35 శాతం, ఎస్‌సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 30 శాతం మార్కులను కనీస అర్హతగా సర్వీస్ కమిషన్ నిర్ణయించింది.

ఆరోగ్యం జాగ్రత్త

మెయిన్స్ కోసం రోజుకు పన్నెండు నుంచి పధ్నాలుగు గంటలు చదువుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. పరీక్ష ముందు రోజు కూడా అర్ధరాత్రి వరకూ చదువుతూ ఉంటే అది మరుసటి రోజు పరీక్ష హాల్లో ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి అభ్యర్థులు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరీక్ష రోజు ఇలా

- అభ్యర్థులు ఒక రోజు ముందే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రోజు కనీసం గంట ముందుగా పరీక్ష హాల్‌కు చేరుకోవాలి.
- అవసరమైన తనిఖీ ప్రక్రియలు పూర్తి చేసుకోవాలి.
- ముందుగా చేరుకునే క్రమంలో.. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత సెంటర్ చిరునామా, లొకేషన్ గురించి వీలైనంత త్వరగా తెలుసుకోవాలి.

పరీక్ష ప్రారంభమయ్యాక

అసలు పరీక్ష ప్రారంభమైంది. అభ్యర్థుల చేతికి ఓఎంఆర్ షీట్లు, కొశ్చన్ బుక్‌లెట్స్ అందాయి. మూడు గంటల వ్యవధిలో శ్రమ ఫలితం పొందే సమయం. ఈ సమయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

- ముందుగా కొశ్చన్ బుక్‌లెట్‌లో పేజీలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- కొశ్చన్ బుక్‌లెట్‌ను తెరచిన తర్వాత తొలి పది నిమిషాలు.. ప్రశ్నపత్రం ఆసాంతం చదవాలి. తర్వాతే సమాధానాలు ఇవ్వడానికి ఉపక్రమించాలి.
- సమాధానాలిచ్చే క్రమంలో ప్రతి ప్రశ్నకు సగటున పది నుంచి పన్నెండు నిమిషాలు మాత్రమే లభిస్తాయని గుర్తుంచుకోవాలి. దానికి అనుగుణంగా సమాధాన శైలి ప్రతిబింబించాలి. సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చేందుకు ప్రయత్నించాలి.
- సమాధానాలిచ్చేటప్పుడు వీలైనంత మేరకు కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- కొన్ని ప్రశ్నలకు వ్యాసరూపం కంటే పాయింట్ల రూపంలో సమాధానాలివ్వడం కూడా మేలు చేస్తుంది.
- నిర్దిష్ట సమయానికి కనీసం పది నిమిషాల ముందుగా సమాధానాలు పూర్తి చేసి.. వాటిని ఒకసారి సమీక్షించుకోవడం మేలు చేస్తుంది.

ఓఎంఆర్ షీట్.. అత్యంత అప్రమత్తం

మెయిన్ ఎగ్జామినేషన్ అభ్యర్థులు ప్రధానంగా గుర్తుంచుకోవాల్సిన అంశం.. ఓఎంఆర్ షీట్ పూరించడం. పరీక్ష ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్‌ను తప్పులు లేకుండా నింపాలి. ఇటీవల చాలామంది అభ్యర్థులు పరీక్ష ఒత్తిడి, సెంటర్‌కు ఆలస్యంగా చేరుకున్న సందర్భాల్లో ఎదురయ్యే ఒత్తిడితో ఓఎంఆర్ షీట్‌ను పూర్తి చేయడంలో పొరపాట్లు చేస్తున్నారు. సమాధానాలన్నీ సరిగా రాసి, మంచి మార్కులు పొందే అవకాశం ఉండీ అవకాశాలు చేజార్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ముందుగా కొశ్చన్ బుక్‌లెట్ మొదటి పేజీలో పేర్కొన్న నిబంధనలను చదవాలి.
- దానికి అనుగుణంగా సమాధాన పత్రంలో తమ రిజిస్ట్రేషన్ నెంబర్, సబ్జెక్ట్, సబ్జెక్ట్ కోడ్, కొశ్చన్ బుక్‌లెట్ సిరీస్, పరీక్ష కేంద్రం పేరు తదితర వివరాలను కొట్టివేతలు లేకుండా నింపాలి.
- వివరాలు తప్పుగా రాసి.. వాటిని వైట్‌నర్‌తో కొట్టివేసి తిరిగి సరైన వివరాలు రాసినా కూడా ఇన్‌వ్యాలిడ్‌గానే పరిగణిస్తారు.
- సమాధాన పత్రంలో నిర్దేశిత ప్రదేశంలో సంతకం పెట్టడం మరవకూడదు.
- సమాధానాలన్నీ సరిగా ఉన్నప్పటికీ.. ఓఎంఆర్ షీట్‌ను నింపే విషయంలో పొరపాటు చేస్తే అనర్హులుగా మిగిలే ప్రమాదం పొంచి ఉంది.
- ఇటీవల పలు పరీక్షల్లో ఇలాంటి ఘటనలను అభ్యర్థులు ఎదుర్కొన్నారు.


హాల్ టికెట్ డౌన్‌లోడ్

మెయిన్ ఎగ్జామినేషన్ అభ్యర్థులు వీలైనంత త్వరగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ నెల 8వ తేదీ నుంచి 17వ తేదీ (మెయిన్ ఎగ్జామ్స్ ప్రారంభ తేదీ) ఉదయం ఎనిమిది గంటల వరకు హాల్‌టిటెక్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. సమయం ఉంది కదా..! అని చివరి రోజు వరకు వేచి చూడకుండా.. హాల్ టికెట్‌ను వీలైనంత ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవడం మేలు. దీనివల్ల హాల్‌టికెట్‌లో పొరపాట్లు ఉంటే గుర్తించొచ్చు. వాటిని పరీక్ష కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నామినల్ రోల్‌లో మార్పులు చేయించుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు అభ్యర్థులు తప్పనిసరిగా తమ గుర్తింపును రుజువు చేసే ఏదైనా ఇతర అధికారిక గుర్తింపు కార్డును తీసుకెళ్లడం అవసరం.

ఇలా.. హాల్ టికెట్ డౌన్‌లోడ్ నుంచి పరీక్ష హాల్లోంచి బయటికి వచ్చేవరకు సబ్జెక్ట్ పరంగా.. నిబంధనల పరంగా పకడ్బందీగా వ్యవహరిస్తే చక్కటి ప్రదర్శన కనబర్చి విజయం సొంతం చేసుకోవచ్చు.

యాప్స్ తోడుగా సాగిపో..

బ్యాంకింగ్ యాప్‌లతో ఆర్థిక లావాదేవీలను అలవోకగా జరుపుతున్నాం.. సోషల్ మీడియా యాప్‌లతో బంధుమిత్రులకు అందుబాటులో ఉంటున్నాం.. ఎంటర్‌టైన్‌మెంట్ యాప్‌లతో పాటలు వింటూ; మెచ్చిన ప్రోగ్రామ్స్ చూస్తున్నాం.. గేమ్స్ యాప్‌లతో కాలక్షేపం చేస్తూ మానసికానందాన్ని పొందుతున్నాం.. ..ఇలా ఒకటేమిటి..? చేతిలో స్మార్ట్‌ఫోన్.. అందులో యాప్స్ ఉంటే చాలు..! ఎన్నో వ్యాపకాలు ఇట్టే పూర్తిచేస్తున్నాం. బిజీబిజీ వ్యక్తిగత జీవితంలో అన్ని పనులకు సమయం కేటాయించలేని పరిస్థితుల్లో యాప్‌లే ఆదుకునే నేస్తాలవుతున్నాయి. మరి ఇలాగే ఉద్యోగ జీవితంలోనూ పనులు చకచకా సాగిపోతుంటే.. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అలవోకగా చేరుకుంటూంటే..! కొలువు సులువు కాదూ..! మరి అలాంటి యాప్‌ల గురించి తెలుసుకుందాం..



జాయిన్.మీ (Join.me)

ఆన్‌లైన్‌లో సమావేశమయ్యేందుకు ఇదొక వేదిక (మీటింగ్ టూల్)గా ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఏ డివైజ్‌లోనైనా సులువుగా ఇన్‌స్టాల్ చేసుకొని వాడుకోవచ్చు. ఇందులో స్క్రీన్ షేరింగ్ సదుపాయం ఉచితం. వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని అపరిమితంగా వినియోగించుకోవచ్చు. వెబ్ కాన్ఫరెన్సింగ్, కొలాబరేషన్స్‌కు సంబంధించిన యాప్‌లు ఎన్ని ఉన్నా.. అవి జాయిన్.మీ అంత మొబైల్ ఫ్రెండ్లీగా ఉండవని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఈ యాప్‌లోని వైట్‌బోర్డ్ ఫీచర్ సాయంతో ప్రతిఒక్కరూ తమ ఆలోచనలను వర్చువల్‌గా (వాస్తవికంగా) పంచుకోవచ్చు. ఈ యాప్ ఉచితంగా లభిస్తుంది.

జిస్ట్ (Gyst):]

చేయాల్సిన పనులు చాలా ఉన్నప్పుడు, వాటన్నింటినీ చక్కబెట్టడానికి సమయం సరిపోనప్పుడు మనం ఇతరుల కన్నా కొంచెం వెనకబడటం సహజం. ఇలాంటి సందర్భాల్లో ప్రణాళికాబద్ధంగా ఎలా వ్యవహరించాలో ఈ యాప్ చెబుతుంది. టెక్ట్స్‌లు.. కాంటాక్ట్‌లు.. కేలండర్లు.. టు-డు లిస్ట్‌లు.. అన్నిటినీ ఒకేచోట సంఘటితంగా అందిస్తుంది. దీనివల్ల మీరు ఒక్కో పనికి ఒక్కో యాప్ వాడాల్సిన అవసరం ఉండదు. సమయమూ ఆదా అవుతుంది. ఈ యాప్ కూడా ఉచితమే.

బేస్‌క్యాంప్3 (Basecamp3)

ఇది ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్. ఎక్కువగా వ్యాపార వర్గాలు వాడుతుంటాయి. ఈ యాప్ మార్కెట్లోకి వచ్చి పదేళ్లు దాటింది. ప్రస్తుతం మూడో వెర్షన్ (బేస్‌క్యాంప్3) అందుబాటులో ఉంది. ఇందులోని కొన్ని ముఖ్య ఫీచర్లు.. క్లయింట్ల అభిప్రాయాలను దీర్ఘకాలం అట్టిపెట్టడం, ఫలానా వ్యక్తి ఫీడ్‌బ్యాక్ కావాలన్నప్పుడు ట్రాక్ చేయడం, సహచరులతో చాటింగ్, పనులకు సంబంధించిన విషయాలను గుర్తుచేయడం (రిమైండర్లు), తోటి ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించడం, వారు వాటిని పూర్తి చేయగానే మెసేజ్ రూపంలో ప్రశంసలు అందించడం, డాక్యుమెంట్లను ఇచ్చిపుచ్చుకోవడం (షేరింగ్). ఈ యాప్ (సాఫ్ట్‌వేర్) మాత్రం ఉచితంగా దొరకదు. నెలకు రూ.99 చెల్లించి కొనాలి.

డూడుల్ (Goodle)

ఇదొక ఈజీ షెడ్యూలింగ్ యాప్. దినచర్య అనుకున్నది అనుకున్నట్లు సకాలంలో పూర్తయ్యేలా చూస్తుంది. సహచర ఉద్యోగులందరికీ అనువైన వేళల్లోనే సమావేశాలు తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంలో ఉపయోగపడుతుంది. ఈవెంట్ నిర్వహించేందుకు మీరొక టైమ్ ఎంచుకుని దాన్ని ఈ యాప్ ద్వారా సహచరులకు చెబుతారు. వాళ్లు తమకు అనుకూలమైన సమయాలను సూచిస్తారు. చివరికి ఈ యాప్ అందరికీ అనువైన, అత్యుత్తమ స్లాట్‌ను నిర్ణయిస్తుంది.

గూగుల్ డ్రైవ్ (Google Drive)

వర్డ్ ప్రాసెసింగ్, డేటాబేస్, ప్రజెంటేషన్ అప్లికేషన్లు అన్నీ ఒకేచోట కలిగి ఉన్న (ఫుల్ సూట్) యాప్ ఇది. క్లౌడ్ బేస్డ్ స్టోరేజీ అందించడం ఇందులోని విశేషం. ఈ ఆప్షన్ వల్ల డాక్యుమెంట్లను/ఫైల్స్‌ను ఏ డివైజ్‌లో అయినా (పర్సనల్ కంప్యూటర్/స్మార్ట్‌ఫోన్/ల్యాప్‌టాప్/ఐప్యాడ్) ఓపెన్ చేయొచ్చు. డివైజ్ అర్ధంతరంగా ఆగిపోయినా అప్పటివరకు మీరు చేసిన వర్క్ మొత్తం సేవ్ అవుతుంది. రివిజన్లు చూసుకునే అవకాశం కూడా ఈ యాప్‌లో ఉంది. ఇది పరిమిత మెమరీని ఉచితంగా అందిస్తుంది. ఎక్కువ స్టోరేజీ కావాలంటే డబ్బు చెల్లించాలి.

ఓమ్నిఫోకస్2 (Omnifocus2)

ఇది టాస్క్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ యాప్. దీని సాయంతో వివిధ ప్రాంతాల్లో పనుల తీరును క్షుణ్నంగా(లోతుగా) పరిశీలించవచ్చు. ఈ యాప్‌లోని ఆప్షన్లు వినియోగానికి చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. ఫలితంగా లొకేషన్లపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవచ్చు. ఆన్ ది ఫ్లై టాస్క్ ఎంట్రీ ఫీచర్లతో స్థలాలు, వ్యక్తులు, వారి శక్తిసామర్థ్యాల ఆధారంగా పనులు కేటాయించవచ్చు. ఈ యాప్‌ను ఐఫోన్/ఐప్యాడ్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని వాడుకోవచ్చు. ఇది కూడా ఉచితంగా లభించదు. ఖరీదు కొంచెం ఎక్కువే. దాదాపు 40 డాలర్లు (రూ.2500) వెచ్చించాల్సి ఉంటుంది.

నడ్జ్‌డ్ (Nudjed)

నిత్య జీవితంలో ప్రేరణ లోపించినా.. మానసిక ఒత్తిళ్లకు గురైనా.. ఆరోగ్యపరంగా అలసటకు లోనైనా.. ఆ ప్రభావం మన పని మీద పడుతుంది. అలాంటి పరిస్థితి ఎదురవకుండా 'నడ్జ్‌డ్' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉద్యోగుల ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. సిబ్బంది ఆరోగ్యానికి సంబంధించిన కీలక సమాచారం సేకరించి, దాని ఆధారంగా వారికి మానసికంగా, శారీరకంగా అందించాల్సిన ప్రోత్సాహకాలను సంస్థలకు తెలియజేయడంలో తోడ్పడుతోంది. ఇది వెబ్ ఆధారితంగా పని చేస్తుంది. యాప్ రూపంలో గానీ ఉచితంగా గానీ లభించట్లేదు. దీని ఖరీదు ఎప్పుడూ ఒకేలా ఉండదు. మారుతూ ఉంటుంది.

బఫర్ (Buffer)

వ్యక్తులకు/సంస్థలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు ఫేస్‌బుక్, ట్విట్టర్, లింక్డ్ ఇన్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసే ఉద్యోగులకు ఈ యాప్ ఉపయుక్తంగా ఉంటుంది. ఒక అంశాన్ని ఒకేసారి వివిధ సోషల్ మీడియాల్లో షేర్ చేయాలనుకున్నప్పుడు సంబంధిత కంపెనీ అకౌంట్లన్నింటినీ ఒక ఇ-మెయిల్‌కు లింక్ చేస్తే ట్వీట్లను, స్టేటస్ అప్‌డేట్లను సెకన్ల వ్యవధిలో పుష్ ఔట్ చేయొచ్చు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
216 ▼	71 ▼
31,798	9,908

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు పై రెండు సూచీలు రాత్రి 11.30

నాస్‌డాక్	6,346	▼ 24
డోజోన్స్	22,023	▼ 61
ఎఫ్‌టీఎస్ఈ 100	7,498	▼ 45
డాక్స్	12,154	▼ 138
షాంఘై	3,275	▼ 6
నికాయ్	19,739	▼ 257

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	63.00	64.50
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	81.43	84.01
€	యూరో	థామస్‌కుక్	73.55	75.95
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	57.10	58.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	49.30	51.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	46.07	47.43
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.43	18.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.79	18.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.74	10.92

ఇక.. బ్యాంకుల విలీన మేళా!!



- క్యూ1 ఫలితాల తర్వాత నుంచి ప్రక్రియ షురూ
- పనితీరు, ఆర్థిక భారం తదితర అంశాలే ప్రాతిపదిక

న్యూఢిల్లీ: మరిన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి లేదంటున్నప్పటికీ.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలన్నీ వెల్లడైన తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. విలీనాలపై నిర్ణయాలు తీసుకునే ముందు ఆయా బ్యాంకుల ఆర్థిక పనితీరుతో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చని వివరించారు. ప్రాంతీయంగా సమతుల్యత, భౌగోళికంగా విస్తరణ, ఆర్థిక భారం, మానవ వనరుల ఏకీకరణ మొదలైనవి ఇందులో ఉండగలవని పేర్కొన్నారు. బలహీన బ్యాంకును బలమైన బ్యాంకులో విలీనం చేస్తే పటిష్టమైన బ్యాంకు కూడా కూలిపోయే అవకాశం ఉన్నందున అటువంటి చర్యలు ఉండబోవని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇదంతా కూడా సంక్లిష్టమైన ప్రక్రియగా ఆయన అభివర్ణించారు. ఏదైతేనేం బ్యాంకుల జూన్ త్రైమాసిక ఫలితాలు వెల్లడయ్యాక.. ప్రక్రియ ప్రారంభం కాగలదని అధికారి తెలిపారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌తో పాటు అయిదు అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు.. ఎస్‌బీఐలో విలీనమైన తర్వాత నుంచి మిగతా పీఎస్‌బీల విలీనంపైనా వార్తలు వస్తున్నాయి. మొండిబకాయిలు, ఆర్థిక స్థితిగతులు, ఉపయోగిస్తున్న టెక్నాలజీ తదితర అంశాల గురించి తెలుసుకునేందుకు దేనా బ్యాంకు సహా కొన్ని పీఎస్‌బీలతో ఆర్థిక శాఖ కొన్నాళ్ల క్రితం సమావేశమైన సంగతి తెలిసిందే. అయితే, పీఎస్‌బీల విలీన ప్రతిపాదనేదీ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో లేదంటూ ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ వారం రోజుల క్రితం లోక్‌సభకు తెలిపారు. ఈ నేపథ్యంలో క్యూ1 ఫలితాల తర్వాత పీఎస్‌బీల విలీన ప్రక్రియ మొదలుకావొచ్చన్న వార్త ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19 శాతం వృద్ధి

ఏప్రిల్-జూలై మధ్య రూ.1.90 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్- జూలై మధ్య 19 శాతం పెరిగాయి. విలువ రూపంలో ఇది రూ.1.90 లక్షల కోట్లు. 2017-18 మధ్య కాలంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.9.80 లక్షల కోట్లుగా ఉండాలని బడ్జెట్‌లో లక్ష్యించారు. తాజా వసూళ్ల మొత్తం ఇందులో 19.5 శాతంగా ఉంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను, కార్పొరేట్ ట్యాక్స్‌లతో కూడిన ప్రత్యక్ష పన్ను వసూళ్ల వృద్ధి క్రమంగా వృద్ధి చెందుతున్నట్లు ఆర్థికశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా రిఫండ్స్ విలువ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలంలో రూ.61,920 కోట్లని ఈ ప్రకటనలో వివరించింది.

యాంబీ వ్యాలీ వేలం నిలిపివేయండి!

సుప్రీంకు సహారా అభ్యర్థన



న్యూఢిల్లీ: యాంబీ వ్యాలీ ఆస్తి వేలాన్ని నిలిపేయాలని సహారా చీఫ్ సుబ్రతో రాయ్ బుధవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. రెండు గ్రూప్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఇన్వెస్టర్ల నుంచి నిధులు వసూలు చేయటమే కాక... పునః చెల్లింపుల్లో విఫలమైన కేసులో రూ.34,000 కోట్ల యాంబీ వ్యాలీ వేలానికి ఇంతక్రితం బాంబే హైకోర్టు అధికారిక లిక్విడేటర్‌ను నియమిస్తూ, సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. ఆగస్టు 14న ఇందుకు సంబంధించి లిక్విడేటర్ నోటీసు ప్రచురించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే సహారా తాజా పిటిషన్ దాఖలు చేసింది. చెల్లింపుల ప్రణాళికను సుప్రీం ముందు సహారా ఉంచుతున్నందున మహారాష్ట్ర పూనే జిల్లాలో ఉన్న ఈ ఆస్తి వేలం నిలిపివేయాలని రాయ్ కోరారు. అయితే కేసు విచారణ తేదీని తరువాత నిర్ణయిస్తామని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ తెలిపింది. చెల్లించాల్సిన మొత్తం రూ.24,000 కోట్ల నిధుల్లో మిగిలిన దాదాపు రూ.9,000 కోట్ల చెల్లింపులకు 18 నెలల సమయాన్ని ఇప్పటికే సహారా కోరింది. అయితే వడ్డీతో కలిపి దాదాపు రూ.35,000 కోట్ల బకాయిలు ఉన్నాయన్నది సెబీ వాదన.

ఫోర్బ్స్ సృజనాత్మక కంపెనీల్లో మూడు దేశీ సంస్థలు

టాప్ 100లో... హిందుస్తాన్ లీవర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: నూతన ఆవిష్కరణలకు సంబంధించి ప్రపంచంలోనే 100 అత్యుత్తమ సృజనాత్మక కంపెనీల జాబితాలో మూడు భారతీయ సంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన ఈ లిస్టులో హిందుస్తాన్ లీవర్ (హెచ్‌యూఎల్), ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్ ఉన్నాయి. హెచ్‌యూఎల్ క్రితం సారి 31వ స్థానంలో ఉండగా ఈసారి ఏడో స్థానానికి, ఏషియన్ పెయింట్స్ 18వ స్థానం నుంచి ఎనిమిదో స్థానానికి ఎగబాకాయి. ఎయిర్‌టెల్ కొత్తగా 78వ ర్యాంకుతో లిస్టులో చోటు దక్కించుకుంది. టీసీఎస్, సన్ ఫార్మా, లార్సన్ అండ్ టూబ్రో గతేడాది జాబితాలో ఉన్నప్పటికీ ఈసారి స్థానం లభించలేదు. దీంతో లిస్టులో భారతీయ సంస్థల సంఖ్య అయిదు నుంచి మూడుకి తగ్గింది. ఈసారి జాబితాలో టెస్లా మోటర్స్‌ను రెండో స్థానానికి నెట్టి సేల్స్‌ఫోర్స్‌డాట్‌కామ్ అగ్రస్థానంలో నిల్చింది. అమెజాన్‌డాట్‌కామ్ మూడో స్థానంలో ఉంది. వర్తమానంలోనూ, భవిష్యత్‌లోనూ మరిన్ని కొత్త ఆవిష్కరణలు చేయగలవని ఇన్వెస్టర్లు విశ్వసిస్తున్న కంపెనీలు ఈ జాబితాలో ఉంటాయి. కనీసం 10 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్ గల సంస్థలకు ఇందులో చోటు ఉంటుంది.



ఎంసీఎక్స్‌లో బంగారం ఆప్షన్ల కాంట్రాక్టులు

బంగారం ఫ్యూచర్స్‌లో ఆప్షన్ల కాంట్రాక్టులను ప్రారంభించేందుకు ఎంసీఎక్స్‌కు సెబీ ఆమోదం తెలిపింది. ''రానున్న కొన్ని వారాల్లో ఆప్షన్ల కాంట్రాక్టు సైజు, ఇతర వివరాలు, ప్రారంభ తేదీని ప్రకటిస్తాం'' అని ఎంసీఎక్స్ ప్రతినిధి గిరీష్‌దేవ్ తెలిపారు. కమోడిటీ మార్కెట్లో ఆప్షన్ల ప్రారంభానికి జూన్‌లో సెబీ అనుమతించగా, ఒక ఎక్స్ఛేంజ్ ఏదేనీ ఒక కాంట్రాక్టులోనే దీన్ని ప్రారంభించాలన్న పరిమితి విధించింది.

లాభాల్లోకి బ్యాంక్ ఆఫ్ ఇండియా

జూన్ క్వార్టర్లో రూ.88 కోట్లు



ముంబై: జూన్ క్వార్టర్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరిగి లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.88 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆస్తుల నాణ్యత మెరుగుపడడంతో మొండి బాకాయిలకు చేసిన కేటాయింపులు తగ్గాయి. గతేడాది ఇదే కాలంలో బ్యాంకు రూ.741 కోట్ల నష్టాన్ని ఎదుర్కోవడం గమనార్హం. మొండి బకాయిలను మరింత మెరుగ్గా వసూలు చేయడంతోపాటు, ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారకుండా తీసుకున్న చర్యలు ఫలించినట్టు బీవోఐ ఎండీ, సీఈవో దీనబంధు మొహపాత్ర తెలిపారు. గతేడాది ఇదే త్రైమాసిక కాలంలో మొండి బకాయిల వసూళ్లు రూ.970 కోట్లు ఉంటే, తాజాగా రూ.1,360 కోట్లకు పెరిగాయి. స్థూల ఎన్‌పీఏలు 13.38 శాతం నుంచి 13.05 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏలు సైతం 7.78 శాతం నుంచి 6.7 శాతానికి దిగొచ్చాయి.

టాటా మోటార్స్‌లో లేని వేగం

- జూన్ క్వార్టర్ కన్సాలిడేటెడ్ లాభంలో 41% వృద్ధి
- రూ. 3,200 కోట్లకు చేరిక
- జేఎల్ఆర్ రూపంలో పెరిగిన లాభం
- స్టాండలోన్‌గా చూసుకుంటే రూ.467 కోట్ల నష్టం
- ఆదాయం 10 శాతం డౌన్



న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ జూన్ త్రైమాసిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా లేవు. కన్సాలిడేటెడ్ లాభం 41.5 శాతం వృద్ధితో రూ.3,200 కోట్లకు చేరినప్పటికీ, స్టాండలోన్‌గా చూసుకుంటే మాత్రం రూ.467 కోట్ల నష్టాన్ని చవిచూడడం గమనార్హం. ముఖ్యంగా బ్రిటిష్ కార్ల విభాగం జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్)లో పెన్షన్ పథకాలకు సంబంధించి చేసిన మార్పులతో ఏకకాల అదనపు లాభాన్ని పొందింది. ''జాగ్వార్ ల్యాండ్ రోవర్ పెన్షన్ పథకాల్లో చేసిన మార్పుల వల్ల వచ్చిన రూ. 3,609 కోట్ల లాభం కూడా మొత్తం లాభాల్లో కలిసి ఉంది'' అంటూ టాటా మోటార్స్ తన ప్రకటనలో పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ లాభం రూ.2,260 కోట్లు. ఇక జూన్ త్రైమాసికంలో ఆదాయం 10 శాతం పడిపోయి రూ.59,818 కోట్లకు పరిమితమైంది. స్టాండలోన్‌గా చూసుకుంటే టాటా మోటార్స్ జూన్ క్వార్టర్లో రూ.467 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. వాస్తవానికి అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.25.75 కోట్ల లాభాన్ని ఆర్జించడం గమనార్హం. స్టాండలోన్ ఆదాయం సైతం 9% క్షీణించి రూ.11,435 కోట్ల నుంచి రూ.10,375 కోట్లకు దిగొచ్చింది.

ఏడీఆర్ డౌన్...

భారత్ మార్కెట్ ముగిసిన తర్వాత టాటా మోటార్స్ ఫలితాలు వెల్లడికాగా, బీఎస్‌ఈలో ఈ షేరు 3 శాతం క్షీణతతో రూ. 417 వద్ద ముగిసింది. అయితే బుధవారం రాత్రి అమెరికా మార్కెట్లో టాటా మోటార్స్ ఏడీఆర్ 7 శాతం పతనమై 30.9 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇదే స్థాయిలో ఏడీఆర్ ముగిస్తే, గురువారంనాడిక్కడ టాటా మోటార్స్ షేరు మరింత పతనమయ్యే అవకాశం వుంది.

వాహన విక్రయాలు డౌన్

కమర్షియల్, ప్యాసింజర్ వాహనాల విక్రయాలు కూడా తక్కువగా నమోదు కావడం గమనార్హం. కంపెనీ మొత్తం 1,11,860 వాహనాలను విక్రయించింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో విక్రయించిన వాహనాల సంఖ్యతో పోల్చి చూస్తే 11.8 శాతం తగ్గాయి. దేశీయంగా మధ్య స్థాయి, భారీ వాణిజ్య వాహనాల విభాగంలో వృద్ధి క్షీణించడం, తేలికపాటి వాణిజ్య వాహనాల విక్రయాలు ఫ్లాట్‌గా ఉండడం, ప్యాసింజర్ వాహన విక్రయాలు మధ్యస్థంగా ఉండడం కారణాలుగా పేర్కొంది.

కాగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఆదాయం 5.6 బిలియన్ పౌండ్లు (రూ.47,040 కోట్లు)గా నమోదైంది. గతేడాది జూన్ త్రైమాసికంతో పోలిస్తే ఇది 244 మిలియన్ పౌండ్లు (రూ.2,050 కోట్లు) వృద్ధి చెందినట్టు తెలుస్తోంది.

అంచనాలకు అనుగుణంగా లేవు



ఫలితాలు మా అంచనాలను అందుకోలేదు. వాణిజ్య, ప్రయాణికుల వాహన విభాగాల్లో పనితీరు మెరుగుపరిచే విషయమై మా విధానాన్ని నవీకరించడంపై దృష్టి సారించాం.

–సీఈవో గుంటెర్ బుట్స్‌చెక్, టాటా మోటార్స్ ఎండీ

వండర్‌లా లాభం రూ.25.96 కోట్లు

హైదరాబాద్‌లో 5 శాతం పడిపోయిన పర్యాటకుల రాక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమ్యూజ్‌మెంట్ పార్కుల నిర్వహణలో ఉన్న వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ 2017-18 తొలి త్రైమాసికంలో రూ.25.96 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి పన్ను తర్వాత లాభం రూ.22.43 కోట్లుగా ఉంది. అంటే ఏడాదిలో 16 శాతం వృద్ధిని నమోదు చేసిందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 2017 క్యూ1లో మొత్తం ఆదాయం 17 శాతం వృద్ధి రేటుతో రూ.105.43 కోట్లు. గతేడాది ఇదే సమయానికి రూ.90.43 కోట్లు. గతేడాది క్యూ1లో బెంగళూరు, కోచి, హైదరాబాద్‌లోని పార్కుల ఆదాయం రూ.86.89 కోట్లు కాగా.. ఈ ఏడాది క్యూ1లో 18 శాతం వృద్ధితో 102.21 కోట్లని నమోదు చేసిందని కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉంటే గతేడాది క్యూ1తో పోలిస్తే కోచిలోని పార్క్‌కు కస్టమర్ల రాక 6 శాతం వృద్ధిని నమోదు చేస్తే.. బెంగళూరులో 4 శాతం, హైదరాబాద్‌లో 5 శాతం కస్టమర్ల రాక తగ్గిందని సంస్థ ఎండీ అరున్ కే చిట్టిలపిళ్లై ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కస్టమర్ల రాక తగ్గడానికి ప్రధాన కారణం ఏప్రిల్ 2016లో పార్క్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆఫర్లను విడుదల చేయటమేనని ఆయన తెలిపారు. చెన్నై తిరుప్పోరూర్‌లో 57 ఎకరాల్లో రానున్న పార్క్ స్థల సమీకరణ పూర్తయిందని, మరో 3 నెలల్లో నిర్మాణ పనులను ప్రారంభిస్తామని 2019-20 ఆర్థిక సంవత్సరానికి పార్క్ వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన వివరించారు.



మహీంద్రా చిన్న ట్రాక్టర్ 'జివో'

బెంగళూరు: పారిశ్రామిక దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా తమ తొలి చిన్న ట్రాక్టర్ మహీంద్రా జివోను ఆవిష్కరించింది. సామర్థ్యం పరంగా 25 హెచ్‌పీలోపు కేటగిరికీ చెందిన ట్రాక్టర్‌లో 4డబ్ల్యూడీ మోడల్ రేటు రూ. 4 లక్షలుగా (కర్ణాటకలో ఎక్స్‌షోరూం ధర) ఉంటుందని మహీంద్రాఅండ్ మహీంద్రా ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సెక్టార్ వైస్ ప్రెసిడెంట్ రవీంద్ర షహానే తెలిపారు. పూలసాగు మొదలైన వ్యవసాయ పనుల్లో ఇది ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. దేశీ ట్రాక్టర్ మార్కెట్లో తమ సంస్థకు 45.8 శాతం వాటా ఉందని రవీంద్రా చెప్పారు. ఈ ఏడాది ట్రాక్టర్ మార్కెట్ ఆరు లక్షల యూనిట్ల స్థాయికి చేరగలదని తెలిపారు.

13లో స్పందించినవి 3

- సెబీ చర్య సరికాదన్న సైబర్‌మేట్, ఫ్రాంటియర్, ఫార్మాక్స్
- మిగిలినవి అడ్రస్ లేని పరిస్థితే
- సంప్రతించటానికి 'సాక్షి' చేసిన ప్రయత్నాలు విఫలం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: షెల్ కంపెనీలుగా సెబీ ముద్ర వేయటంపై పలు సంస్థలు బుధవారం సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. మరికొన్ని బీఎస్‌ఈకి, సెబీకి తమ వ్యతిరేకత తెలియజేస్తూ లేఖలు పంపాయి. నిజం చెప్పాలంటే సెబీ విడుదల చేసిన 331 కంపెనీల జాబితాలో చాలా వరకూ డొల్ల కంపెనీలే. అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు కూడా లేకుండా... స్టాక్ మార్కెట్లో మాత్రం షేర్ల లావాదేవీలు దివ్యంగా జరుపుతున్నవే. కాకపోతే సెబీ జాబితాలో ప్రకాష్ ఇండస్ట్రీస్, జెకుమార్ ఇన్‌ఫ్రా వంటి దాదాపు డజనుకు పైగా కంపెనీలు మంచి మార్కెట్ విలువతో పాటు చక్కని లాభాలార్జిస్తున్నవి కావటం గమనార్హం. ఇలాంటి వాటిని కూడా షెల్ జాబితాలో వేసేయటంతో పలు వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవటమే కాక... కొన్ని కంపెనీలు న్యాయస్థానాల్ని సైతం ఆశ్రయించాల్సి వచ్చింది.

ఈ 331 కంపెనీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందినవి దాదాపు 13 వరకూ ఉన్నాయి. ఇవి నిజంగా షెల్ కంపెనీలేనా? వీటిని ఎందుకు జాబితాలో చేర్చారు? అసలు వీటి చిరునామాలు సరైనవేనా? వీటికి తాడూ బొంగరం ఉన్నాయా? అనే వివరాలు తెలుసుకోవటానికి బుధవారం 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో అడ్రస్ ఉండి... స్పందించినవి మూడే కావటం గమనార్హం. మిగిలిన వాటి ఫోన్ నెంబర్లే కాదు... ఆచూకీ సైతం తెలియరాలేదు. ఆ వివరాలు చూస్తే...

''మేం కంపెనీల చట్టం ప్రకారం ప్రతి నిబంధననూ పాటిస్తున్నాం. ఆదాయపు పన్ను, సేవా పన్ను క్రమం తప్పకుండా కడుతున్నాం. మాది షెల్ కంపెనీ కాదు. మాకు ఏ షెల్ కంపెనీతోనూ సంబంధాలు కూడా లేవు. మాకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) గుర్తింపు ఉంది. మా పేరు షెల్ కంపెనీల జాబితాలో రావటం విస్మయానికి గురి చేసింది'' అని సైబర్‌మేట్ ఇన్ఫోటెక్ ప్రతినిధి చెప్పారు. ఇదే విషయాన్ని సంస్థ బీఎస్‌ఈకి కూడా వెల్లడించింది. 30 ఏళ్లుగా కంపెనీని నడుపుతున్నామని, ఏ రోజూ తప్పుడు పనిచేయలేదని ఫ్రాంటియర్ ఇన్ఫర్మాటిక్స్ ప్రతినిధి తెలిపారు. 'ముందస్తు నోటీసు లేకుండా సెబీ ఈ చర్య తీసుకోవడం అన్యాయం. సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఐటీ కంపెనీ మాదే. 2,000 మందికిపైగా ఉపాధి కల్పించాం. ఇప్పుడిలా ఎందుకు జరిగిందో అంతుపట్టడం లేదు' అని ఆయన వాపోయారు.

జీడీఆర్ కేసులో ఫార్మాక్స్..

గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్) జారీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫార్మాక్స్ ఇండియా సైతం అనుమానిత షెల్ కంపెనీల జాబితాలో ఉంది. ''జీడీఆర్ జారీ ప్రక్రియలో అల్టా విస్టా ఇంటర్నేషనల్ సంస్థ మమ్మల్ని మోసం చేసింది. ఆ కంపెనీ ఎండీ అరుణ్ పంచరియాపై చర్యలు తీసుకోవాలని మేం గతంలో దాఖలు చేసిన పలు కేసులు పెండింగులో ఉన్నాయి. మేమెలాంటి అవకతవకలకూ పాల్పడలేదు'' అని సంస్థ ప్రతినిధి చెప్పారు.

వీటి చిరునామాలూ తప్పేనా?

మిగిలిన సంస్థల్లో సొంత వెబ్‌సైట్, ఫోన్ నంబర్ లేని కంపెనీలే ఎక్కువ. ఇన్నాళ్లూ బీఎస్‌ఈకి ఫైల్ చేసిన పత్రాల్లో పేర్కొన్న ఫోన్ నంబర్లు కూడా పనిచేయడం లేదు. కొన్ని నంబర్లు పనిచేస్తున్నా అటు నుంచి స్పందన లేదు. ప్రొసీడ్ ఇండియా పేరిట వెబ్‌సైట్ పనిచేస్తున్నా... ఆ వెబ్‌సైట్లో పేర్కొన్న ఫోన్ నెంబరు మాత్రం పనిచేయటం లేదు. యంత్ర నేచురల్ రిసోర్సెస్‌దీ అదే పరిస్థితి. ఇక త్రినేత్ర ఇన్‌ఫ్రా వెంచర్స్ జాడే లేదు. ఎల్ఎన్ ఇండస్ట్రీస్ ఇండియాకు వెబ్‌సైట్ లేకపోగా బీఎస్‌ఈకి ఇచ్చిన నంబరూ పనిచేయడం లేదు. వెన్ మ్యాక్స్ డ్రగ్స్, జీఆర్ కేబుల్స్‌కు సంబంధించి వాటి ప్రతినిధుల్ని వివిధ మార్గాల్లో సంప్రతించే ప్రయత్నాలు చేసినా అట్నుంచి స్పందన లేదు. పాల్కో లిమిటెడ్ ల్యాండ్‌లైన్ నంబరు ప్రస్తుతం ఓ న్యాయవాది వద్ద ఉంది. చాలా రోజుల క్రితమే టెలికం కంపెనీ తమకు ఈ నంబరు కేటాయించిందని ఆయన 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు.

విచారణ లేకుండా ఆదేశాలేంటి?

సెబీని ప్రశ్నించిన శాట్

- ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన 'షెల్' కంపెనీలు
- వీటిలో జేకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్, పార్శ్వనాథ్ డెవలపర్స్
- సెబీ ఉత్తర్వులపై స్టే విధించాలని వినతి
- విచారణ నేటికి వాయిదా



ముంబై: అనుమానిత షెల్ కంపెనీలంటూ సెబీ ముద్ర వేయడమే కాకుండా ట్రేడింగ్‌కు సంబంధించి ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ పలు కంపెనీలు బుధవారం సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను (శాట్) ఆశ్రయించాయి. వీటిలో ప్రధానంగా జేకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్, పార్శ్వనాథ్ డెవలపర్స్ ఉన్నాయి. చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్నామని, తమవి షెల్ కంపెనీలు కావని అవి స్పష్టం చేశాయి. సెబీ ట్రేడింగ్ ఆంక్షలపై స్టే విధించాలని కోరాయి. సెబీ ఆదేశాలు దిగ్భ్రాంతికి గురి చేశాయని, వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలను కూడా షెల్ కంపెనీల పేరిట ఈ జాబితాలో చేర్చారంటూ శాట్ దృష్టికి తీసుకెళ్లాయి. దీనికి స్పందించిన శాట్... ఆదేశాలు జారీ చేసే ముందు ఆయా కంపెనీలకు సంబంధించి ఎందుకు విచారణ నిర్వహించలేదని సెబీని ప్రశ్నించింది. సెబీ మాత్రం తన చర్యను సమర్థించుకుంది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి అందిన జాబితా ఆధారంగా 331 అనుమానిత షెల్ కంపెనీలపై చర్యలకు ఆదేశించినట్టు శాట్‌కు తెలిపింది. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను కోరినట్టు వెల్లడించింది. అయితే, కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి జాబితా జూన్ 9నే సెబీకి అందగా, ఆగస్ట్ 7న ఆదేశాలు జారీ చేసినట్టు తెలియడంతో ఈ మధ్య కాలంలో విచారణ నిర్వహించి ఉండొచ్చు కదా అని శాట్ ప్రశ్నించింది. ఈ పిటిషన్లపై విచారణ గురువారానికి వాయిదా పడింది.

అన్నీ కావు... ట్రేడయ్యేవి కొన్నే: బీఎస్ఈ, ఎన్ఎస్ఈ

సెబీ ట్రేడింగ్ ఆంక్షలకు ఆదేశించిన 331 కంపెనీల్లో వాస్తవానికి ట్రేడవుతున్నవి సగం మేరే ఉన్నాయి. ఇందుకు సంబంధించి బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బుధవారం ఓ ప్రకటన జారీ చేశాయి. సెబీ ఆదేశించిన 331 కంపెనీల్లో 164 కంపెనీల స్టాక్స్‌ను అంతకుముందే వివిధ రకాల కారణాల వల్ల సస్పెండ్ చేయడం జరిగింది. ట్రేడ్ అవుతున్న మిగిలిన 167 కంపెనీల స్టాక్స్‌లో చాలా వాటిపై ఈ నెల 8నుంచే ఆరో గ్రేడ్ నిఘా ఆంక్షల పరిధిలోకి తీసుకువచ్చాం'' అని బీఎస్ఈ పేర్కొంది.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
రూ.4,750 (కనిష్టం)	రూ.1,800 (కనిష్టం)	రూ.3,527 (కనిష్టం)	రూ.260 (కనిష్టం)	రూ.4,100	రూ.3,600 (హెచ్‌ఎంటీ)	రూ.6,500	రూ.4,400 (టన్నుకు)	రూ.6,781
రూ.5,110 (గరిష్టం)	రూ.4,700 (గరిష్టం)	రూ.8,284 (గరిష్టం)	రూ.840 (గరిష్టం)					











మూడు వారాల కనిష్టం

- షెల్ కంపెనీలపై సెబీ ఆదేశాలతో పెరుగుతున్న ఆందోళన
- అంతర్జాతీయ సంకేతాల బలహీనత
- సెన్సెక్స్ 216 పాయింట్లు, నిఫ్టీ 70 పాయింట్లు డౌన్



కిర్లంపూడి: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం తలపెట్టిన పాదయాత్రను బుధవారం 15వ రోజు కూడా పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని పోలీసులు ఆయనకు తెలియజేశారు. దీంతో జేఏసీ నాయకులు, కాపు నాయకులతో కలిసి చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసుకుని ముద్రగడ వినూత్న తరహాలో నిరసన తెలియజేశారు. పోలీసులు అనుమతులు లేవనడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు ఎలాగు సంకెళ్లు వేయడం లేదు.. మేమే వేసుకుని వచ్చాం.. పాదయాత్రకు అనుమతి ఇవ్వండి లేదా జైల్లో పెట్టించండి' అని పోలీసులను కోరారు. 'మా జాతికి స్వేచ్ఛ ఇవ్వరా? మాకు అడిగే హక్కులేదా? మేము రాష్ట్ర పౌరులం కాదా' అని ఆయన ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబుకు చట్టాలు వర్తించవా? ఆయన రాజ్యాంగానికి అతీతుడా?' అని మండిపడ్డారు. గోదావరి పుష్కరాల్లో 29 మంది మృతికి కారకుడయ్యాడు. అయినా అయనపై కేసు లేదు. అప్పట్లో మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్ట్‌పై దండయాత్రకు ఎవరి అనుమతి తీసుకుని వెళ్లారు? అని ముద్రగడ ప్రశ్నించారు. 'మేము అల్పులం కాబట్టి మాపై అణచివేత చర్యలు చేపడుతున్నారు' అని అన్నారు. 'ఏది ఏమైనా పాదయాత్ర చేసి తీరుతాను.అందుకే నిరవధిక పాదయాత్ర ప్రకటించాను..' అని అన్నారు. మమ్మల్ని అరెస్ట్ చేసి జైల్లో పెడితే మీకు విశ్రాంతి దొరుకుతుంది తప్ప అప్పటి వరకు రోజూ ఇలాగే పాదయాత్రకు ప్రయత్నిస్తానని ఆయన పోలీసులతో అన్నారు. జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాశ్, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్, జీవీ రమణ, మలకల చంటిబాబు, కలిశెట్టి వెంకటేశ్వరరావు, గోపు అచ్యుత రామయ్య, సర్పంచ్ పెంటకోట నాగబాబు పాల్గొన్నారు.

ముద్రగడ ఇంట మోగిన కంచాలు

ముద్రగడ ఇంటివద్ద బుధవారం మధ్యాహ్నం 11 నుండి 12 గంటల వరకు జేఏసి నాయకులు, కాపు నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో కంచాల మోత కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్యం సిండికేట్ల కేసుల విచారణకు కమిటీ

సాక్షి, అమరావతి: మద్యం సిండికేట్ల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న అబ్కారీ అధికారులపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. 2011లో రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు అబ్కారీ అధికారులపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కొందరిని జైలుకు పంపించారు. ఇప్పుడు ఈ కేసులతో ఎక్సైజ్ శాఖ పదోన్నతులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రభుత్వం అబ్కారీ అధికారులపై విడతల వారీగా విచారణ కొనసాగిస్తోంది. ఈ మేరకు కర్నూలు జిల్లాలో పనిచేసిన 13 మంది ఎక్సైజ్ అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు బుధవారం జీవో జారీ చేశారు. విచారణను కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌కు అప్పగించారు. విచారణాధికారిగా కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ జాయింట్ సెక్రటరీ సహదేవరెడ్డిని నియమించారు. నివేదికను 3 నెలల్లోగా అందించాలని ఆదేశించారు. 13 మందిలో పది మంది పదవీ విరమణ చేయగా, ముగ్గురు వివిధ చోట్ల విధులు నిర్వహిస్తున్నారు. విచారణ ఎదుర్కొంటున్న వారిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్లు సి.శ్రీరాములు, వి.రేణుక, సీఐ వి.శ్రీధర్‌లు ఉన్నారు. పదవీ విరమణ చేసిన వారిలో సీఐలు వి.నాగబూశి, జి.ఈశ్వర్‌రెడ్డి, షేక్ అహ్మద్, ఎస్కే ఇమామ్ హుస్సేన్, పి.శ్రీరాములు, కాషావలి, నాగరాజు, ఎస్సై ఖాసిం సాహెబ్, ఈఎస్‌లు పి.నరసింహం, జి.నరసింహులు ఉన్నారు.

ఆ బస్సుకు పర్మిట్ లేదు.. డ్రైవర్‌కి లైసెన్స్ లేదు

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న నారాయణ యాజమాన్యం
- బస్సును సీజ్ చేసిన రవాణా శాఖ అధికారులు



సీజ్ చేసిన నారాయణ స్కూల్ బస్సు

బాపట్ల టౌన్: గుంటూరు జిల్లా బాపట్లలోని నారాయణ పాఠశాల విద్యార్థులను తరలించే బస్సు డ్రైవర్ మద్యం సేవించి బస్సును నడిపిన కేసులో బుధవారం విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి. మద్యం సేవించి బస్సు నడిపిన డ్రైవర్‌కి అసలు లైసెన్సే లేకపోగా ఆ బస్సుకు పర్మిట్ కూడా లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 23తోనే దాని పర్మిట్ కాలం ముగిసింది. నారాయణ యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఈ ఘటనతో తేటతెల్లం అవుతోంది. మంగళవారం డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం అతన్ని కోర్టులో హాజరుపరిచారు. మోటారు వాహనాల తనిఖీ అధికారి విచారణలో అతనికి లైసెన్సు కూడా లేదని వెల్లడైంది. సదరు బస్సు వివరాలను పరిశీలించిన మోటారు వాహనాల తనిఖీ అధికారి.. దానికి పర్మిట్ గడువు ముగిసిందని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్‌ను సీజ్ చేయడంతో పాటు, లైసెన్స్ లేకుండా బస్సును నడుపుతున్న డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

మద్యం దుకాణంపై చర్యలేవి?

సాధారణంగా మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. అధికార పార్టీ అండతో బాపట్లలో రాత్రింబవళ్లు తేడా లేకుండా మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం 6.45 గంటల సమయంలో నారాయణ స్కూల్ బస్సు డ్రైవర్ మద్యం సేవించడమే ఇందుకు నిదర్శనం. పక్కా అధారాలు.. సమయంతో సహా వివరాలు తెలిసినా ఎక్సైజ్ అధికారులు ఇప్పటివరకు కనీస చర్యలు కూడా తీసుకోకపోవటం శోచనీయం. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యాపారులపై పోలీసుల చర్యలు కూడా శూన్యం. రమ్య వైన్స్ అధికార పార్టీ నేతకు చెందిన దుకాణం కావడంతో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

నీటి తొట్టెలో చిన్నారి మృతదేహం

- స్వామీజీ నరబలి ఇచ్చాడని అనుమానం
- మఠాన్ని ధ్వంసం చేసిన గ్రామస్తులు



చిన్నారి మృతదేహం ఉన్న నీటి తొట్టె



చిన్నారి హరికేష్ (ఫైల్)

వేలూరు (తమిళనాడు): తమిళనాడు వానియంబాడిలోని ఓ మఠం నీటి తొట్టెలో చిన్నారి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. నరబలి ఇచ్చి నీటి తొట్టెలో వేశారా? అనే అనుమానంతో ఆగ్రహించిన గ్రామస్తులు స్వామిజీ మఠాన్ని ధ్వంసం చేశారు. వేలూరు జిల్లా వానియంబాడి తాలుకా మేల్ నిమ్మయంబట్టు గ్రామానికి చెందిన మురుగన్ కుమారుడు హరికేష్ అలియాస్ తులసి (2) సోమవారం నుంచి కనబడడం లేదు. కుటుంబసభ్యులు, బంధువులు సమీపంలోని ఇళ్లలో వెతికారు. వారి ఇంటికి సమీప ప్రాంతంలో రవి అనే స్వామీజీ పది సంవత్సరాలుగా మఠాన్ని నడుపుతున్నాడు. చిన్నారి కోసం వెతుకులాటలో భాగంగా బుధవారం మఠం సమీపంలో చూశారు. మఠానికి చెందిన నీటి తొట్టె మూసి ఉంది. దాన్ని తెరిచి చూడగా హరికేష్ మృతదేహం లభ్యమైంది. తొట్టెలో ఓ తాబేలు, కొన్ని రూపాయి నాణెలు కూడా ఉన్నాయి. మృతదేహాన్ని బయటకు తీశారు. సోమవారం పౌర్ణమి, చంద్రగ్రహణం కావడంతో స్వామిజీ రవి ప్రత్యేక యాగ పూజలు జరిపారు. ఆ సమయంలో స్వామిజీ నరబలి ఇచ్చి చిన్నారిని హత్యచేసి నీటి తొట్టెలో వేసి ఉండవచ్చునని అనుమానించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు మఠంలోనికి ప్రవేశించి వస్తువులను బయటకు వేసి పూర్తిగా ధ్వంసం చేశారు. స్వామిజీని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. స్వామిజీ రవి అక్కడ నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయండి

- ప్రకాశం జిల్లాలో రక్షణ రంగ సంస్థలు ఏర్పాటు చేయండి
- ప్రధానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్



న్యూఢిల్లీ: ప్రకాశం జిల్లాను డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్రమోదీని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. రక్షణ రంగానికి చెందిన వివిధ సంస్థల ఏర్పాటుకు జిల్లాలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ భూమి పుష్కలంగా ఉందని, దొనకొండలో వినియోగంలో లేని విమానాశ్రయముందని వివరించారు. అలాగే రామాయపట్నం ఓడరేవును కూడా అభివృద్ధి చేసే అవకాశమున్నందున జిల్లాలో సీఎస్‌డీ డిపో, రెజిమెంట్ సెంటర్, రక్షణ రంగానికి సంబంధించిన విద్యాసంస్థలతోపాటు దొనకొండలో ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రం, ఎన్‌సీసీ ఫ్లయింగ్ వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో 11 వేల మంది మాజీ సైనికోద్యోగులు ఉన్నారని, వీరి సేవలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్ర సబ్ ఏరియాను సికింద్రాబాద్ నుంచి తరలించాల్సి ఉందన్నారు. దీని ఏర్పాటుకు ప్రకాశం జిల్లా అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బాధిత గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన తర్వాత ఇచ్చిన హామీ మేరకు వెంటనే కిడ్నీ, ఫ్లోరోసిస్ నియంత్రణ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లాలోని అనేక చోట్ల నీటి సమస్య తీవ్రంగా ఉందని, భూగర్భ జలాల్లో ఫ్లోరిన్, ఆర్సెనిక్ ఎక్కువ పరిమాణంలో ఉన్నాయని వివరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.699 కోట్లతో ప్రతిపాదనలు అందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల ప్రకాశం జిల్లాలో నీటి సమస్యను పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. దీనిని ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పరిధిలోకి తీసుకువచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. విశాఖకు రైల్వే జోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రజకులను ఎస్సీల్లో చేర్చాలని చేస్తున్న కృషి భేష్

సాక్షి, న్యూఢిల్లీ: రజకులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చేస్తున్న కృషికి రజక సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. 18 రాష్ట్రాల్లో ఏవిధంగా అయితే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చారో.. అదే విధంగా అంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను వైవీ సుబ్బారెడ్డి ఇటీవల ప్రత్యేకంగా కలసి విన్నవించారు. రజకుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను రాజ్‌నాథ్ సింగ్‌కు సుబ్బారెడ్డి వివరించారు. ఇలా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని సుబ్బారెడ్డి చేస్తున్న కృషికి రెండు రాష్ట్రాల్లోని రజక సంఘాల నేతలు అభినందనలు తెలుపుతున్నారు. బుధవారం రజక సంఘం ప్రతినిధులు మల్లేశ్‌కుమార్, ఎ.శ్రీనివాస్, మాచర్ల ఉప్పలయ్య, కొలిపాక రాములు తదితరులు వైవీ సుబ్బారెడ్డిని ఢిల్లీలో కలుసుకొని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రజకుల సమస్యలను పార్లమెంటులో కూడా లేవనెత్తుతానని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.

తప్పులు సరిదిద్ది ఆదర్శంగా నిలుద్దాం..



న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చినప్పట్నుంచీ మనల్ని పాలించిన ప్రభుత్వాలు చేసిన తప్పులను సరిదిద్ది భారత దేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరారు. బుధవారం 'క్విట్ ఇండియా డే' సందర్భంగా లోక్‌సభలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తిని మేకపాటి కొనియాడారు. ప్రధాని మోదీ నినాదమైన 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు.

వడ్డీలేని రుణాలతోనే చేనేతల అభివృద్ధి

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణం): చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించి, వారి కోసం క్లస్టర్లు ఏర్పాటు చేసి ప్రత్యేక బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తే చేనేత కార్మికుల అభివృద్ధి సాధ్యమవుతుందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య అభిప్రాయపడ్డారు. విశాఖలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత వస్త్రాలపై విధించిన 5 శాతం జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేతలకు రూ.200 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత (50 ఏళ్లు దాటిన) వృద్ధులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వమే నేత బజార్లు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఎన్నో వాగ్దానాలిచ్చారని, వాటిలో బీసీలకిచ్చిన ఏ వాగ్దానమూ అమలు కాలేదని విమర్శించారు. రూ.30 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పశు సంవర్థక శాఖలో 27 మందికి పదోన్నతులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పశు సంవర్థక శాఖలో 27 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డెప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వీరు ఎక్కడ పని చేస్తున్నారో అక్కడే ఇన్‌చార్జి డెప్యూటీ డైరెక్టర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తారని, జీత భత్యాలలో కూడా ఎటువంటి తేడాలు ఉండవని పేర్కొంది.

పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం

ఫేస్‌బక్‌లో ప్రేమ వ్యవహారమే కారణం!

పెనమలూరు: కృష్ణాజిల్లా, పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ యువతి (23) బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన యువకుడితో ప్రేమ వ్యవహారం వికటించడంతో ఈ ఘటన జరిగిందని సమాచారం. పోలీసులు ఈ కేసు వివరాలు చెప్పడానికి నిరాకరించారు. సేకరించిన వివరాల ప్రకారం.. విశాఖ పట్నానికి చెందిన యువతి బీటెక్ చదివింది. విజయవాడ కృష్ణలంక నెహ్రూనగర్‌కు చెందిన పోస్టల్ ఉద్యోగి కుమారుడు (25) సీఏ చదువుతున్నాడు. వారిద్దరికీ ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఇద్దరు పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. యువతి, తన తల్లిదండ్రులతో మూడునెలల క్రితం కానూరులో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఆ తరువాత సింగ్‌నగర్‌కు మకాం మార్చారు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ మనస్పర్ధలు వచ్చాయి. యువకుడు తనను మోసం చేశాడని యువతి బుధవారం ఉదయం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, పోలీసులు స్పందించలేదని సమాచారం. యువతి బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు స్కూటర్‌పై వచ్చి బాత్రూమ్‌లు శుభ్రంచేసే యాసిడ్ తాగి వాంతులు చేసుకుని పడిపోయింది. దీంతో పోలీసులు ఆమెను హుటాహుటిగా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై పోలీసులు మాట్లాడటంలేదు.

పాలేరుకు ఉరి వేశారు!

- కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో దారుణం
- తమ బిడ్డ మరణానికి యజమానే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



ఫిర్యాదు స్వీకరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) గోపి మృతదేహం

కంకిపాడు(పెనమలూరు): కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో పాలేరు అనుమానాస్పద మృతి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అతడిని యజమాని కొట్టి చంపేశాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పరారీలో ఉన్న యజమానిని తమకు చూపిన తరువాతే మృతదేహాన్ని తరలించాలంటూ పట్టుబట్టారు. పోలీసుల కథనం ప్రకారం... గొడవర్రుకు చెందిన పేరుమోగిన రామకృష్ణ, నాగలక్ష్మి దంపతులు కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వారి కుమారులు వీరాంజనేయులు, గోపి(18). గోపి రెండేళ్లుగా గ్రామానికి చెందిన రైతు బొబ్బా బోసు వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో కూలి పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన నాగలక్ష్మి కొడుకు గోపి భోజనానికి రాలేదని తెలుసుకుని ఫోన్ చేసినా తీయకపోవడంతో యజమాని బోసు ఇంటికి వెళ్లారు. ఇంటికి తలుపులు వేసి ఉండటంతో ప్రహరీ పై నుంచి చూడగా చావిడిలో గోపి ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే లోపలికి వచ్చి గోపి మెడకు బిగుసుకున్న తాడును తొలగించింది. బిడ్డ ముఖం, మెడపై గాయాలను గుర్తించింది. '108' సిబ్బంది వచ్చి గోపి మరణించాడని చెప్పారు. ఉదయం నుంచే పాలేరు గోపిపై యజమాని బోసు కేకలు వేస్తూ బూతులు తిట్టడం విన్నామని, మధ్యాహ్నం 3 గంటలకు బోసు పాలేరును కరెంటు వైర్లను పట్టుకోవాలంటూ కర్రతో కొట్టడం చూశామని ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు వివరించారు. బోసుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు.

నమ్మకంగా పనిచేస్తే ప్రాణం తీశాడు

రెండేళ్లుగా నమ్మకంగా పని చేస్తున్న తన బిడ్డ ప్రాణాన్ని యజమాని బోసే బలిగొన్నాడని గోపి తల్లి నాగలక్ష్మి ఆరోపించారు. ఇష్టానుసారంగా కొట్టడం వల్లే చనిపోయాడని విలపించారు. చనిపోయిన బిడ్డను తాడుతో ఉరివేసి పారిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపి మరణించడంతో యజమాని బొబ్బా బోసు పరారయ్యాడు. కాగా, గోపి చావుకు కారణమైన యజమాని బోసును తమకు చూపించాలని, అప్పటిదాకా మృతదేహాన్ని తరలించడానికి వీల్లేదని డిమాండ్ చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పారు.

మెరుగుపడ్డ కరుణానిధి ఆరోగ్యం

ట్రాకోస్టోమీ తొలగింపు



సాక్షి, చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కరుణానిధి ఆరోగ్యం మరింతగా మెరుగుపడుతోంది. శ్వాసనాళం, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా ఆయనకు అమర్చి ఉన్న ట్రాకోస్టోమీ పరికరాన్ని తొలగించినట్లు సమాచారం. వయోభారం, శ్వాస సంబంధిత సమస్యతో గతేడాది డిసెంబర్‌లో కరుణానిధి అనారోగ్యం బారినపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొద్ది రోజులు ఆస్పత్రిలో, తర్వాత గోపాలపురంలోని తన నివాసంలో ఉండి ఆయన చికిత్స తీసుకుంటున్నారు. కరుణ ఇంటికే పరిమితం కావడంతో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆయన కుమారుడు స్టాలిన్ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అదే సమయంలో తరచూ స్టాలిన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా కరుణానిధి ఆరోగ్యం గురించి తెలియజేస్తూ, ఫొటోలను సైతం పెడుతూ వచ్చారు. అయితే గత నెల రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల దృష్ట్యా, ప్రతిపక్షాల అభ్యర్థులను మాత్రం కరుణను పరామర్శించేందుకు అనుమతించారు. తర్వాత మరెవరినీ అనుమతించలేదు. ఈ పరిస్థితుల్లో బుధవారం ద్రవిడ కళగం నేత వీరమణి కరుణానిధిని పరామర్శించారు. కరుణ ఆరోగ్యం మెరుగు పడుతుండటం వల్లే వీరమణికి అనుమతి కల్పించారని సమాచారం. ప్రస్తుతం కరుణానిధి స్వయంగా శ్వాస పీల్చుకుంటున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సాక్షి స్పోర్ట్స్

గురువారం 10-8-2017



మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ ఈవెంట్‌లో కైనన్ జంటకు కాంస్యం

ఆసియా షాట్‌గన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్ రెండో పతకాన్ని సాధించాడు. కజకిస్తాన్‌లో అస్తానాలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ ఈవెంట్‌లో తన భాగస్వామి శ్రేయసి సింగ్‌తో కలిసి కైనన్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. కాంస్య పతక పోటీలో కైనన్-శ్రేయసి జంట 40-38తో లెబనాన్ జోడీపై గెలిచింది. మంగళవారం ట్రాప్ వ్యక్తిగత విభాగంలో కైనన్‌కు కాంస్యం లభించిన సంగతి తెలిసిందే.

ఒలింపిక్స్‌కు దూరమే!

ఆసక్తి చూపించని బీసీసీఐ
సీఓఏతో సమావేశంలో చర్చ
ఇక నుంచి సెలక్టర్లకూ నగదు ప్రోత్సాహకాలు



బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, సీఈఓ రాహుల్ జోహ్రి

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాలు దాదాపుగా లేనట్లే! భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పెద్దలకు ఇది ఇష్టం లేకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. బుధవారం జరిగిన బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీఓఏ) సమావేశంలో దీనిపై విస్తృతంగా చర్చ జరిగినా సభ్యులు ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయారు. త్వరలో జరిగే బోర్డు సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని మాత్రం ఈ భేటీలో తీర్మానించారు. అయితే బోర్డు వర్గాల సమాచారం ప్రకారం... ఒలింపిక్స్‌లో పాల్గొనకూడదనే తమ ఆలోచనలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని తెలుస్తోంది. 'ఒలింపిక్స్‌లో పాల్గొనాలంటే ఒలింపిక్ చార్టర్‌ను ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రభుత్వ పరిధిలోని ఒక జాతీయ క్రీడా సమాఖ్యగా బీసీసీఐ మారిపోవాలి. పైగా నిబంధనల ప్రకారం 'వాడా' పరిధిలోకి కూడా రావాలి. దీనికి మన క్రికెటర్లు కూడా వ్యతిరేకం. ఇలాంటి సమస్యల మధ్య మేం ఒలింపిక్స్‌లో భాగం కావాలని అనుకోవడం లేదు' అని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. చాలా కాలంగా ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్పించేందుకు ఐసీసీ ప్రయత్నం చేస్తున్నా కేవలం బీసీసీఐ అనాసక్తి కారణంగా ఈ అంశం లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.



వినోద్‌రాయ్, డయానా ఎడుల్జీ

రూ. 15 లక్షల చొప్పున...

బీసీసీఐ-సీఓఏ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్‌కప్‌లలో ఫైనల్‌కు చేరుకున్న పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీలకు కూడా నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. కమిటీలలోని ఒక్కో సభ్యుడికి రూ. 15 లక్షల చొప్పున నజరానా అందజేస్తారు. దేశవాళీ ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులు పెంచే అంశంపై బోర్డు కోశాధికారి విధి విధానాలు రూపొందిస్తున్నారని సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ వెల్లడించారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌ల కోసం కనీసం 15 రోజుల విరామం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. భారత 'ఎ', అండర్-19 జట్లకు ప్రత్యేకంగా మేనేజర్‌ను ఎంపిక చేయాల్సిన అవసరం లేదని భావించిన బీసీసీఐ... పేసర్ శ్రీశాంత్‌కు సంబంధించి కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అంశంలో న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని నిర్ణయించింది. మరోవైపు వ్యాఖ్యాతలుగా భారీ ఆదాయం పొందుతున్న సునీల్ గావస్కర్, సంజయ్ మంజ్రేకర్, మురళీ కార్తీక్, హర్షా భోగ్లే తాము లోధా కమిటీ సిఫారసుల ప్రకారం 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రస్ట్' పరిధిలోకి రావడం లేదని స్వయంగా హామీ పత్రం అందజేయాలని కూడా ఈ సమావేశంలో తీర్మానించారు.

అజహర్ అంశం జనరల్ బాడీకే...

బీసీసీఐ నుంచి తనకు రావాల్సిన బకాయిలు, ఆర్థిక పరమైన ప్రయోజనాలు అందజేయాలంటూ మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ రాసిన లేఖపై బుధవారం బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అయితే దీనిపై కూడా బీసీసీఐ-సీఓఏ ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయింది. 'అజహర్ అంశాన్ని మేం తీవ్రంగా చర్చించాం. మా న్యాయ నిపుణులు కూడా తమ సూచనలు ఇచ్చారు. అయితే దీనిపై తుది నిర్ణయం సర్వసభ్య సమావేశంలోనే తీసుకోవాలని తీర్మానించాం' అని బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా చెప్పారు.



బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయవచ్చా?

రాష్ట్ర క్రికెట్ సంఘాల అభిప్రాయం కోరిన లా కమిషన్

న్యూఢిల్లీ: భారత్‌లో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాలకు చట్టబద్ధత కల్పించే అవకాశంపై జాతీయ లా కమిషన్ దృష్టి పెట్టింది. వివిధ రాష్ట్ర క్రికెట్ సంఘాలు అభిప్రాయాలు తమకు తెలియజేయాలంటూ బీసీసీఐకి లేఖ రాసింది. దేశంలో బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయాలంటూ లోధా కమిటీ గత ఏడాది సిఫారసు చేసింది. దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు ఈ అంశంపై విస్తృతంగా చర్చించమంటూ లా కమిషన్‌ను ఆదేశించింది. 'బెట్టింగ్ అంశంలో వివిధ వర్గాల నుంచి సమాచారం, అభిప్రాయాలు సేకరిస్తున్నాం. ఈ అంశంలో రాష్ట్ర క్రికెట్ సంఘాల సూచనలు, సలహాలు ఉపయోగపడవచ్చని మేం భావిస్తున్నాం. మీ సంఘాల అభిప్రాయం తెలుసుకొని మాకు అందజేయండి' అని లా కమిషన్ సభ్య కార్యదర్శి సంజయ్ సింగ్ బీసీసీఐని కోరారు. అయితే ఇది చాలా క్లిష్టమైన అంశమని బోర్డు అధికారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చట్టబద్ధం చేస్తే బెట్టింగ్ హౌస్‌లను ప్రభుత్వం నడిపిస్తుందా? లేక ఏదైనా కంపెనీకి అప్పచెబుతారా? గ్యాంబ్లింగ్ కోసం ప్రత్యేక వ్యవస్థ అంటూ ఉంటుందా? మన దేశంలో లిక్కర్ బాధితులను దారిలోకి తెచ్చే కేంద్రాలే లేవు. ఇప్పుడు గ్యాంబ్లింగ్ వల్ల దారి తప్పిన వారి కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు.

జడేజా స్థానంలో అక్షర్

శ్రీలంకతో మూడో టెస్టుకు ఎంపిక



కొలంబో: శ్రీలంకతో జరిగే మూడో టెస్టు కోసం భారత జట్టులోకి లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ ఎంపికయ్యాడు. ఐసీసీ నిషేధం కారణంగా ఈ మ్యాచ్‌కు రవీంద్ర జడేజా దూరం కావడంతో అతని స్థానంలో అక్షర్‌కు చోటు లభించింది. సీనియర్ సెలక్షన్ కమిటీ అతడిని ఎంపిక చేసినట్లు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. శనివారం నుంచి పల్లెకెలెలో ఈ మ్యాచ్ జరుగుతుంది. దక్షిణాఫ్రికాలో మంగళవారం ముక్కోణపు సిరీస్ గెలిచిన భారత 'ఎ' జట్టులో సభ్యుడిగా ఉన్న అక్షర్, ఇప్పుడు నేరుగా శ్రీలంక వెళతాడు. భారత్ తరఫున 30 వన్డేలు, 7 టి20లు ఆడిన అక్షర్ ఇంకా టెస్టుల్లో అరంగేట్రం చేయలేదు.

క్వార్టర్స్‌లో జ్యోతి సురేఖ జంట ఓటమి



బెర్లిన్: ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్-4 టోర్నమెంట్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో తెలుగు అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ-అభిషేక్ వర్మ (భారత్) జంట 149-156 పాయింట్లతో లిండా అండర్సన్-జూలియో ఫిరో (మెక్సికో) ద్వయం చేతిలో ఓడిపోయింది. అంతకుముందు జరిగిన తొలి రౌండ్‌లో సురేఖ-అభిషేక్ జోడీ 154-149తో లూసీ మేసన్-కార్ల్ రిచర్డ్స్ (బ్రిటన్) జంటపై విజయం సాధించింది. మహిళల టీమ్ కాంపౌండ్ క్వాలిఫయింగ్‌లో జ్యోతి సురేఖ, త్రిషా దేబ్, స్నేహల్‌లతో కూడిన భారత జట్టు 2,069 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో భారత్ తలపడుతుంది. క్వాలిఫయింగ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ఐదో ర్యాంక్‌లో నిలిచి నేరుగా మూడో రౌండ్‌కు అర్హత పొందింది.

ఆనంద్ గేమ్ 'డ్రా'

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్విఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఐదో 'డ్రా' నమోదు చేశాడు. కర్జాకిన్ (రష్యా) తో జరిగిన గేమ్‌ను ఆనంద్ 30 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఆరో రౌండ్ తర్వాత ఆనంద్ 3.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

పదేళ్ల తర్వాత... మళ్లీ పసిడి

జావెలిన్ త్రోలో స్వర్ణం నెగ్గిన బార్బరా స్పొటకోవా ● ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

గెలవాలనే బలీయమైన కాంక్ష ఉంటే వయసు ఒక అంకె మాత్రమేనని చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి బార్బరా స్పొటకోవా నిరూపించింది. ఒకవైపు యువ క్రీడాకారిణులు తెరపైకి దూసుకొస్తున్నా... అవేమీ పట్టించుకోకుండా 36 ఏళ్ల స్పొటకోవా తన ప్రదర్శనతో తన ప్రత్యేకతను చాటుకుంది. పదేళ్ల విరామం తర్వాత మరోసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకొని ఔరా అనిపించింది.



బార్బరా స్పొటకోవా

లండన్: అనుభవం ఉంటే అంతర్జాతీయ వేదికపై ఎప్పుడైనా అద్భుత ఫలితాలు సాధించవచ్చని చెక్ రిపబ్లిక్ జావెలిన్ త్రోయర్ బార్బరా స్పొటకోవా రుజువు చేసింది. సరిగ్గా పదేళ్ల విరామం తర్వాత ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మహిళల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో 36 ఏళ్ల స్పొటకోవా ఈటెను 66.76 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని సంపాదించింది. 2007 ఒసాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం గెలిచిన స్పొటకోవా పదేళ్ల తర్వాత మళ్లీ విశ్వవిజేతగా నిలువడం విశేషం. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణాలు గెలిచిన ఆమె, 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించింది. 'లండన్ ఒలింపిక్ స్టేడియం నాకెంతో కలిసొస్తుంది. ఐదేళ్ల క్రితం ఇదే వేదికపై స్వర్ణం నెగ్గాను. మళ్లీ ఇదే వేదికపై అలాంటి ఫలితాన్ని పునరావృతం చేశాను' అని స్పొటకోవా వ్యాఖ్యానించింది. లింగ్‌వి లీ (చైనా-66.25 మీటర్లు) రజతం, హుయ్‌హుయ్ లియు (చైనా-65.26 మీటర్లు) కాంస్యం గెలిచారు.

నికెర్క్ నిలబెట్టుకున్నాడు...

మరోవైపు పురుషుల 400 మీటర్ల విభాగంలో ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ వేడ్ వాన్ నికెర్క్ తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. 43.98 సెకన్లలో అతను గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. స్టీవెన్ గార్డ్‌నర్ (బహమాస్-44.41 సెకన్లు) రజతం గెల్చుకోగా... అబ్దుల్లా హరూన్ (ఖతర్-44.48 సెకన్లు) కాంస్యం సొంతం చేసుకున్నాడు. పురుషుల పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో సామ్ కెండ్రిక్స్ (అమెరికా) విజేతగా నిలిచాడు. అతను 5.95 మీటర్ల ఎత్తుకు ఎగిరి పసిడి పతకాన్ని నెగ్గాడు. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో కిప్‌రుటో (కెన్యా-8ని:14.12 సెకన్లు), పురుషుల 800 మీటర్ల ఈవెంట్‌లో పియరీ అంబ్రోసి బాసి (ఫ్రాన్స్-1ని:44.67 సెకన్లు) స్వర్ణ పతకాలను సాధించారు.

మరోవైపు పురుషుల జావెలిన్ త్రోలో గురువారం క్వాలిఫయింగ్ పోటీలు జరగనున్నాయి. భారత ఆశాకిరణం నీరజ్ చోప్రా బరిలోకి దిగనున్నాడు. 32 మంది పోటీపడుతున్న క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో టాప్-12లో నిలిచిన వారు ఫైనల్‌కు చేరతారు.

అజహర్ మొబైల్ గేమ్ ఆవిష్కరణ



ముంబై: భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ పేరుతో 3-డి మొబైల్ గేమ్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన 'బిగ్‌కోడ్ గేమ్స్' సంస్థ ఈ గేమ్‌ను రూపొందించింది. బుధవారం జరిగిన 3-డి గేమ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈ మాజీ సారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుంబ్లే నిష్క్రమణ, రవిశాస్త్రి వ్యాఖ్యలు, తనపై, శ్రీశాంత్‌పై నిషేధం తదితర అంశాలపై మాట్లాడారు. 'కోచ్‌గా అనిల్ కుంబ్లే అవమానకరంగా నిష్క్రమించడం నన్ను బాధించింది. అనిల్ నాకు బాగా తెలుసు. ఒకరు వేలెత్తి చూపే వ్యక్తిత్వం కాదతనిది. జట్టుకు మేలు చేయాలని తపించేవాడు తప్ప చేటు చేసే వ్యక్తి కాదు. తన ఆత్మ గౌరవం కోసమే స్వయంగా తప్పుకున్నాడు. ఇది మంచి నిర్ణయమే' అని అన్నాడు. భారత క్రికెట్‌లో కోహ్లి జట్టే అత్యుత్తమమన్న రీతిలో ప్రస్తుత కోచ్ రవిశాస్త్రి మాట్లాడిన తీరును అజహర్ తప్పుబట్టారు. 'అప్పటి జట్టు వేరు. ఈ జట్టు వేరు. ఇవి సమకాలీన జట్లు కానే కావు. రెండు భిన్న తరాలకు చెందిన జట్లను పోల్చడం సహేతుకం కాదు. అప్పటి బౌలర్లు, ప్రత్యర్థులు, పరిస్థితులు అన్నీ వేరు. అలాంటి జట్లను పోల్చడమేంటి? నిజానికి శాస్త్రి కూడా అప్పటి జట్టులో సభ్యుడే. అంటే తనను కూడా తక్కువ చేసుకున్నట్లే కదా' అని అన్నారు.

తనకు బోర్డు నుంచి రావాల్సిన పెన్షన్, ఏకమొత్తం చెల్లింపు సమస్య త్వరలోనే సమసిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బోర్డుతో తనకెలాంటి శత్రుత్వం లేదని న్యాయం కోసమే కోర్టుమెట్లు ఎక్కానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంలో కేబినెట్ హోదా గల పదవిలో ఉన్న జి.వివేక్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా కొనసాగడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకే వస్తుందని చెప్పారు. ఇక్కడ జీతం తీసుకుంటున్నారా లేదా అన్నది అనవసరమన్నారు.

బెంగళూరు బుల్స్‌కు మూడో విజయం

నాగ్‌పూర్: ప్రో కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బెంగాల్ వారియర్స్‌ను దెబ్బతీసింది. బుధవారం జరిగిన జోన్ 'బి' మ్యాచ్‌లో బెంగళూరు 31-25తో వారియర్స్‌పై గెలిచింది. బెంగళూరు తరఫున రైడర్ అజయ్ కుమార్ అద్భుతంగా ఆడాడు. 19 సార్లు రైడింగ్‌కు వెళ్లిన అజయ్ 8 పాయింట్లు తెచ్చాడు. డిఫెండర్ ఆశిష్ కుమార్ (5) టాకిల్‌లో అదరగొట్టాడు. టాకిల్ చేసిన ఐదు సార్లు పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో రోహిత్ కుమార్ 6, రవీందర్ పాహల్, మహేందర్ సింగ్ చెరో 2 పాయింట్లు చేశారు. బెంగాల్ వారియర్స్ జట్టులో జాంగ్ కున్ లీ 15 సార్లు రైడింగ్‌కు వెళ్లి 8 పాయింట్లు సాధించగా... టాకిల్‌లో సుర్జీత్ సింగ్ (4) ఆకట్టుకున్నాడు. ఇరు జట్లు ఒక్కోసారి ఆలౌటయ్యాయి. లీగ్‌లో బుల్స్‌కు ఇది మూడో విజయం కాగా బెంగాల్‌కు తొలి పరాజయం.

నేడు జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో జైపూర్ పింక్ పాంథర్స్, బెంగళూరు బుల్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి. ఈ మ్యాచ్‌లను 'స్టార్ స్పోర్ట్స్-2' చానెల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సింధు, సైనాలకు 'బై'

శ్రీకాంత్ సత్తాకు పరీక్ష ● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 'డ్రా' విడుదల ● ఈనెల 21 నుంచి స్కాట్లాండ్‌లో టోర్నీ



సింధు

చివరి నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో భారత్‌కు నాలుగు పతకాలు వచ్చాయి. 2011లో మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప ద్వయం... 2013, 2014లలో మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు కాంస్య పతకాలు సాధించగా... 2015లో మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ రజత పతకం సొంతం చేసుకుంది. ఒలింపిక్స్ క్రీడలు జరిగిన ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌ను నిర్వహించరు.

న్యూఢిల్లీ: అంతా అనుకున్నట్లు జరిగితే... వరుసగా ఐదోసారి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకం వచ్చే అవకాశముంది. ఈనెల 21 నుంచి 27 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. బుధవారం ఈ టోర్నీకి సంబంధించిన 'డ్రా' వివరాలను విడుదల చేశారు. తొలిసారి భారత్ తరఫున సింగిల్స్ విభాగాల్లో ఏకంగా ఎనిమిది మంది బరిలోకి దిగనున్నారు. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, అజయ్ జయరామ్, సమీర్ వర్మ... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్, రితూపర్ణ దాస్, తన్వీ లాడ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

మహిళల సింగిల్స్‌లో నాలుగో సీడ్ సింధు, 12వ సీడ్ సైనా నెహ్వాల్‌లకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. రెండో రౌండ్‌లో సబ్రీనా జాక్వెట్ (స్విట్జర్లాండ్) లేదా నటాల్యా వోట్‌సెక్ (ఉక్రెయిన్)లతో సైనా...కిమ్ హా మిన్ (కొరియా) లేదా హదియా హోస్నీ (ఈజిప్ట్)లతో సింధు ఆడే చాన్స్ ఉంది. అంతా సజావుగా సాగితే క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ సున్ యు (చైనా)తో సింధు; ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ సుంగ్ జీ హున్ (కొరియా)తో సైనా ఆడొచ్చు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో చోల్ బిర్చ్ (ఇంగ్లండ్)తో తన్వీ లాడ్; ఐరి మికెలా (ఫిన్‌లాండ్)తో రితూపర్ణ దాస్ తలపడతారు. సైనా, సింధు వేర్వేరు పార్శ్వాల్లో ఉన్నందున కేవలం ఫైనల్లోనే ఎదురయ్యే అవకాశముంది.



శ్రీకాంత్

పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్‌గా పోటీపడనున్న శ్రీకాంత్ తొలి రౌండ్‌లో సెర్గీ సిరాంట్ (రష్యా)తో ఆడతాడు. ఆ తర్వాత రెండో రౌండ్‌లో లిన్ యు సియెన్ (చైనీస్ తైపీ) లేదా లుకాస్ కోర్వీ (ఫ్రాన్స్)లతో... ప్రిక్వార్టర్ ఫైనల్లో టామీ సుగియార్తో (ఇండోనేసియా) లేదా హు యున్ (హాంకాంగ్)లతో శ్రీకాంత్ ఆడే చాన్స్ ఉంది. ఇక క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్‌కు టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సన్ వాన్ హో (దక్షిణ కొరియా) ఎదురయ్యే అవకాశముంది. తొలి రౌండ్ తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ శ్రీకాంత్‌కు నైపుణ్యమున్న ఆటగాళ్లే ఎదురుకానున్నారు. అయితే వరుసగా ఇండోనేసియా ఓపెన్, సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్స్ గెలిచి జోరు మీదున్న శ్రీకాంత్ తన స్థాయికి తగ్గట్టు ఆడితే సెమీఫైనల్‌కు చేరుకోవడం కష్టమేమీ కాదు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరుకుంటే కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు పతకం వచ్చి 34 ఏళ్లు గడిచాయి. ఈ విభాగంలో భారత్‌కు లభించిన ఏకైక కాంస్య పతకాన్ని ప్రకాశ్ పదుకొనే (1983లో) అందించారు.

పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో వీ నాన్ (హాంకాంగ్)తో 15వ సీడ్ సాయిప్రణీత్; లుకా వ్రాబెర్ (ఆస్ట్రియా)తో 13వ సీడ్ అజయ్ జయరామ్; పాబ్లో అబియాన్ (స్పెయిన్)తో సమీర్ వర్మ తలపడతారు.


భారత్ తరఫున పురుషుల డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-మనూ అత్రి; సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి; ఎం.ఆర్.అర్జున్-శ్లోక్ రామచంద్రన్ జోడీలు... మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప; సంజన సంతోష్-ఆరతి సారా; జక్కంపూడి మేఘన-పూర్వీషా రామ్ జంటలు; మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా; సాత్విక్ సాయిరాజ్-మనీషా; సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప జోడీలు బరిలో ఉన్నాయి.



సైనా

ప్రపంచ చాంపియన్‌షిప్‌కు గ్లాస్గో నగరం 1997 తర్వాత మళ్లీ ఆతిథ్యమిస్తోంది. ఆ పోటీల్లో భారత్ తరఫున పురుషుల సింగిల్స్‌లో ప్రస్తుత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, విక్రాంత్ పట్వర్ధన్... మహిళల సింగిల్స్‌లో మధుమిత బిస్త్ బరిలోకి దిగారు. అయితే గోపీచంద్ తొలి రౌండ్‌లో ఫెర్నాండో సిల్వా (పోర్చుగల్)కు వాకోవర్ ఇవ్వగా... విక్రాంత్ 8-15, 1-15తో అలెన్ బుడి కుసుమా (ఇండోనేసియా) చేతిలో... మధుమిత 5-11, 6-11తో జింగ్నా హాన్ (చైనా) చేతిలో ఓడారు.

ఉమ్మేస్తే పనిచేసే బ్యాటరీ..



ఫొటోలో కనిపిస్తున్నది అక్షరాలా ఓ బ్యాటరీ. కాగితమంత పలుచగా సర్క్యూట్లతో కూడిన దీన్ని పనిచేయించాలంటే.. థూ అని ఉమ్మేస్తే చాలు! కొన్ని మైక్రోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయి ఎల్ఈడీ లైటు వెలుగుతుంది. అతి సూక్ష్మమైన బ్యాక్టీరియాతో పనిచేసే ఫ్యూయల్‌సెల్స్ దీంట్లో ఉన్నాయని ఈ బ్యాటరీని తయారుచేసిన బింగ్‌హామ్‌టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త సియోఖెగున్ ఛోయి తెలిపారు. ఈ బ్యాటరీ ద్వారా ప్రతి చదరపు సెంటీమీటర్ ద్వారా కొన్ని మైక్రోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోందని వెల్లడించారు. ఎల్ఈడీ లైట్లు వెలిగించేందుకు ఈ మాత్రం విద్యుత్తు సరిపోతుందని అయినా మరింత ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఛోయి తెలిపారు. ఈ రకమైన బ్యాటరీల ద్వారా కొన్ని నిమిషాల పాటు ఎల్ఈడీ కాంతులు అందివ్వగలిగినా.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని పేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.

'సూపర్' బియ్యం



సూక్ష్మపోషకాల లోపాలను నివారించేందుకు స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సరికొత్త వరి వంగడాన్ని సృష్టించారు. గోల్డెన్ రైస్‌లో మాదిరిగా విటమిన్-ఏ తయారీకి పనికొచ్చే బీటా కెరోటిన్‌తోపాటు ఐరన్, జింక్ మోతాదులు ఈ కొత్త వరి వంగడంలో ఎక్కువగా ఉన్నాయి. మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్, ఐరన్ వంటి సూక్ష్మపోషకాలు తగినంత అందకపోవడం వల్ల చాలామంది ప్రజల ఆకలి తీరుతున్నప్పటికీ అనేక ఆరోగ్య సమస్యలు మాత్రం తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వేర్వేరు సూక్ష్మపోషకాలను ఒక్క వరి వంగడంలోకి చేర్చడంలో ఈటీహెచ్ శాస్త్రవేత్త నవ్‌రీత్ భుల్లర్ విజయం సాధించారు. ఈ కొత్త వంగడాన్ని ప్రస్తుతం పరిశోధనశాలలో మాత్రమే పండిస్తున్నారు. ఐరన్, జింక్‌ల మోతాదు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండగా, బీటా కెరొటిన్ మాత్రం గోల్డెన్ రైస్‌లో కంటే తక్కువ ఉందని మరిన్ని పరిశోధనల ద్వారా దీన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని భుల్లర్ తెలిపారు. త్వరలోనే ఈ వంగడాన్ని గ్రీన్‌హౌస్‌లలో పెంచి అందులోని పోషకాల మోతాదును పరిశీలిస్తామని చెప్పారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ సూపర్ బియ్యం ఇంకో ఐదేళ్లలో రైతులకు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అన్నారు.

● ఇటీవల మృతిచెందిన సీనియర్ న్యాయవాది వై.శివరామశాస్త్రికి ఉమ్మడి హైకోర్టు ఘనంగా నివాళుల ర్పించింది. శివరామశాస్త్రికి నివాళులు అర్పించేందుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగ నాథన్ నేతృత్వంలోని న్యాయమూర్తు లందరూ బుధవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

విశాఖ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

రూ. 2 లక్షలకు పైగా లెక్కల్లోలేని నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు

అల్లిపురం (విశాఖ దక్షిణం): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి కార్యకలాపాలపై అవినీతి నిరోధక శాఖ దృష్టిపెట్టింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం వన్‌టౌన్‌లోని సూపర్‌బజార్ సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ డీఎస్పీ రామకృష్ణప్రసాద్ తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది నుంచి సుమారు రూ.2 లక్షలకు పైగా లెక్కల్లోలేని నగదును స్వాధీనంచేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రామకృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రిజిస్ట్రేషన్ పూర్తయినా తన డాక్యుమెంట్లు ఇవ్వలేదని, అదనంగా మరో రూ.40 వేలు ఇస్తేగానీ ఇచ్చేదిలేదని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని ఓ బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీచేస్తున్న సమయంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు కూడా ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్లు ఎంవీ రత్నకుమార్, వి.బసవేశ్వరరావు వద్ద డాక్యుమెంట్ డెలివరీ ట్రేలలో ఉన్న రిజిస్ట్రేషన్ పూర్తయి, డెలివరీ చేయాల్సిన డాక్యుమెంట్లను, డాక్యుమెంట్ రైటర్ల వద్ద నుంచి డాక్యుమెంట్ ఎక్నాలెడ్జ్‌మెంటు స్లిప్‌లు, రూ.2 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. రాత్రి వరకూ తనిఖీలు కొనసాగాయి. ఈ కేసులో విచారణ కొనసాగుతోందని డీఎస్పీ చెప్పారు. స్వాధీనం చేసుకున్న డబ్బుకు సంబంధించి సమగ్ర విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు తెలియజేస్తామని డీఎస్పీ రామకృష్ణప్రసాద్ వివరించారు.

మా అభ్యంతరాలు పరిశీలించండి

- ఏపీపీఎస్సీకి గ్రూప్-1 అభ్యర్థుల మొర
- తమ వినతిని పట్టించుకోకుండా మెయిన్స్‌కు సిద్ధమవుతుండటంపై ఆందోళన
- న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమ్స్‌లోని ప్రశ్నలు, 'కీ'లోని జవాబులపై తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)ను గ్రూప్-1 అభ్యర్థులు వేడుకుంటున్నారు. తమ అభ్యంతరాలను పరిశీలించకుండానే మెయిన్స్ నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ సిద్ధమవుతుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలివీ..

- ఒక ప్రశ్నలో భారత ప్రజారోగ్య సంస్థకు బదులు ప్రజారోగ్య సమాఖ్య అని తప్పుగా ఇచ్చారు.
- 2001-2011లో భారత్‌లో గ్రామీణ జనాభా కన్నా నగర జనాభా వృద్ధి ఎక్కువగా ఉండటానికి కారణమేంటి? అనే ప్రశ్నకు.. ఏపీపీఎస్సీ ఇచ్చిన కీలో 4వ ఆప్షన్ సరైనదని ఉంది. కానీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వెబ్‌సైట్ ప్రకారం 1, 4 ఆప్షన్లు సరైనవే. ఏపీపీఎస్సీ 4వ ఆప్షన్‌ను మాత్రమే గుర్తించడం వల్ల అనేక మందికి నష్టం జరుగుతోంది.
- ఖోరాసాన్ నుంచి భారత్‌కు పండ్లు తీసుకురావడానికి ఢిల్లీ సుల్తానులు ఏ రవాణా వ్యవస్థను ఉపయోగించారు? అనే ప్రశ్నకు 1.పాదచారులు 2.గుర్రాలు 3.ఒంటెలు 4.తీర్థయాత్రికుల ద్వారా.. అన్న ఆప్షన్లు ఇచ్చారు. ఈ ప్రశ్నకు ఎన్‌సీఈఆర్‌టీ చరిత్ర పుస్తకంలో గుర్రాలు, వేగంగా పరుగెత్తే పాదచారులను ఉపయోగించేవారని ఉంది. కానీ ఏపీపీఎస్సీ కేవలం పాదచారులను మాత్రమే సరైన సమాధానంగా పేర్కొంది.
- మరో ప్రశ్నలో 'ఇన్ ఎకో సిస్టమ్ టెర్మినేటరీ, హూ ఆర్ ది మేజర్ ప్రొడ్యూసెస్ ఇన్ ఏ టెరిటోరియల్ ఎకో సిస్టమ్' అనే ప్రశ్నకు ఇచ్చిన కీలో 2, 3 ఆప్షన్లు సరైనవిగా ఏపీపీఎస్సీ పేర్కొంది. కానీ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో ఆ రెండూ సరైనవి కాదని ఉంది.

వీటిపై తాము అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వినతిపత్రాలిచ్చినా ఏపీపీఎస్సీ పరిగణనలోకి తీసుకోవడం లేదని గ్రూప్-1 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 2011 గ్రూప్-1 పరీక్షకు సంబంధించి కూడా ఏపీపీఎస్సీ ఇలాంటి పొరపాట్లే చేసిందని, అది చివరకు న్యాయవివాదాల్లో చిక్కుకొని ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఇప్పుడు కూడా ఏపీపీఎస్సీ అదే విధంగా వ్యవహరిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని వారు వాపోయారు.

గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు జారీ

ఈ నెల 17 నుంచి 28 వరకు పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వెబ్‌సైట్‌లో సిద్ధం చేసింది. అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. గ్రూప్-1 కేడర్‌కు సంబంధించిన 78 పోస్టుల భర్తీకి 2016 డిసెంబర్ 30న ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్ష పెన్ను-పేపర్ ఆధారితంగా డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 6 పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ జనరల్ ఇంగ్లిష్ 150 మార్కులకు ఉంటుంది. ఇది కేవలం క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. మిగిలిన 5 పేపర్లు ఒక్కొక్కటి 150 మార్కుల చొప్పున ఉంటాయి. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ 75 మార్కులకు ఉంటుంది.

నేడో రేపో గ్రూప్-2 రివైజ్డ్ కీ

గ్రూప్-2 మెయిన్స్ రివైజ్డ్ కీని ఒకట్రెండు రోజుల్లో ప్రకటించాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. ఇంతకు ముందు ప్రకటించిన ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన కమిషన్ రివైజ్డ్ కీని ప్రకటించాలని నిర్ణయించింది. గ్రూప్-2 పరీక్ష సందర్భంగా కొన్ని కేంద్రాల్లో తలెత్తిన ఆటంకాలు, ఈ సందర్భంగా ఏర్పడిన గందరగోళ పరిస్థితులకు సంబంధించిన సీసీటీవీ పుటేజీలను ఏపీపీఎస్సీ పరిశీలించింది. ఈ వ్యవహారాన్ని మాల్ ప్రాక్టీస్ కమిటీకి అప్పగించింది. ఈ కమిటీ సీసీటీవీ పుటేజీల ఆధారంగా గందరగోళానికి కారణమైన వారిని గుర్తించి నివేదిక ఇవ్వనుందని, దాని ఆధారంగా ఆయా అభ్యర్థులను మినహాయించి రివైజ్డ్ కీ, అర్హుల జాబితాను ప్రకటించాలని భావిస్తున్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి.


ఆ అధికారం ప్రభుత్వాలకుంది

తెలంగాణలో మహిళా విద్యా సంస్థల్లో పోస్టుల భర్తీపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మహిళాభ్యున్నతి, సాధికారిత లక్ష్యంగా బాలికలు, మహిళా విద్యా సంస్థల్లోని బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులన్నింటినీ మహిళలతోనే భర్తీ చేసే అధికారం రాజ్యాంగంలోని అధికరణ 15(3) కింద ప్రభుత్వాలకు ఉందని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. పోస్టులన్నింటినీ మహిళల చేతే భర్తీ చేయడం రాజ్యాంగంలోని అధికరణ 15(4), 16(4)కు విరుద్ధం కాదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు పలు తీర్పులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపింది. ముగ్గురు నలుగురి కోసం పోస్టుల భర్తీ ప్రక్రియ మొత్తాన్ని నిలిపేయడం సరికాదంది. తెలంగాణ సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకుల బాలికలు, మహిళ విద్యా సంస్థల్లో బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులన్నింటినీ మహిళలతో భర్తీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 1274పై స్టే విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది. పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగించవచ్చునని, అయితే ఈ జీవో కింద జరిగే నియామకాలన్నీ తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

మార్కెట్ అనుకూలించకే విశాఖ స్టీల్‌కు నష్టాలు

- రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు
- బొబ్బిలి, హిందూపూర్ పారిశ్రామిక క్లస్టర్లకు ఆమోదం



విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ఇప్పటికీ నష్టాల్లోనే ఉందని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి విష్ణుదేవ్ సాయి వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా బదులిచ్చారు. 2014-15తో పోలిస్తే విశాఖ స్టీల్ ఉక్కు అమ్మకాల్లో 39%, టర్నోవర్‌లో 5% వృద్ధి సాధించిందన్నారు. అయినప్పటికీ 2015-16లో పన్నులన్నీ పోగా రూ.1,421 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. మార్కెట్ పరిస్థితుల్లో నెలకొన్న మందకొడితనం, విదేశాల నుంచి చౌకగా ఉక్కు దిగుమతులు విశాఖ స్టీల్‌పై ప్రభావం చూపిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విస్తరణ పూర్తయిందని, ఏటా 3 మిలియన్ టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం నుంచి 2015 నాటికి 6.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి పెరిగిందన్నారు.

బొబ్బిలి, హిందూపూర్‌ల్లో 'క్లస్టర్ల' అభివృద్ధి

బొబ్బిలి, హిందూపూర్‌లలో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయ మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ప్రకటించారు. ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, మోడిఫైడ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్ పథకం కింద అనంతపురం జిల్లాలోని హిందూపూర్, విజయనగరం జిల్లాలోని బొబ్బిలిలో పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి పారిశ్రామిక విధాన రూపకల్పన, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) ఆమోదం తెలిపినట్టు మంత్రి తెలిపారు. అనంతపురం జిల్లా గొల్లపురంలో రూ. 54 కోట్ల వ్యయంతో హిందూపురం గ్రోత్ సెంటర్, పారిశ్రామిక పార్కు అభివృద్ధి ప్రతిపాదనలను గత ఏడాది మార్చిలో ఆమోదించినట్టు వివరించారు. దీనికోసం కేంద్రం ఇవ్వాల్సిన రూ. 14.93 కోట్లల్లో ఇప్పటికే రూ. 4.48 కోట్లు విడుదల చేశామన్నారు. బొబ్బిలిలో రూ. 30.61 కోట్ల ఖర్చుతో ప్రతిపాదించిన పారిశ్రామిక గ్రోత్ సెంటర్ అభివృద్ధికి రూ. 2.60 కోట్లు విడుదల చేశామన్నారు.

బాల కార్మికుల మరణాలు అవాస్తవం

ఏపీ, రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అక్రమ మైకా గనుల్లో ఎలాంటి బాలకార్మికుల మరణాలు నమోదు కాలేదని కేంద్ర కార్మిక, ఉపాధికల్పనశాఖ సహాయమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో వేసిన ఓ ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తరచూ గనులలో తనిఖీలు నిర్వహించి, 18 ఏళ్లలోపు వయసున్న వారిని గుర్తిస్తుందన్నారు.

బార్ కౌన్సిల్ వెబ్‌సైట్ ప్రారంభం



బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల సమాచారంతో రూపొందించిన ఉమ్మడి బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ బుధవారం ప్రారంభించారు. హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎస్.వి.భట్, ఉభయ రాష్ట్రాల అడ్వొకేట్స్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, జాతీయ బార్ కౌన్సిల్ సభ్యులు ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్ల క్రితం దాఖలైన సివిల్, క్రిమినల్ కేసులన్నింటినీ 2018 మార్చి 31 నాటికి పరిష్కరించాలని కింది కోర్టుల న్యాయాధికారులకు లక్ష్యాన్ని నిర్దేశిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను పునఃసమీక్షించాలంటూ ఎ.నర్సింహారెడ్డి ఏసీజేకి వినతిపత్రం సమర్పించారు. న్యాయవాదులఫండ్‌కు ఉభయ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన సొమ్మును వెంటనే వచ్చేందుకు చొరవ తీసుకోవాలని ఇరు రాష్ట్రాల అడ్వొకేట్స్ జనరల్‌ను కోరారు. బార్ కౌన్సిల్ సభ్యుడు ఎన్.హరినాథరెడ్డి వందన సమర్పణ చేశారు.

క్షేత్రస్థాయి సర్వేలకు ఐఏఎస్‌లు

- సీఎస్ దినేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సమీక్షలు
- నిధుల వినియోగంపై ఆరా.. ప్రజాభిప్రాయంపై అధ్యయనం
- గ్రామాల్లో వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదికలు



సీఎస్ దినేశ్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు తీరుతెన్నులపై ఇప్పటికే ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వేలు చేయించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల నాడి అందడం లేదట! అందుకే ఏకంగా ఐఏఎస్ అధికారుల తోపాటు జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలు ఏమనుకుంటున్నారు? క్షేత్రస్థాయిలో ఆయా పథకాలు, కార్యక్రమాల వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే విషయాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి స్వయంగా తెలుసుకుంటారు. సర్వేలో వెల్లడైన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తారు.

సమీక్షలు.. పల్లె నిద్రలు

గ్రామాల్లో పర్యటన సందర్భంగా పథకాలు, కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షలు కూడా నిర్వహిస్తారు. రాత్రిపూట గ్రామాల్లోనే నిద్ర చేయనున్నారు. ఏ స్థాయి అధికారి నెలలో ఎన్ని రోజులు గ్రామాల్లో పర్యటించాలి, ఎన్ని రాత్రులు నిద్ర చేయాలో లక్ష్యాలను నిర్ధారిస్తూ దినేశ్ కుమార్ జీవో జారీ చేశారు. సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అధికారుల గ్రామస్థాయి పర్యటనల వివరాలు...

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు నెలలో రెండు రోజులు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి. ఆ రెండు రోజుల్లో ఒక రోజు రాత్రి గ్రామాల్లోనే నిద్రించాలి.
- శాఖాధిపతులు నెలలో వారం రోజులు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి. ఆ వారంలో రెండు రోజులు రాత్రి గ్రామాల్లోనే నిద్ర చేయాలి.
- జిల్లా కలెక్టర్లు వారంలో మూడు రోజులు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలి. వారంలో ఒక రోజు రాత్రి గ్రామంలోనే నిద్ర చేయాలి.
- జిల్లాస్థాయి అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలి. వారంలో ఒకరోజు గ్రామంలోనే నిద్రించాలి.
- గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి.
- గ్రామాల్లో పర్యటనలకు వెళ్లిన అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, విధానాలను సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గ్రహించాలి.
- అధికారులు తమ శాఖలతో నిమిత్తం లేకుండా గ్రామాల్లో ఏ శాఖకు చెందిన పథకాలు, కార్యక్రమాలనైనా సమీక్షించవచ్చు.
- గ్రామాల్లో నిధుల వినియోగం సక్రమంగా జరుగుతోందా? లేదా? లక్ష్యాలను సాధిస్తున్నారా? లేదా? ప్రభుత్వ పథకాలు ప్రజలపై ప్రభావం చూపుతున్నాయా? లేదా? అనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి.
- అన్ని స్థాయిల అధికారుల క్షేత్రస్థాయి పర్యటనల నివేదికలను ప్రణాళిక శాఖ సమన్వయం చేయాలి. ప్రతినెలా తొలి వారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించాలి.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.



మనోల్లాస యోగం
పక్క పేజీలో...



నానీతో అనుపమ?
సినిమా పేజీలో...



కూరగాయల్లో కండ ఉండదా?
పప్పులో పస ఉండదా?
గింజల్లో గుజ్జు ఉండదా?
డ్రైఫ్రూట్స్‌లో దమ్ము ఉండదా?
చెట్టు ఆకుల్లో చేవ ఉండదా?
ఇక మాంసమే ఎందుకండీ?
వెజిటబుల్స్‌లో కావల్సినంత మీట్ ఉంటుంది.
కూరగాయల్లో కావల్సినంత ప్రొటీన్ ఉంటుంది.

వెజ్ మీట్

మన ఆహారంలోని పిండిపదార్థాలు శక్తిని సమకూరుస్తాయి. కొవ్వులు కొన్ని విటమిన్లను తమలో కరిగించుకొని శరీరానికి అవసరమైన జీవక్రియలు జరిగేలా చూస్తాయి. మరి మాంసకృత్తులో? ప్రొటీన్లు అని పిలిచే ఈ మాంసకృత్తులు ప్రధానంగా మాంసాహారంలో ఎక్కువగా ఉంటాయి. అలాగని కేవలం మాంసాహారంలోనే కాదు... కొన్ని రకాల శాకాహారాల్లోనూ అవి పుష్కలం. అనేక సామాజిక నమ్మకాల కారణంగా కొంతమంది మాంసాహారాన్ని ముట్టుకోరు. వారికి ఈ మాంసకృత్తులు ప్రొటీన్లు సమకూరడానికి కొన్ని శాకాహారాల్లో పుష్కలంగా ఉండే మాంసకృత్తులు ఉపయోగపడతాయి.

మాంసకృత్తులు ఎందుకంత అవసరం?

కండరాల మంచి సౌష్ఠవం కోసం ప్రొటీన్లు ఉపయోగపడతాయి. అలాగే కండరాలు దెబ్బతిన్నప్పుడు వాటిని రిపేర్ చేయడం కోసం కూడా అవి అవసరం. అందుకే గుండె ఆపరేషన్ జరిగాక కొవ్వులను తగ్గించాలనే డాక్టర్లు సైతం ఆ గాయం మానేవరకూ, అంటే ఆ రిపేర్ జరిగే వరకూ చికెన్‌లాంటివి తినమని సలహా ఇస్తుంటారు. మాంసాహారులకు ప్రొటీన్లు ఎలాగైనా అందుతాయి. మరి శాకాహారులకూ వారి జీవక్రియల కోసం మాంసకృత్తులు అవసరం కదా. వారు ఈ ప్రొటీన్లను ఎలా భర్తీ చేసుకుంటారు. అదృష్టవశాత్తు కేవలం మాంసాహారంల్లో మాత్రమే గాక... శాకాహారంలోని చాలా పదార్థాలలో మాంసకృత్తులు ఉంటాయని తెలిసింది కదా. వాటిని తీసుకుంటే శాకాహారులకూ మాంసకృత్తులు సమకూరుతాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుంటే సౌష్ఠవంతో కూడిన శరీరం, మంచి కండర నిర్మాణం, దెబ్బతిన్న కండరాల రిపేర్లను సులభంగా చేసుకోవచ్చు. ఆరోగ్యంగా జీవించవచ్చు.

డ్రైఫ్రూట్స్ నుంచి ప్రొటీన్లు

ఎండుగా కనిపించే కొన్ని డ్రైఫ్రూట్స్‌లో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని గుప్పెట్లో పట్టుకుని కూడా సులభంగా తినవచ్చు. పైగా డ్రైఫ్రూట్స్ నుంచి లభ్యమయ్యే మాంసకృత్తులతో వ్యాధి నిరోధక శక్తి కూడా సమకూరుతుంది. సాధారణంగా మాంసాహారంలోని ప్రొటీన్లతో పీచుపదార్థాలు లభ్యం కావు. కానీ ఈ డ్రైఫ్రూట్స్ ద్వారా అదనంగా పీచు కూడా దొరుకుతుంది. మాంసాహారపు ప్రొటీన్లతో మలబద్దకం వస్తే శాకాహారంతో లభ్యమయ్యే ఈ ప్రొటీన్లతో దాన్ని నివారించినట్లు కూడా అవుతుంది. పైగా శాకాహారంలో పీచుపదార్థాల వల్ల జీర్ణప్రక్రియ సజావుగానూ, సాఫీగానూ సాగుతుంది. పేగుల ఆరోగ్యం బాగుపడుతుంది. ఇక ఇందులోని మినరల్స్, విటమిన్-ఈ, ఒమెగా ఫ్యాటీ ఆసిడ్స్ వంటి పోషకాలు చాలా కాలం పాటు వ్యక్తులను దీర్ఘకాలం పాటు యౌవనంగా ఉంచడానికి తోడ్పడతాయి.

జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా : ప్రతి 100 గ్రాముల ఈ ఎండుఫలాల్లో (డ్రైఫ్రుట్స్) దాదాపు 20 – 22 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి ఈ డ్రైఫ్రూట్స్ ద్వారా శాకాహారులు ప్రొటీన్స్‌ను పొందవచ్చు.

గింజలు (సీడ్స్) ద్వారా ప్రొటీన్లను ఇచ్చేవి

జనుము గింజలు (హెంప్ సీడ్స్) : వీటిని మనం ఆహారంగా వాడటానికి పెద్దగా ఇష్టపడకపోయినా... జనుము గింజల్లో (హెంప్ సీడ్స్) ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. 30 గ్రాముల జనుము గింజల్లో 22 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అంతేకాదు... ఇందులో మానవ జీవక్రియలకు అవసరమైన 10 అత్యవసరమైన అమైనోఆసిడ్స్ ఉన్నాయి. చాలాకాలం యౌవనంగా కనిపించేలా చేసే ఒమెగా 3-ఫ్యాటీ ఆసిడ్స్ కూడా ఉన్నాయి.



సబ్జా గింజలు (చియా సీడ్స్) : సబ్జా గింజలలో ప్రొటీన్లతో పాటు వ్యాధులను దూరంగా ఉంచడంతో పాటు దీర్ఘకాలం యౌవనంగా కనిపించేలా చేసే యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. పైగా ఇవి రక్తంలోని చక్కెరను నియంత్రణలో ఉంచుతాయి కాబట్టి అటు ప్రొటీన్లను సమకూరుస్తూనే ఇటు చక్కెరను అదుపు చేస్తాయి. పైగా ఇందులో పీచు పదార్థాలూ పుష్కలంగా ఉంటాయి.

అవిశె గింజలు (ఫ్లాక్స్ సీడ్స్) : 100 గ్రాముల అవిశె గింజలలో 18 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి మంచి ప్రొటీన్ కోరుకునేవారికి అవిశె గింజలు ఉత్తమమైన ప్రొటీన్ వనరు.


గుమ్మడి గింజలు (పంప్‌కిన్ సీడ్స్): 100 గ్రాముల గుమ్మడికాయ గింజల్లో 19 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇక ఇందులో ప్రొటీన్‌తో పాటు యాంటీఆక్సిడెంట్స్, ఫైటోన్యూట్రియెంట్స్ లాంటి అనేక పోషకాలు ఉంటాయి. పైగా గుమ్మడి గింజల్లో మెగ్నీషియమ్, మాంగనీస్, కాపర్, జింక్, ఐరన్ లాంటి పోషకాలూ ఉంటాయి కాబట్టి ఆరోగ్యానికి చాలా మందిది. ఇవి దీర్ఘకాలం యౌవనంగా ఉండేలా చూస్తాయి కూడా.

ధాన్యపు గింజలలో : ఇక మనం సాధారణంగా ధాన్యం అని పరిగణించే వరి, బార్లీ, ఇతర తృణధాన్యాలు, ఓట్‌మీల్, గోధుమ.... వీటన్నింటిలోనూ కొంతమేరకు ప్రొటీన్లు కూడా ఉంటాయి. అయితే పప్పు ధాన్యాలలో ఉన్నంత కాదు.



పాలు పాల ఉత్పాదనలలో

పాలలో రెండు రకాల ప్రొటీన్లు ఉంటాయి. మొదటి ప్రొటీన్‌ను ‘వే’ అంటారు. మరో ప్రొటీన్‌కు కేసీన్ అని పేరు. ఈ రెండింటిలోనూ అత్యుత్తమ స్థాయి అమైనోయాసిడ్స్ నిండి ఉన్నాయి. ఇక పాలతో పాటు పాల ఉత్పాదనలైన పెరుగు, చీజ్‌లలోనూ ప్రొటీన్లు ఎక్కువ. పాలు, పాల ఉత్పాదనలలలో 20 : 80 నిష్పత్తిలో లభించే వే, కేసీన్ ప్రొటీన్లు హైబీపీని నియంత్రిస్తాయి. ఇక 100 గ్రాముల చీజ్‌లో 11 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.



టోఫూ : తెల్లటి ఘన (క్యూబ్) ఆకృతిలో కనిపించే ఈ టోఫూను ప్రొటీన్ల గడ్డ అనుకోవచ్చు. ఇందులో చాలా రకాలుంటాయి. కాస్త మెత్తగా ఉండేవి, ఒక మోస్తరుగా ఉండేవి. మరీ గడ్డలా ఉండేవి. చైనా, జపాన్ లాంటి తూర్పు ఆసియా దేశాలకు చెందిన ఈ ఆహార పదార్థాన్ని అనేక రకాల వంటకాలు, తీపి పదార్థాల తయారీలలో వాడతారు. ఇందులో క్యాలరీలు తక్కువ, ప్రొటీన్లు ఎక్కువ. శాకాహారంలో టోఫూ అంతగా ప్రొటీన్లు లభ్యమయ్యే ఇతర వనరులు చాలా తక్కువ. అందుకే శాకాహారులు తమ ప్రొటీన్ అవసరాల కోసం దీన్ని నిశ్చింతగా వాడుకోవచ్చు.

ఎంత ప్రొటీన్ కావాలంటే

ఒక వ్యక్తి ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే ప్రతిరోజూ తన బరువులోని ప్రతి కిలోకు ఒక గ్రాము ప్రొటీన్ కావాలి. అంతే ఉదాహరణకు ఒక వ్యక్తి బరువు 60 కిలోలు అనుకుంటే అతడికి రోజులో 60 గ్రాముల ప్రొటీన్ అవసరం. ఒక రోజువారీ ఆహారం (డైట్ ప్లాన్) ద్వారా చవకగా పొందాలంటే అది ఎలా అందుతుందో వివరించేదే ఈ కింది చార్ట్ :

సమయం	పదార్థం	ప్రొటీన్ పరిమాణం
ఉదయం 6 గం.లకు	1 కప్పు టీ	–
7 నుంచి 8.30	బ్రేక్‌ఫాస్ట్‌లో జొన్న ఉప్మా/రాగి సంకటి/2 సజ్జ రొట్టెలు	10 గ్రా.
12.30 – 2 గంటలు	లంచ్‌లో... 150 గ్రాముల వరి అన్నం	14 గ్రా
	40 గ్రా. పప్పు	10 గ్రా
	కూరగాయల్లో...	–
	అరకప్పు పెరుగు	3 గ్రా
3 గంటలకు	1 కప్పు టీ	–
	50 గ్రా. అలసందలు/ఉలువలు/బొబ్బర్లు	10 గ్రా
4.00 – 5.30	60 గ్రా అటుకుల వంటి ఉపాహారం...	4 గ్రా
రాత్రి భోజనం	2 జొన్న రొట్టెలు/2గోధుమరొట్టెలు	10 గ్రా
రాత్రి 10 గంటలకు	1 కప్పుల పాలు	4 గ్రా
ఈ చార్ట్ ద్వారా రోజంతా లభించే మొత్తం ప్రొటీన్లు		65 గ్రా

ఇది సుమారుగా 60 కిలోల బరువున్న వ్యక్తి కోసం రూపొందించిన ఒక ఉజ్జాయింపు డైట్ చార్ట్. వేర్వేరు వ్యక్తులు తాము ఉన్న బరువును బట్టి ఆయా పదార్థాల పరిమాణంలో మార్పులు చేసుకొని తమ బరువుకు తగినన్ని ప్రొటీన్లు పొందవచ్చు.

సూచన : కొన్ని రకాల ఆకుకూరలు, కూరగాయల్లోనూ ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఉదా: 100 గ్రాముల మునగాకులో 6 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇక గింజ చిక్కుళ్లు, గోరుచిక్కుళ్లలో 100 గ్రాముల్లో 4– 5 గ్రాములూ; సజ్జలు, జొన్నలు, రాగుల, కొర్రల వంటి తృణధాన్యాల్లో ప్రతి 100 గ్రా.కు 10 గ్రా. వరకు ప్రొటీన్ ఉంటుంది. వీటిని మార్చి మార్చి తీసుకోవడం వల్ల మనకు అవసరమైన ప్రొటీన్ అందుతుంది.

కూరగాయల భోజనంతో త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం ఎందుకంటే

భోజనంలోకి మటనో, చికెనో ఉంటే నాలుగు ముద్దలు ఎక్కువగా తినాలనిపిస్తుందని, నిజానికి అలా ఎందుకు జరుగుతుందో చాలామందికి తెలియదు. ఆకుకూరల భోజనంలో పీచుపదార్థాలు చాలా ఎక్కువగా ఉంటాయి. దాంతోపాటు ప్రొటీన్లూ ఎక్కువే. మన జీవక్రియలకు ఎంత ఆహారం కావాలో మెదడుకు తెలుసు. అందుకే మనం ఎంతో తినాలనుకున్నా అలా తినలేం. మనకు సరిపోయినంత కడుపులో పడిందని భావించాక కడుపునకు మెదడు ఒక సంకేతం పంపిస్తుంది. ఆ సంకేతం తర్వాత పూర్తి సంతృప్తి పొందిన ఫీలింగ్ కలుగుతుంది. ఇంగ్లిష్‌లో దీన్నే సేషియేషన్ అంటారు. ఇలా పీచులూ-ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం కొద్దిగా తీసుకోగానే అది చాలని భావించిన మెదడు సంతృప్తసంకేతం పంపిస్తుంది. దాంతో కడుపునిండిపోయినట్లవుతుంది. అంటే మనం తీసుకున్న ఆ ఆహారం మనకు చాలన్నమాట. అదే పీచులు లోపించి మాంసం తిన్నామనుకోండి. అందులోని పీచులు మన జీవక్రియలకు సరిపోకపోవడం వల్ల కడుపులో ఉండాల్సిన దాని కన్నా ఎక్కువే ఆహారం ఉన్నప్పటికీ ‘మరికాస్త తినాలి, ఇంకాస్త తినాలి’ అంటూ మన మెదడు కడుపునూ, నోటినీ కోరుతుంటుంది. అంటే సంతృప్త సంకేతం ఒక పట్టాన అందదన్నమాట. అందుకే మాంసాహారం తిన్నప్పుడు మామూలు కంటే ఒక ముద్ద ఎక్కువగానే కావాలనిపిస్తుంది.

కూరగాయలు, పప్పులలో...

సోయాబీన్స్‌లో : సోయా ఉత్పాదనల్లో చాలా పుష్కలమైన ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేసేవి. మనకు మాంసాహారం ద్వారా లభ్యమయ్యే ప్రొటీన్లతో పోలిస్తే సోయాతో దొరికే ప్రొటీన్ కూడా అంతే నాణ్యమైనదని చెప్పవచ్చు.

మంచి శెనగల్లో : మంచి శెనగల్లోనూ ప్రొటీన్లతో పాటు డయటరీ ఫైబర్, పొటాషియమ్ పుష్కలంగా దొరుకుతుంది.

కాయధాన్యాలు (లెంటిల్స్‌లో) : లెంటిల్స్ అని పిలిచే కాయధాన్యాలలోనూ కొంత ప్రొటీన్ ఉంటుంది. ఇక కందిపప్పు, పెసరపప్పుతో పాటు అన్ని రకాల పప్పులలోనూ ప్రొటీన్ల పాళ్లు చాలా ఎక్కువే. అందుకే డాక్టర్లు శస్త్రచికిత్స జరిగాక ఆ గాయం త్వరగా మానేందుకు పప్పులు ఎక్కువగా తినమని సలహా ఇస్తుంటారు.



అయితే పప్పు తినడం వల్ల సర్జరీ చేసిన గాయానికి చీము పడుతుందనే అపోహతో చాలామంది ఈ సూచనను పాటించరు. నిజానికి పప్పుల్లో చీము పట్టించే గుణం ఉండనే ఉండదు. పప్పులు తింటే ఏ గాయానికైనా చీము పట్టనే పట్టదు.

సుజాత స్టీఫెన్
చీఫ్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట,
హైదరాబాద్

ఆత్మీయం

పారాయణ పరమార్థం

శిష్యుల ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడేవాడే ఉత్తమ గురువు. అందుకే గురువును సృష్టి స్థితి లయ కారకులైన త్రిమూర్త స్వరూపంతో పోలుస్తారు. బాబా అచ్చంగా అటువంటి సద్గురువు. ఆత్మసాక్షాత్కార సాధనకు మార్గం చూపించే చుక్కాని వంటివాడు. శ్రీసాయి బోధనకు ప్రత్యేక స్థలం, సమయం, సందర్భం ఉండేవి కావు. సందర్భాన్ని బట్టి బాబా ప్రబోధం ప్రవాహం మాదిరి జాలువారేది. ఒకనాడు ఒక భక్తుడు ఇంకో భక్తుని గురించి అతని పరోక్షంలో ఇతరుల ముందు నిందించసాగాడు. తోటి భక్తునిలోని ఒప్పులను విడిచి, అతను చేసిన తప్పులను కావాలనే ఎత్తి చూపుతూ హీనంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. అతని తీరుతో పక్కనే ఉన్న ఇతర భక్తులు నొచ్చుకున్నారు. తన సర్వజ్ఞతతో సదరు భక్తుని బుద్ధిని గ్రహించారు బాబా. పరనిందకు పాల్పడిన భక్తుడిని సరిదిద్దాలను కున్నారు.



ఒకనాడు బాబా లెండీతోటకు వెళ్లేటప్పుడు తోటి భక్తుడిని నిందించిన భక్తుడు బాబాకు ఎదురు పడ్డాడు. అప్పుడు బాబా ‘‘ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప లభించని మనిషి పుట్టుక పుట్టి పరనిందకు పాల్పడటమంటే అవతలివారి మలినాలను నీ నాలుకతో శుభ్రపరుస్తున్నట్టే లెక్క. ఇకముందెప్పుడూ అలా చేయకు’’ అని మందలించారు. బాబా చెప్పిన నీతి గ్రహించిన ఆ భక్తుడు వెంటనే తన తప్పు దిద్దుకున్నాడు. మనం బాబా సచ్చరిత్ర పారాయణ చేస్తాం, భక్తితో లెంపలు వేసుకుంటాం. నైవేద్యం పెట్టి, నీరాజనం సమర్పిస్తాం కానీ, బాబా చెప్పిన ఇలాంటి విషయాలు ఆచరించినప్పుడే అది అసలైన పారాయణ అవుతుంది.

గుడ్‌ఫుడ్

రాగులతో మైగ్రేన్ దూరం

- రాగులు మైగ్రేన్ తలనొప్పుల నుంచి మంచి ఉపశమనం కలిగిస్తాయి. రాగులలో క్యాల్షియమ్ పాళ్లు పుష్కలం. 100 గ్రాముల రాగులలో 344 మిల్లీగ్రాముల క్యాల్షియమ్ ఉంటుంది.
- రాగుల పై పొట్టులో పాలీఫీనాల్స్ అనే పోషకాలు, డయటరీ ఫైబర్ (పీచు) ఎక్కువ. అవి మనం తీసుకున్న ఆహారాన్ని మెల్లగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దాంతో మన ఆహారం ద్వారా వెలువడే చక్కెర చాలా నెమ్మదిగా విడుదల అవుతుంది. దాంతో చక్కెర నియంత్రణలో ఉంటుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారికి రాగులు మంచి ఆహారం. ఇక పీచుపదార్థాల వల్ల మన జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేయడంతో పాటు మలబద్ధకం ముప్పు ఉండదు.
- రాగులు తీసుకునే వారిలో చర్మం నిగనిగలాడుతూ ఉంటుంది.



అంతేగాక వయసు పెరగడం వల్ల వచ్చే అనర్థాలను నివారిస్తుంది. దాంతో దీర్ఘకాలం యౌవనంగా ఉండటం సాధ్యమవుతుంది.

- రాగులలో స్వాభావికమైన ఐరన్ ఎక్కువ. అందుకే రక్తహీనత (అనీమియా)తో బాధపడే రోగులకు రాగులతో చేసే ఆహారాలను సిఫార్సు చేస్తారు. ఇక రాగులను మొలకెత్తేలా (స్ప్రౌట్స్‌గా) చేస్తే వాటిలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు రాగులలోని ఐరన్‌ను ఒంటికి పట్టేలా చేస్తుంది.
- రాగులు తినేవారిలో యాంగ్జైటీ, డిప్రెషన్, నిద్రలేమి (ఇన్‌సామ్నియా) వంటి మానసిక సమస్యలు తగ్గుతాయి.
- రాగులలో పీచుపదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇది ఊబకాయంతో బాధపడేవారికి మంచి ఆహారం.







లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ రామ్ అన్నయ్యా... నాకో మరదలు ఉంది. పెద్దలు మా అన్నయ్యకి తనకి పెళ్లి చేద్దాం అనుకున్నారు. అయితే తనకి నేనంటే ఇష్టమని చెప్పింది. కానీ మా అన్నయ్య తనని లవ్ చేశాడట. ఇష్టంలేదని చెప్పడంతో బాగా హర్ట్ అయ్యి వేరే సంబంధం చూసుకున్నాడు అన్నయ్య. ఇప్పుడు మరదల్ని పెళ్లిచేసుకోమని వాళ్ల పేరెంట్స్ నన్ను అడుగుతున్నారు. అయితే తనని పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టమే అయినా... మా అన్నయ్యకి ఇష్టం లేదు. ఇప్పుడు నేను ఏం చెయ్యాలి. తనని చేసుకుంటే ఇంట్లో గొడవలు వస్తాయేమో అని భయంగా ఉంది.

- అరుణ్

'సార్.. ఈ సారి బోర్డు తిప్పెయ్యాల్సిందే.. అమ్మో ఇలాంటి క్వశ్చన్‌కి ఆన్సర్ మీరు కానీ నేను కానీ.. మనమిద్దరం కలిసి కూడా ఇవ్వలేము. మర్యాదగా ఓటమిని ఒప్పుకోండి. బోర్డు తిప్పెయ్యండి సార్!'

పెద్ద పెద్ద తుఫాన్లు వచ్చినా తిరగని బోర్డును ఎలా తిప్పేయమంటావు నీలాంబరీ?

'సార్ బిగ్ బ్రో చేసుకుంటానన్నాడు. అమ్మాయి నో చెప్పింది. స్మాల్ బ్రోని చేసుకుంటానంటోంది. కానీ, అమ్మాయి స్మాల్ బ్రోని చేసుకోవడం బిగ్ బ్రోకి ఇష్టం లేదు. కాదని స్మాల్ బ్రో చేసుకుంటే... బిగ్ బ్రో మరదలిని చూసినప్పుడల్లా డిస్టర్బ్‌డ్‌గా ఫీల్ అవుతాడు. ఇప్పుడు స్మాల్ బ్రో చేసుకోకపోతే ఏ తప్పు చేయని అమ్మాయికి అనవసరమైన శిక్ష పడుతుంది. జస్ట్ అమ్మాయి కాదు సార్, మీ చెల్లెలు... మరి ఇప్పుడు హా?'

వెరీ సింపుల్ అంతా అమ్మాయి మంచికే జరిగింది!

'ఏంటి సార్ సింపుల్... ఇక్కడ బీపీ పెరిగిపోతుంటే..?'

అరే! మేనరికాలు చేసుకుంటే పుట్టే పిల్లలకు నష్టం కలగొచ్చు.

అమాయకమైన చెల్లెలికి అన్యాయం జరుగుతుందని బాధ పడేకంటే.. ఏ పాపం తెలియని పసి పిల్లలకు అన్యాయం జరగకుండా చూసుకోవడం ఒక అన్నయ్యగా నా బాధ్యత కాదా?

'అబ్బా.. ఏం ఫిట్టింగ్ పెట్టారు సార్!?!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే... ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com



మనోల్లాస యోగం

వ్యక్తిగత సమస్యలు, సామాజిక సమస్యలు, వృత్తి నిర్వహణలో వచ్చే సమస్యలు, విద్యార్థుల సమస్యలు - ఇవన్నీ మానసిక ఒత్తిడికి కారణం అని అందరికీ తెలుసు. కానీ, ఈ ఒత్తిడి వల్ల మనసు, శరీరంపై ఎటువంటి దుష్ప్రభావం ఉంటుందో ముందుగా తెలుసుకుంటే ఈ సమస్యను నివారించడం లేదా పరిష్కరించడం ఎంత ముఖ్యమో అర్థం అవుతుంది.

మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు శరీరంలోని ఎడ్రినల్ గ్రంథులు కార్టిజోన్, ఎడ్రినలిన్, నార్ ఎపినెఫ్రైన్ అనే హార్మోన్లను విడుదల చేస్తాయి. ఎడ్రినలిన్ వలన గుండె వేగం పెరిగి తద్వారా రక్తపోటు పెరుగుతుంది. కార్టిజోన్ వలన రక్తనాడుల లోపల లైనింగ్ పనితీరు క్రమం దెబ్బతింటుంది. ఇది గుండెపోటుకు దారి తీయవచ్చు. కార్టిజోన్ లెవెల్స్ ఎక్కువ అయినప్పుడు ఆకలికి సంబంధించి మార్పులు రావడం, బరువు పెరగడం, జీర్ణాశయ సమస్యలు, ఆస్టియోపొరోసిస్, క్యాన్సర్, డయాబెటిస్ వ్యాధులకు కారణమవుతుంది. అలాగే ఫ్రీ రాడికల్స్‌ని ఉత్పత్తి చేసి, ఉన్న బ్రెయిన్ సెల్స్ చనిపోవడానికి, కొత్త బ్రెయిన్ సెల్స్ పుట్టకుండా చేస్తుంది. ఇది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, స్కిజోఫ్రేనియా, డిమిన్షియా, అల్జీమర్స్ వంటి మెదడు సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. యోగ ఆసనాల ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. దీనికి చేయవలసిన కొన్ని ముఖ్యమైన ఆసనాలు -

ఒత్తిడిలో ఉన్నప్పుడు ముందుగా తలలోని భాగాలు, మెడ, భుజాలు బాగా ప్రభావితమవుతాయి. కనుక వీటికి సంబంధించిన యోగాసనాలు చేయాలి. వీటిలో బ్రహ్మముద్రలు, చాలన తాలాసన, ఉత్థాన హస్తపాదాసన. మార్జాలాసన, అర్ధ అధోముఖ, అధోముఖ శ్వానాసన, నిరాలంబాసన, ఉదరాకర్షణాసన, మకరాసన, శశాంకాసన.. వంటి తేలికపాటి ఆసనాలు రెగ్యులర్‌గా సాధన చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది. యోగ నిద్ర, సరైన ధ్యాన మార్గాలను కూడా సాధన చేసినట్లయితే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. ఆసనాలు చేసే విధానం...

1 చాలన తాలాసన

కుడి ఎడమలకు ముందు సమస్థితిలో నిలబడి, కుడి కాలు ముందుకు ఎడమకాలు వెనుకకు ఉంచి శ్వాసతీసుకుంటూ చేతులు రెండూ పైకి లేపి, శ్వాస వదులుతూ చేతులు రెండూ ముందు నుండి డయాగ్నల్‌గా కిందకు తీసుకురావాలి. కాలి మడమను తిప్పుతూ వెనుకకు తిరుగుతూ చేతులు రెండూ డయాగ్నల్‌గా క్రిందనుంచి పైకి తీసుకువెళ్ళి చేతులు విశ్రాంతిగా భుజాల వెనుక ఉన్న ట్రెపీజియస్ కండరాల మీద ఉంచాలి. ఈ విధంగా ముందునుండి వెనుకకు, వెనుక నుండి ముందుకు 5 నుండి 10 సార్లు చేయాలి. ఇదేవిధంగా రెండవవైపు కూడా చేయాలి. నెమ్మదిగా, సౌకర్యవంతంగా శ్వాస తీసుకుని వదులుతూ చేయాలి.

2. ఉత్థాన హస్తపాదాసన

సమస్థితిలో నిలబడి శ్వాస తీసుకుంటూ చేతులు రెండూ ముందు నుండి పైకి తీసుకువెళ్ళి, శ్వాస వదులుతూ మోకాళ్లు ముందుకు వంచి క్రిందకు వంగి, చేతులు రెండూ ఫొటోలో చూపినట్లుగా వెనుకకు, పైకి తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలి. శ్వాస తీసుకుంటూ చేతులు రెండూ ముందు నుంచి పైకి తీసుకువెళ్లాలి. ఇలా 5 నుంచి 10 సార్లు చేయవచ్చు.

3. అధోముఖ శ్వానాసన

చేతులు రెండూ క్రిందకు ఉంచిన తరువాత (పై పొజిషన్‌లో) కుడికాలు వెనుకకు తరువాత ఎడమకాలు వెనుకకు తీసుకువెళ్లి శ్వాస వదులుతూ నడుమును పైకి తీసుకువెళ్లి పొట్టని బాగా లోపలకు లాగుతూ 3 లేదా 5 శ్వాసలు ఉండాలి. ఈ స్థితిలో తలవైపునకు రక్తప్రసరణ పెరిగి మెదడు తదితర భాగాలు చురుకుగా పనిచేస్తాయి.



ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్
యోగా ఫౌండేషన్

4. నిరాలంబాసన

సమన్వయం
ఎస్. సత్యబాబు
సాక్షి ప్రతినిధి

పై స్థితిలో నుండి శ్వాస తీసుకుంటూ కుడి మోకాలు క్రిందకు, తరువాత ఎడమ మోకాలు క్రిందకి తీసుకువచ్చి మార్జాలాసనంలో రిలాక్స్ అవ్వాలి. తరువాత రెండు కాళ్ళు వెనుకకు స్ట్రెచ్ చేస్తూ పొట్ట భాగాలు పూర్తిగా నేలకు తాకే విధంగా చెక్ చేసుకుంటూ మోచేతులు రెండూ నేలమీద ఉంచి, చేతులు గడ్డం కింద ఉంచి 3 నిమిషాలు రిలాక్స్ అవ్వచ్చు.







మోడల్
ఈషా
హిందోచా





5. ఉదరాకర్షణాసన

భూమి మీద బోర్లాపడుకుని కుడి చేయి నడుముకి పక్కన, ఎడమ చేయి తలకు సమాంతరంగా ఎడమ మోకాలు మడచి ఎడమపాదం కుడి తొడకు దగ్గరగా తీసుకువచ్చి శరీరంలో వీలైనన్ని భాగాలు భూమి మీద ఆనిస్తూ రిలాక్స్ అవ్వాలి. ఇదే విధంగా రెండో వైపు కూడా కనీసం 3 నిమిషాల పాటు రిలాక్స్ అవ్వాలి. ఇది హై బీపీని తగ్గించడంలో మెటబాలిక్ రేట్‌ని రెగ్యులేట్ చేయడంలో ఉపయోగపడుతుంది.

6. యోగనిద్ర

పైన చెప్పిన ఆసనాలు అన్నీ పూర్తయిన తరువాత కొన్ని తేలికపాటి ప్రాణాయామాలు (సూర్య భేది, అనులోమ విలోమ, చంద్రభేది, భ్రామరి) చేయాలి. తర్వాత యోగనిద్రలోకి వెళ్లి, 5 నుండి 10 నిమిషాల పాటు శరీరంలోని భాగాలన్నిటిమీద, మాడుపై భాగం నుండి కాలి వేళ్ళ వరకు మనో నేత్రంతో చూస్తూ రిలాక్స్ అవ్వాలి. దీని వలన ఆయా అవయవాలకు సాంత్వన, మనసుకు ప్రశాంతత చేకూరుతుంది.



మాటిచ్చా... నిలబెట్టుకున్నా!

"మన బ్లడ్‌కి ఓ కలర్... మన మాటకు ఓ విలువ... మనకు ఓ క్యారెక్టర్ ఉండాలి. ఆ క్యారెక్టర్ కోసం నేనెంత దూరమైనా వెళతా. 'సరైనోడు' తర్వాత నాకు పెద్ద ఛాన్సులొచ్చాయి. కానీ, ఎప్పుడో సాయితో సినిమా చేస్తానని నేను మాటిచ్చా. అందుకని ఈ సినిమా చేశా. కానీ, చేసిది ఎలా ఉండాలి? పెద్ద స్థాయిలో ఉండాలి. ఏదో సినిమా చేయాలని చేయలేదు. నేను చేసిన ఆరు సినిమాల కంటే ఓ పాయింట్ ఎక్కువ వెళ్లా తప్ప... తక్కువ వెళ్లలేదు" అన్నారు బోయపాటి శ్రీను. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ (సాయి), రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా ఆయన దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన 'జయ జానకి నాయక' రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బోయపాటి చెప్పిన విశేషాలు...

- నేను సినిమా తీసిన ప్రతిసారి 'మీరు ప్రయోగాలు చేయరా? మారరా?' అనడుగుతారు. ఓ అందమైన ప్రేమకథకు ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, మంచి పాటలు జోడించి 'భద్ర' తీశా. ఆ తర్వాత నేను చేసిన అందమైన ప్రేమకథే ఈ సిన్మా. ఒక్క మాటలో చెప్పాలంటే... ప్రతి ఒక్క గుండెను చేరే చిత్రమిది. ప్రతి ఒక్కరి మనసుల్ని స్పృశించే చిత్రమిది. కొత్తగానూ, కథానుగుణంగానూ ఉంటుందని 'జయ జానకి నాయక' టైటిల్ పెట్టాం. ప్రేమంటే ఏంటి? ఆడపిల్లంటే ఏంటి? వాళ్లను మనమెంత అపురూపంగా కాపాడుకోవాలనేది సినిమాలో చెప్పాను.
- నా ప్రతి సినిమాలోనూ యాక్షన్ హైలైట్ అయినా అవెందుకు ఆడాయంటే.. యాక్షన్‌తో పాటు ఎమోషన్ కనెక్ట్ అయ్యుంటుంది గనుక! ప్రేక్షకుడు కొట్టు అన్నప్పుడే నా హీరో కొడతాడు. ఫైట్ ఫర్ ఫైట్, సాంగ్ ఫర్ సాంగ్ అన్నట్టు నేను తీయను. ప్రతిదీ కథలో భాగంగా ఉంటుంది. ఇందులోనూ అలాంటి ఎమోషనల్ ఫైట్స్ ఉన్నాయి. థియేటర్లో ప్రేక్షకుడు 'వాణ్ణిప్పుడు హీరో కొట్టాలిరా' అని ఫీలైనప్పుడే హీరో కొడతాడు. కథలో భాగంగానే పాటలొస్తాయి. అందువల్లే, కథలోంచి పాటలు రావడంతో నా వర్క్ సులభమైందని దేవిశ్రీ చెప్పాడు. అతను మంచి పాటలు ఇవ్వడంతో పాటు సూపర్బ్ రీ–రికార్డింగ్ ఇచ్చాడు.
- 'లెజెండ్' తర్వాత బన్నీతో చేస్తున్నప్పుడు 'తనతో మీకు ఎలా కుదురుతుంది?' అనడిగారు. బన్నీ బాడీ లాంగ్వేజ్‌కి సరిపడినట్లే 'సరైనోడు' తీశా కదా! నాకు దొరికిన మెటీరియల్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తా తప్ప... ఎక్కడికో వెళ్లి చేయను. మైఖేల్ జాక్సన్ దొరికితే డ్యాన్స్ చేస్తా. మైక్ టైసన్ దొరికితే బాక్సింగ్ చేస్తా. సాయి ఓ ముడిసరుకు లాంటోడు. తన ప్లస్సులను ప్లస్ చేస్తూ, మైనస్‌లను తగ్గిస్తూ, తన బాడీ లాంగ్వేజ్‌కి సరిపడినట్లు సిన్మా తీశా.
- ఈ సినిమా బడ్జెట్‌కు తగ్గట్టు బిజినెస్ జరిగింది. నాపై కొన్ని అంచనాలు ఉన్నాయి. కొత్త హీరో అని వాటి కంటే తక్కువగా నేనెందుకు సిన్మా తీస్తా? ఈ సంగతి మా నిర్మాతకు తెలుసు. ఆయనే మా సినిమాకు గ్రేట్ ఎసెట్. డబ్బు కాదు, మంచి సినిమా ముఖ్యమని తీశారు. సేమ్ టైమ్... ఆయన క్రెడిట్ కార్డు ఇచ్చారని ఎలా పడితే అలా వాడలేదు. నన్ను నమ్మి సినిమా కొన్న డిస్ట్రిబ్యూటర్లు, బయ్యర్లను, నిర్మాతను డిజప్పాయింట్ చేసేలా సినిమా ఉండదు. 'స్టార్‌తో కాకుండా కొత్త హీరోతో ఈ సినిమా తీయడం వల్ల బిజినెస్ పరంగా మీపై ఒత్తిడి పెరిగిందా?' అనడిగితే... 'ఒత్తిడి ఉంటుందని సాయితో సినిమా చేయాలనుకున్నప్పుడే తెలుసు. కానీ, ఒత్తిడి ఫీలవలేదు. ఎందుకంటే... మంచి కథ కుదిరింది' అన్నారు బోయపాటి.
- మూడు సినిమాలు ఒకే రోజున విడుదల కావడం వల్ల ఇబ్బంది ఏం లేదు. నిజానికి, జూన్ 23న లేదా జూలై తొలి వారంలో మా సినిమా విడుదల కావాలి. కొన్ని కారణాల వల్ల ఆలస్యమైంది. ఇంకా వెనక్కి వెళితే మా నిర్మాత నెలకు కోట్ల రూపాయల వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి. ఆల్రెడీ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. సో, రిలీజ్ చేస్తున్నాం. మనకు 1200లకు పైగా థియేటర్లు ఉన్నాయి. అన్నిటిలోనూ మన సినిమాను విడుదల చేసుకోలేం కదా! మా సినిమా 750 నుంచి 800 థియేటర్లలో విడుదలవుతోంది.
- 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' తర్వాత చిరంజీవిగారు ఎప్పుడు? ఏం చేస్తారో? నాకు తెలీదు గానీ.. నేనైతే ఆయన కోసం ఓ కథ రెడీ చేశా. మహేశ్‌బాబుగారితో ఓ సరికొత్త జానర్ కథ గురించి డిస్కస్ చేశా. నాకు డేట్స్ ఎక్కువ కావాలనడిగా. వచ్చే ఏడాది మే–జూన్ నెలల్లో తప్పకుండా బాలకృష్ణగారితో ఓ సినిమా స్టార్ట్ చేస్తా. అఖిల్ కోసం రెండు లైన్లు రెడీ చేశా. అయితే... ఈ సినిమా హడావిడి పూర్తయిన తర్వాత, బాలకృష్ణగారి సినిమా మొదలయ్యేలోపు ఏం చేయాలి? ఏ సినిమా చేస్తే న్యాయం చేయగలను? అనేది చూస్తా!

అప్పుడు నిరాశపడలేదు... ఆ తర్వాత పొంగిపోలేదు



"'అందాల రాక్షసి' ఫలితం చూసి నిరాశ పడలేదు. 'కృష్ణగాడి వీరప్రేమగాథ' విజయం చూసి పొంగిపోలేదు. హిట్టూ ఫ్లాపుల గురించి ఆలోచిస్తే క్రియేటివిటీకి దూరమైపోతామని నా అభిప్రాయం. మనసుకు నచ్చిన సినిమాలను చేసుకుంటూ వెళ్లాలన్నదే నా అభిమతం" అన్నారు హను రాఘవపూడి. నితిన్, మేఘా ఆకాశ్ జంటగా ఆయన దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనిల్ సుంకర నిర్మించిన సినిమా 'లై'. వెంకట్ బోయినపల్లి చిత్రసమర్పకులు. రేపు రిలీజవుతోన్న ఈ సినిమా గురించి హను చెప్పిన సంగతులు...

- అబద్ధాల వల్ల ఓ యువకుడు ఎలాంటి సమస్యల్లో చిక్కుకున్నాడనేది చిత్రకథ. అయితే... అతను చెప్పే ప్రతి అబద్ధం వెనుక ఓ నిజం దాగుంటుంది. అదే 'లై'లో అసలు లాజిక్–మేజిక్. ప్రేక్షకులు ఆ మేజిక్‌ను క్యాచ్ చేస్తే... సినిమా చాలా సరదాగా సాగుతుంది. నాకు తెలిసి ప్రేమలేని కథ, సినిమా ఉండదు. కాకపోతే సినిమాను బట్టి, కథను బట్టి ఆ ప్రేమను చూపించే విధానం మారుతుంటుంది. ఈ 'లై' కూడా ప్రేమకథే. మంచి యాక్షన్ అంశాలను మేళవించి రివెంజ్ డ్రామా నేపథ్యంలో తీశా.
- ఎప్పట్నుంచో నితిన్ నాతో సినిమా చేయాలనుకుంటున్నాడు. 'అందాల రాక్షసి, కృష్ణగాడి వీరప్రేమగాథ' సినిమాల మధ్య గ్యాప్ వచ్చినప్పుడు నా మైండ్‌లో ఓ ఐడియా వచ్చింది. వెంటనే కథ రెడీ చేశా. నితిన్‌కు చెప్పగానే నచ్చేసింది. విలన్ యాంగిల్ నుంచి సినిమా సాగుతుంది. విలన్ క్యారెక్టరైజేషన్ కూడా స్టైలిష్‌గా, డిఫరెంట్‌గా ఉంటుంది. అయితే... ఆ పాత్రకు అర్జున్‌గారు అయితే బాగుంటుందనుకున్నా. నేను ఆయనకు పెద్ద అభిమానిని. కానీ, అర్జున్‌గారి దగ్గరకెళ్లి కథ చెప్పేంత ధైర్యం లేదు. సుధాకర్‌రెడ్డిగారు (నితిన్ తండ్రి) ఆయన దగ్గరకు తీసుకెళితే, భయపడుతూనే కథ చెప్పా. 'కథ నచ్చింది. నేను చేస్తున్నా' అని అర్జున్‌గారు చెప్పగానే, సిన్మా హిట్టవుతుందనే నమ్మకం వచ్చేసింది.
- కథ ప్రకారం, నితిన్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమా తీశాం. స్క్రీన్‌పై చూస్తే 70 కోట్ల బడ్జెట్ సినిమాలా ఉంటుంది. మా నిర్మాతలు నాకెంతో స్వేచ్ఛనిచ్చారు. అనిల్‌గారి ప్లానింగ్ సూపర్బ్. విజయం వచ్చాక మనం చెప్పేది చాలామంది వింటారు. కానీ, ఏం చెబుతున్నామనే దాంట్లో స్పష్టత లేదంటే, ఎప్పటికీ తప్పుల్ని సరిదిద్దుకునే ఛాన్స్ రాదు.
- ఆర్మీ నేపథ్యంలో నానీతో ఓ స్వచ్ఛమైన ప్రేమకథ చేయబోతున్నా. దాన్ని లడఖ్‌లోనే చిత్రీకరించాలి. మే వరకు అక్కడ చిత్రీకరణ చేయలేం గనుక ఈలోపు మరో సినిమా చేయాలనుకుంటున్నా. అఖిల్ కోసం ఓ టిపికల్ సబ్జెక్ట్ రెడీ చేశా. మా మధ్య డిస్కషన్స్ కూడా జరిగాయి. కానీ, అదెప్పుడు సెట్స్‌పైకి వెళుతుందనేది చెప్పలేను.

పవర్‌ఫుల్ ఎంటర్‌టైనర్

సాయిధరమ్ తేజ్, లావణ్యా త్రిపాఠి జంటగా వీవీ వినాయక్ దర్శకత్వంలో సీకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. కల్యాణ్ నిర్మిస్తున్న చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. చిరంజీవి చిత్రబృందానికి ఆశీస్సులు అందించారు. సాయిధరమ్‌పై తీసిన ముహూర్తపు సన్నివేశానికి రచయిత సత్యానంద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో రచయిత పరుచూరి వెంకటేశ్వర రావు క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి కథ, మాటలు అందించిన ఆకుల శివ ఫస్ట్ షాట్‌కి దర్శకత్వం వహించారు. సాయిధరమ్ తేజ్ తల్లి విజయదుర్గ స్క్రిప్ట్ అందించారు. ''ఎనర్జిటిక్ హీరోగా పేరు తెచ్చుకున్న సాయి, పవర్‌ఫుల్ మాస్ సినిమాలకు చిరునామాగా నిలిచే వినాయక్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పవర్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతుంది'' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వేశ్వర్.



వీవీ వినాయక్, సాయిధరమ్ తేజ్, సీవీ రావు, సి.కల్యాణ్, విజయదుర్గ

నానీతో అనుపమ?



అనుపమ

'అ ఆ', 'ప్రేమమ్'లో కీలక పాత్రల్లో అలరించి, 'శతమానం భవతి'తో కథానాయికగానూ ఆకట్టుకున్నారు అనుపమా పరమేశ్వరన్. ఆచి తూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోన్న ఈ మలయాళీ బ్యూటీ ప్రస్తుతం రామ్ సరసన 'ఉన్నది ఒకటే జిందగీ'లో కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా నాని సరసన ఓ చిత్రంలో నటించడానికి అంగీకరించారని టాక్. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో 'కృష్ణార్జున యుద్ధం' పేరుతో నాని ఓ సిన్మా చేయనున్న విషయం తెలిసిందే. ఇందులో అనుపమను హీరోయిన్‌గా తీసుకున్నారట. ఈ చిత్రంలో ఆమె మోడ్రన్‌గా కనిపించనున్నారని సమాచారం. చూడబోతుంటే అనుపమ నెమ్మదిగా తెలుగులో బిజీ అవుతున్నట్లనిపిస్తోంది. అసిన్, మీరా జాస్మిన్, నిత్యామీనన్, నయనతార తదితర మలయాళ కుట్టీలు తెలుగులో స్టార్ హీరోయిన్స్ కాగలిగారు. అనుపమ కూడా ఆ లిస్టులో చేరతారని ఊహించవచ్చు.

ప్రతిక్షణం థ్రిల్ చేస్తుంది



మల్లిఖార్జునరెడ్డి, రాజ్ కందుకూరి

''ప్రతిక్షణం' టైటిల్ చాలా బాగుంది. 'క్షణం' సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో 'ప్రతిక్షణం' అంతకన్నా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా'' అని నిర్మాత రాజ్‌కందుకూరి అన్నారు. మనీష్‌బాబు, తేజస్విని జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రతిక్షణం'. నాగేంద్రప్రసాద్ దర్శకత్వంలో జి. మల్లిఖార్జునరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ–రిలీజ్, ప్లాటినమ్ డిస్క్ వేడుకలను నిర్వహించారు. చిత్రనిర్మాత మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ –''ఇందులోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేసి, కొత్త అనుభూతినిస్తుంది. రఘురామ్ సంగీతానికి మంచి స్పందన వస్తోంది'' అన్నారు. తెలంగాణ డ్రగ్ కంట్రోల్ సంస్థ డైరెక్టర్ అమృతరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ దేవారెడ్డి, ఓంనాథ్‌రెడ్డి, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఆ దేశ 'పోలీస్ సర్వీస్' వార్షికోత్సవంలో భాగంగా 'నిగూఢ' ఆర్మీ దుస్తుల్లో కవాతు చేస్తున్న ప్రత్యేకదళ కమాండోలు

ఐటీఐలకు బోర్డు ఏర్పాటు చేస్తాం: కేంద్రం

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తరహాలో పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)కు జాతీయ స్థాయిలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు తాము పంపిన ప్రతిపాదనలకు మానవవనరుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంట్రప్రెన్యూర్‌షిప్ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూఢీ మీడియాకు వెల్లడించారు. ఐటీఐల్లో ప్రాక్టికల్‌కు 70 శాతం, ఎంచుకున్న సబ్జెక్టుల్లో 30 శాతం మార్కులు ఉండేలా జాతీయస్థాయిలో ఉమ్మడి పరీక్ష నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల ఏటా 23 లక్షల మంది విద్యార్థులకు సీబీఎస్ఈ బోర్డు తరహాలో సర్టిఫికెట్లు జారీచేయడం వీలవుతుందన్నారు.

అభద్రతలో ముస్లింలు: అన్సారీ



న్యూఢిల్లీ: దేశంలోని ముస్లింలలో అభద్రత నెలకొందని, సామరస్య భావనకు ముప్పు ఏర్పడిందని ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ ఆందోళ వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ప్రధాని మోదీతో, ఆయన కేబినెట్ సహచరులతో చర్చించానని బుధవారం ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రభుత్వం ఎలా స్పందించిందని అడగ్గా.. వివరణలు, కారణాలు ఎప్పుడూ ఉంటాయని, వాటిని అంగీకరించాలా, నిరాకరించాలా అన్నది మనం నిర్ణయించుకోవాలని వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతిగా రెండో పర్యాయ పదవీకాలాన్ని గురువారంతో ముగించుకోనున్న అన్సారీ.. ఘర్ వాపసీ, గోరక్షకుల దాడులు, మైనారిటీలపై బీజేపీ నేతల వ్యాఖ్యలు తదితరాలపై స్పందించారు. 'ముస్లింలలో అభద్రత, అసౌకర్య భావనలు వ్యాపిస్తున్నాయి. దేశపౌరుల భారతీయతను ప్రశ్నించడమనేది ఇబ్బదికరమైన విషయం.. జాతీయవాదాన్ని ప్రతిరోజూ ప్రకటించుకోవాల్సిన అసవరం లేదు.. నేను భారతీయుడిని.. అంతే ' అని అన్నారు. మూకదాడులు, ఘర్ వాపసీ, హేతువాదుల హత్యలు భారతీయ విలువలు, శాంతిభద్రతను పరిరక్షించాల్సిన అధికారుల వైఫల్యమని పేర్కొన్నారు. భారత్ గత 70 ఏళ్ల నుంచే కాదు, శతాబ్దాల నుంచి బహుళత్వ సమాజమని, అయితే ఇప్పుడు ఆ సామరస్య భావనకు ప్రమాదం ఏర్పడిందని అన్నారు. సహన భావం ఇతరులను కలుపుకుపోయే స్థాయికి ఎదగాలన్నారు. మైనారిటీలకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అలాంటి వారిని అజ్ఞానులుగా, దురభిమానులుగా భావిస్తానన్నారు. ట్రిపుల్ తలాక్ సామాజిక దురాచారమని, మతపరమైనది కాదని అన్నారు. కశ్మీర్ సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనాలని సూచించారు.

మారిటల్ రేప్ నేరం కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: భార్యతో బలవంతంగా శృంగారంలో పాల్గొనడాన్ని (మారిటల్ రేప్) నేరంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయమై భారత పార్లమెంటు సైతం గతంలో విస్తృతంగా చర్చించిందని జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం తెలిపింది. మైనర్ భార్యతో శృంగారంలో పాల్గొనడానికి అనుమతిస్తున్న నిబంధనల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం ఈ మేరకు స్పందించింది. ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం భార్య వయసు 15 ఏళ్ల లోపుంటే ఆమె ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా శృంగారంలో పాల్గొంటే నేరమవుతుంది. ఒకవేళభార్య వయసు 15 ఏళ్లకు పైబడి 18 ఏళ్ల లోపుంటే అప్పుడు ఆమె అంగీకారం లేకుండా శృంగారంలో పాల్గొన్నా నేరం కాద'ని కోర్టు పేర్కొంది.

కాజల్ అగర్వాల్‌కు హైకోర్టులో చుక్కెదురు



తమిళ సినిమా (చెన్నై): సినీ నటి కాజల్ అగర్వాల్‌కు మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. వీవీడీ కొబ్బరినూనె తయారీ సంస్థపై కాజల్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. 2008లో వీవీడీ కొబ్బరినూనె ప్రకటనలో నటించడానికి ఆ సంస్థతో కాజల్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్క ఏడాదిపాటే ప్రసారంచేయాలనే నిబంధనతోనే ఆ ప్రకటనలో నటించానని, కానీ దాన్ని ఆ తర్వాతా ప్రసారంచేశారని ఆరోపిస్తూ ఆమె 2011లో మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. ఆ ప్రకటన ప్రసారాన్ని నిలిపి వేయాలని, నిబంధనలు అతిక్రమించి ప్రసారం చేసినందుకు తనకు రూ. 2.50 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా సంస్థను ఆదేశించాలని కోర్టును కోరారు. బుధవారం తుది విచారణ జరిపిన జడ్జి జస్టిస్ టీ రవీంద్రన్ కాపీరైట్స్ చట్టప్రకారం ఒక ప్రకటన దాన్ని రూపొందించిన సంస్థకే చెందుతుందన్నారు. ఒక్క ఏడాదే ఆ ప్రకటనను ప్రసారం చేయాలనే హక్కు కాజల్‌కు లేదన్నారు. ఒక వాణిజ్యప్రకటన ప్రమోషన్ హక్కులు ఆ సంస్థకు 60 ఏళ్ల వరకూ ఉంటాయని తీర్పు చెప్పారు. ఆ వాణిజ్యప్రకటనలో నటించడంతో కాజల్ అగర్వాల్ పని పూర్తయ్యిందని పేర్కొంటూ కాజల్ పిటిషన్‌ను కొట్టేశారు.

1942లో డూ ఆర్ డై..
2017లో చేద్దాం.. చేసి చూపిద్దాం!

నవభారత నిర్మాణానికి ఇదే నినాదం

- 75 ఏళ్ల క్విట్ ఇండియాపై లోక్‌సభలో చర్చ సందర్భంగా మోదీ
- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు చీకటి శక్తుల కుట్ర: సోనియా
- అప్పుడు భారత్ ఛోడో.. ఇప్పుడు భారత్ జోడో: స్పీకర్
- సుదృఢ భారతావనికి ఉభయసభల తీర్మానం





లోక్‌సభలో మోదీ. రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన 'ఎట్ హోం'లో స్మారక తపాలా బిళ్లలను ఆవిష్కరిస్తున్న కోవింద్, అన్సారీ, మోదీ

న్యూఢిల్లీ: నవ భారతావని నిర్మాణానికి కొత్త నినాదాన్ని, సరికొత్త కార్యాచరణను ప్రకటించారు ప్రధాని మోదీ. వలస పాలకులను తరిమి కొట్టిన క్విట్ ఇండియా ఉద్యమ నినాదం 'డూ ఆర్ డై' తరహాలో.. ప్రస్తుతం దేశాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు 'చేద్దాం.. చేసి చూపిద్దాం (కరేంగే.. కర్‌కే రహేంగే)' అనే నూతన నినాదాన్ని తెరపైకి తెచ్చారు. అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత.. తదితర సమస్యల పరిష్కారానికి పటిష్ట, సమగ్ర, ఉమ్మడి కార్యాచరణ అవసరమని, అందుకు అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే స్వాతంత్ర్య భారతావనికి 75 ఏళ్లు నిండే 2022 నాటికి నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. 75 ఏళ్ల క్విట్ ఇండియాపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు కొన్ని చీకటి శక్తులు ప్రయత్నిస్తున్నాయంటూ విపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ తన ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యుల ప్రసంగాల అనంతరం ఉభయసభల్లోనూ సంబంధిత తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

అవినీతే ప్రధాన అవరోధం

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 2017నుంచి 2022 వరకు నవభారత నిర్మాణానికి ఎంపీలంతా కృషిచేయాలని కోరారు. దేశాభివృద్ధికి అవినీతి ప్రధాన అవరోధంగా మారిందని.. రాజకీయ వ్యవస్థను చెదలా పట్టిందని మోదీ పేర్కొన్నారు. అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత, పౌష్టికాహారలోపం సమస్యలు పెను సవాళ్లుగా మారాయని.. ఈ సమస్యను అధిగమించేందుకు ఓ సానుకూల మార్పును తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రధాని వెల్లడించారు. '1942లో గాంధీ డూ ఆర్ డై అనే నినాదాన్నిచ్చారు. ఇప్పుడు ఇప్పుడు మనం కరేంగే ఔర్ కర్‌కే రహేంగే నినాదంతో ముందుకెళ్దాం. సంకల్ప సిద్ధితో వచ్చే ఐదేళ్ల భారత్ తీసుకొచ్చే సానుకూల మార్పులే ప్రపంచదేశాలకు స్ఫూర్తినిచ్చేందుకు ఉపకరిస్తాయి' అని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం ఎంపీలు పార్టీలకు అతీతంగా చేయి చేయి కలిపి.. సమరయోధులు కలలుగన్న భారతాన్ని వచ్చే ఐదేళ్లలో నిర్మించటంలో ముందడుగేయాలన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ, సుభాష్ చంద్రబోస్, లాల్ బహదూర్ శాస్త్రి, జయప్రకాశ్ నారాయణ్, రాం మనోహర్ లోహియా, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్‌గురు వంటి ప్రముఖుల సేవలను మోదీ గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య పోరాటం భారత్‌కు స్వేచ్ఛ కల్పించేందుకు మాత్రమే కాదని.. ప్రపంచ వ్యాప్తంగా చాలాచోట్ల వలసవాద విధానానికి చరమగీతం పాడేందుకు నిర్ణయాత్మకంగా మారిందని ప్రధాని గుర్తుచేశారు. 1942–1947 మధ్య స్వాతంత్ర్యం పొందేందుకు ప్రపంచమంతా సానుకూల వాతావరణం ఏర్పడిందని.. ఈరోజు మళ్లీ దేశానికి అనుకూలమైన వాతావరణమే కనపడుతోందన్నారు.

ప్రజలు బాధ్యతలు తెలుసుకోవాలి

ప్రతిష్టాత్మకమైన జీఎస్టీ అమలులో రాజకీయాలకు అతీతంగా పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణమైన మద్దతు తెలిపాయని మోదీ తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల విషయంలోనూ ఇలా అందరినీ కలుపుకుపోయే విధానాన్నే అనుసరిస్తామన్నారు. 'మనమంతా కలిసి అవినీతిని నిర్మూలించగలం. పేదలకు వారి హక్కులను అందించగలం. యువతకు ఉపాధి కల్పించగలం. పౌష్టికాహారలోపాన్ని అంతం చేయగలం. మహిళాసాధికారతకున్న అడ్డంకులను తొలగించగలం. నిరక్షరాస్యతను నిర్మూలించగలం. ఈ సంకల్పంతో ముందుకెళ్దాం' అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

దేశాన్ని ఏకం చేసేలా...: స్పీకర్

స్వాతంత్ర్యోద్యమంలో అందరినీ ఏకం చేసేందుకు క్విట్ ఇండియా ఉద్యమం చూపిన స్ఫూర్తితోనే మళ్లీ దేశాన్ని ఏకం చేయాల్సిన ప్రయత్నం అవసరమని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నారు. 'నాటి పోరాట యోధులు భారత్ ఛోడో (భారత్ వదిలి పెట్టండి) అని నినదించారు. నేడు మనం భారత్ జోడో (భారత్‌ను కలుపుదాం) నినాదాన్ని స్వీకరిద్దాం. దేశంలో సమగ్రాభివృద్ధి జరగాలన్న సమరయోధుల కలలను సాధించేందుకు మనం పనిచేయాల్సిన అవసరం ఉంది' అని చర్చలో స్పీకర్ పేర్కొన్నారు.

'హిందూ పాకిస్తాన్' వద్దు: ఏచూరి

'దేశం నుంచి మతతత్వం నిర్మూలించబడాలని ప్రధాని వ్యాఖ్యానించారు. అయితే ఈ దిశగా మనమేం చేస్తున్నామనేదే అసలైన ప్రశ్న' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాజ్యసభలో పేర్కొన్నారు. భారతదేశం హిందూ పాకిస్తాన్‌గా మారకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సాధనలో దేశ విభజన జరిగిన బాధాకర ఘటన గుర్తుకొస్తుందన్నారు.

చీకటి శక్తులతో ప్రమాదం



దేశ ప్రజాస్వామ్య మూలాలను చీకటి శక్తులు విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సంస్థలు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాయని.. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదని పరోక్షంగా ఆరెస్సెస్‌పై ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంపై చర్చలో సోనియా మాట్లాడుతూ.. 'దేశంలో విభజన, విద్వేషపూరిత రాజకీయాలే కనబడుతున్నాయి. రాజ్యాంగం చెప్పిన బహుళత్వం, సమసమాజ నిర్మాణం పదాలకు నేటి సమాజంలో చోటులేదు. లౌకిక, ప్రజాస్వామిక, స్వేచ్ఛా విలువలన్నీ ప్రమాదంలో పడ్డాయి. చర్చ, భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచే ప్రజావేదిక కుచించుకుపోతోంది. చీకటి శక్తులు బయటకొస్తున్నాయా? సమానత్వం, సామాజిక న్యాయం, న్యాయాధారిత వ్యవస్థ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ వంటి ప్రజాస్వామ్య మూలాలపై ఆధారపడిన దేశ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయా?' అని సోనియా ప్రశ్నించారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామ్యంలేని, క్విట్ ఇండియాను వ్యతిరేకించిన వ్యక్తులు, శక్తులు, సంస్థలను దేశం మరిచిపోకూడదన్నారు. 'సంకుచిత మనస్తత్వానికి బంధితమయ్యే, విచ్ఛిన్నకర, మతతత్వ సిద్ధాంతాలను మనం ఆమోదించవద్దు. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలనుకుంటే.. దీన్ని ప్రమాదంలో పడేస్తున్న శక్తులను ఓడించాలి. మతతత్వ శక్తులు విజయం సాధించకుండా మనం అడ్డుకోగలం, అడ్డుకుంటాం' అని పేర్కొన్నారు.

ఉభయసభల తీర్మానం

'125 కోట్ల మంది భారతీయులకు ప్రతినిధులుగా మేం.. మహాత్మాగాంధీ, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న భారతాన్ని 2022 నాటికి (దేశ స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు పూర్తయ్యే సందర్భంగా) నిర్మించటంలో ప్రతి పౌరుడిని కలుపుకుని పనిచేస్తాం. బలమైన, అభివృద్ధి చెందే, స్వచ్ఛమైన, దివ్యమైన, అవినీతి రహిత భారత నిర్మాణానికి మేం చిత్తశుద్ధితో పనిచేస్తాం. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడతాం. సామరస్యం, దేశభక్తిని పెంపొందించేందుకు పనిచేస్తాం' అని లోక్‌సభ తీర్మానం పేర్కొంది. రాజ్యసభలోనూ ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. బలమైన. స్వయంవర్ధక, లౌకిక, ప్రజాస్వామ్యవాద భారత నిర్మాణంలో భాగస్వాములవుతా మని సభ్యులు తెలిపారు. మహాత్మాగాంధీ పిలుపుతో యావద్భారతం క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొందని రాజ్యసభ చైర్మన్ అన్సారీ అన్నారు.

క్షిపణి దాడి చేస్తాం

అమెరికాకు ఉ.కొరియా హెచ్చరిక



సియోల్: పసిఫిక్ మహాసముద్రంలో అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరమైన గ్వామ్ ద్వీపం సమీపంలో క్షిపణి దాడి చేస్తామని ఉత్తర కొరియా హెచ్చరించింది. తమ క్షిపణి అభివృద్ధి కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉత్తర కొరియా తీవ్రంగా ప్రతిస్పందించింది. గ్వామ్ ద్వీపంపై మధ్యశ్రేణి ఖండాంతర క్షిపణి హ్వాసంగ్–12తో దాడికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఓ సైనికాధికారిని ఉటంకిస్తూ ఉత్తర కొరియా అధికారిక వార్తాసంస్థ కేసీఎన్ఏ పేర్కొంది. తమ అధినేత కిమ్ జాంగ్ ఉన్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణం అన్ని వైపుల నుంచి గ్వామ్‌పై విరుచుకుపడతామని తెలిపింది. మరోవైపు ఉత్తర కొరియా హెచ్చరికలపై ట్రంప్ దీటుగా స్పందించారు. 'అణ్వాయుధాలను ఆధునీకరించే ఫైలుపైనే అధ్యక్షుడిగా నా తొలి సంతకాన్ని పెట్టాను. ప్రస్తుతం అణ్వాయుధాల విభాగంలో అమెరికా ఎన్నడూ లేనంత శక్తిమంతంగా, బలంగా ఉంద'ని ట్వీట్ చేశారు. 'అమెరికాపై దాడి చేస్తామని ఇకపై హెచ్చరికలు చేయకుండా ఉంటేనే ఉత్తర కొరియాకు మంచిది. కిమ్ బెదిరింపులు హద్దులు దాటాయి. ప్రపంచం ఎన్నడూ చూడని విధ్వంసాన్ని ఉత్తర కొరియా చవిచూడాల్సి వస్తుంద'ని ట్రంప్ హెచ్చరించారు.



ఇటీవల పిల్లల చేతుల్లో తరచుగా కనిపిస్తున్న కొత్త ఆట వస్తువు ఫిడ్జెట్ స్పిన్నర్. ఫొటోలో ఉన్నది అత్యంత ఎక్కువసమయం తిరిగే స్పిన్నర్. ఒకసారి తిప్పితే ఏకంగా 12 నిమిషాలకుపైగా ఆగకుండా తిరుగుతుందట. జపాన్‌లోని ఎన్ఎస్‌కే సంస్థ దీన్ని చేసింది.

భారత్‌లో ఐదు సౌర విద్యుత్ కేంద్రాలు

లండన్: భారత్‌లోని మూరుమూల గ్రామాల్లో ఐదు స్వయం సమృద్ధ సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మొత్తం 12 బ్రిటీష్, భారత విశ్వవిద్యాలయాలకు 7 మిలియన్ పౌండ్ల (రూ. 58.09 కోట్లు)ను గ్రాంటుగా బ్రిటన్ ప్రభుత్వం అందజేసింది. ఈ గ్రాంటును కొత్త సోలార్ ప్రాజెక్టు 'సన్‌రైజ్' నిమిత్తం మంజూరు చేసింది. ఇందులో భాగంగా భారత్‌లో సౌరశక్తి పరికరాల కోసం కొత్త తయారీ విధానాన్ని అభివృద్ధి చేస్తారు.

ఇందిర హత్యకు రెండేళ్లముందే..!



వాషింగ్టన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు రెండేళ్ల ముందే దేశంలో రాజకీయ పరిస్థితులపై అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ (సీఐఏ) ఓ నివేదిక రూపొందించింది. ఒకవేళ ఇందిర హఠాత్తుగా చనిపోతే.. ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ సరైన వారసుడిగా పార్టీని, ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లలేడని అందులో పేర్కొంది. రాజకీయంగా అపరిపక్వత.. పార్టీలో, ప్రజల్లో అభిమానంలేని కారణంగా ఇందిర వారసత్వాన్ని కొనసాగించటంలో రాజీవ్ విఫలమవుతాడంది. 1983, జనవరి 14నాటి సీఐఏ నివేదిక.. ఇందిర హత్యానంతరం పార్టీలోని వివిధ గ్రూపుల కారణంగా పార్టీ చాలా బలహీన పడుతుందని తెలిపింది. 1984, అక్టోబర్ 31న ఇందిర అంగరక్షకుల చేతిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. 1980వ దశకం మధ్యలో భారత్‌లో రాజకీయ పరిస్థితులపై రూపొందించిన ఈ 30 పేజీల నివేదికలో 1985 ఎన్నికల్లో ఇందిర చాలా తక్కువ మెజారిటీతో గట్టెక్కవచ్చని చెప్పింది. ఒకవేళ ఇందిర చనిపోతే అనే అంశాలను విశదీకరిస్తూ.. 'రాజీవ్ ప్రధానిగా ఎంపికైనా.. పార్టీపై పట్టు సాధించటం కష్టమే. ఆయన తన మాట నెగ్గించుకోవాలంటే తల్లిలాగా అద్భుతమైన రాజకీయ వ్యూహకర్తగా తనను తాను మార్చుకోవాలి' అని పేర్కొంది. రాజీవ్ కాకపోతే.. పార్టీలోని సీనియర్ నేతలైన కేంద్ర మంత్రులు ఆర్.వెంకట్రామన్, పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, ఎన్డీ తివారీలు కూడా పీఎం రేసులో ఉంటారని చెప్పింది.

అహ్మద్ పటేల్‌కు 44 ఓట్లు

ఉత్కంఠభరిత పోరులో కాంగ్రెస్ నేత విజయం

- సునాయాసంగా గెలుపొందిన అమిత్ షా, స్మృతి ఇరానీ
- బీజేపీకి ఓటేసిన 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు



అహ్మద్‌పటేల్ గెలిచాక గాంధీనగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల ఆనందోత్సాహాలు

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: ఆద్యంతం ఉత్కంఠభరితంగా, వివాదాస్పదంగా సాగిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ ఎట్టకేలకు బీజేపీ అభ్యర్థి బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్‌పై విజయం సాధించారు. పటేల్‌కు 44 ఓట్లు, ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్న రాజ్‌పుత్‌కు 38 ఓట్లు వచ్చాయి. మంగళవారం రాష్ట్రం నుంచి మూడు స్థానాలకు జరిగిన పోలింగ్‌లో ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు భోలాభాయ్ గోహిల్, రాఘవ్‌జీభాయ్ పటేల్ బ్యాలట్ పత్రాలను తమ పార్టీ ప్రతినిధికి కాకుండా బీజేపీ చీఫ్ అమిత్‌షాకు చూపారని కాంగ్రెస్ ఆరోపించడం, టీవీ పుటేజీని పరిశీలించిన ఎన్నికల సంఘం వారి ఓట్లు చెల్లవని ప్రకటించడం తెలిసిందే. దీంతో ఒక అభ్యర్థి గెలవడానికి కావలసిన ఓట్ల సంఖ్య 45 నుంచి 44కు తగ్గింది. కాంగ్రెస్, బీజేపీ.. ఈసీని ఆశ్రయించిన అనంతరం అర్ధరాత్రి దాటాక కౌంటింగ్ నిర్వహించారు. బీజేపీ నుంచి రెండు స్థానాలకు పోటీ చేసిన ఆ పార్టీ చీఫ్ అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చెరో 46 ఓట్లు సాధించి సునాయాసంగా గెలుపొందారు. అమిత్ షా తొలిసారి రాజ్యసభలో ప్రవేశిస్తుండగా, ఇరానీ పెద్దల సభకు తిరిగి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి రాజకీయ సలహాదారైన పటేల్ ఐదోసారి రాజ్యసభలోకి అడుగుపెడుతున్నారు. పటేల్ విజయంతో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.

తుదుపరి లక్ష్యం అసెంబ్లీ ఎన్నికలు: పటేల్

'సత్యమే గెలుస్తుంది. ఈ నా విజయం మాత్రమే కాదు. అధికార దుర్వినియోగం, నిస్సిగ్గుగా వాడిన ధనబలం, కండబలాల ఉమ్మడి ఓటమి కూడా' అని పటేల్ గెలుపు అనంతరం ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు, ఒకే కుటుంబంలా కలసి పనిచేసిన శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. జేడీయూ ఎమ్మెల్యే చోటూ వాసవ తనకు ఓటేసినందుకు పటేల్ ఆ పార్టీ నేత శరద్ యాదవ్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. పటేల్ బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గాంధీనగర్‌లోని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. 'ఈ ఎన్నికలు నా జీవితంలో అత్యంత కష్టమైనవి. నా విజయం పార్టీ కార్యకర్తల్లో అమిత ఉత్తేజం నింపింది. ఈ ఏడాదిలో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 125 సీట్లు సాధించడమే మా తదుపరి లక్ష్యం' అని అన్నారు. పెద్ద పోరాటంలో గెలిచినందుకు పటేల్‌ను అభినందిస్తున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పటేల్‌ను శరద్ యాదవ్ కూడా అభినందించారు. కాగా, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవన్న ఈసీ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేస్తానని గుజరాత్ సీఎం విజయ్ రూపానీ చెప్పారు. మరోపక్క.. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓటేసిన తమ 8 మంది గుజరాత్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ఆరేళ్ల పాటు బహిష్కరించింది. వీరిలో శంకర్‌సిన్హ్ వాఘేలా, ఆయన తనయుడు మహేందర్ సిన్హ్, రాఘవ్‌జీ పటేల్, భోలాభాయ్ గోహిల్ తదితరులు ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన ఆరుగురిని కూడా బహిష్కరించాలని అధిష్టానానికి సిఫార్సు చేశానని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి అశోక్ గెహ్లాట్ తెలిపారు. ఈ ఆరుగురిలో ముగ్గురు బీజేపీలో చేరడం తెలిసిందే.

అమిత్ షా, ఇరానీలకు మోదీ అభినందన



అమిత్



స్మృతి

రాజ్యసభకు ఎన్నికైన అమిత్ షా, స్మృతి ఇరానీలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందిస్తూ ట్వీట్ చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా మూడేళ్లు పూర్తిచేసుకున్నందుకు కూడా షాను అభినందించారు. ఆయన సారథ్యంలో పార్టీ దేశంలో పలు ప్రాంతాలకు విస్తరించిందని కొనియాడారు.

కాంగ్రెస్ సమస్యల పరిష్కర్త

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న 67 ఏళ్ల అహ్మద్ పటేల్ గాంధీ–నెహ్రూ కుటుంబానికి నమ్మిన బంటు. కాంగ్రెస్‌లో సమస్యల పరిష్కర్తగా, వ్యూహనిపుణుడిగా పేరొందారు. పార్టీ బాధ్యతల్లో తలమునకలై ఉన్న ఆయన కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వంలో చేరాలన్న వినతిని మృదువుగా తోసిపుచ్చారు. భరూచ్ జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించిన పటేల్ స్వయంకృషితో రాజకీయాల్లో పైకెదిగారు. గుజరాత్ నుంచి ఏడు పర్యాయాలు(మూడుసార్లు లోక్‌సభకు, నాలుగుసార్లు రాజ్యసభకు) ప్రాతినిధ్యం వహించారు. 2004 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో యూపీఏ–1 ప్రభుత్వ ఏర్పాటుకు పార్టీలను కూడగట్టడంలో కీలక పాత్ర పోషించారు.


అదృష్టం కలిసొచ్చి..

అర్ధరాత్రి అటు గుజరాత్‌లోనూ, ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ హైడ్రామా.. ఎత్తులకు పైఎత్తులతో సాగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ దిగ్గజం అహ్మద్ పటేల్ గెలుస్తారా? లేదా? అన్న ఉత్కంఠ. చివరికి ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ఈసీ ప్రకటించడంతో 44 ఓట్లతో గట్టెక్కి ఊపిరి పీల్చుకున్నారు! దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన ఈ ఎన్నికల్లో పటేల్ తన బలంతో గెలిచారని అనేకంటే బీజేపీ మూడో అభ్యర్థికి ఓటేసిన కాంగ్రెస్ రెబల్స్ పొరపాటు వల్లే గట్టెక్కారని అనడం సబబుగా ఉంటుందేమో. తమ బ్యాలట్ పత్రాలను బహిరంగంగా ప్రదర్శించడం వారి పొరపాటు. ఈ ఎన్నికల్లో పటేల్ వేసుకున్న అంచనాలు తారుమారయ్యాయి. తమ క్యాంపులోని 44 మందికి తోడు ఇద్దరు ఎన్సీపీ, ఒక జేడీయూ ఎమ్మెల్యే మద్దతుతో తమ బలం 47కు చేరుతుందన్నది ఆయన అంచనా. కానీ చివరికి దక్కింది 44 ఓట్లే. రెబల్స్ ఎమ్మెల్యేల ఓట్లూ చెల్లి ఉంటే కోటా ఓటు(తొలి ప్రాధాన్య ఓట్లతో గెలవడానికి కావలసిన ఓట్ల సంఖ్య) 45గా ఉండేది. అదే జరిగి ఉంటే పటేల్‌కు 44 ఓట్లే వచ్చాయి కాబట్టి రెండో ప్రాధాన్య ఓట్ల ఆధారంగా విజేతను తేల్చే పరిస్థితి వచ్చేది. పటేల్ విజయావకాశాలూ తగ్గేవి.

సత్తా చూపలేకపోతున్న కాంగ్రెస్..

ఈ ఏడాది డిసెంబర్‌లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.19 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై ప్రజలల్లో సహజంగానే వ్యతిరేకత ఉంటుంది. పైగా రాష్ట్రంలో బీజేపీకి పటిష్ట నాయకత్వమూ లేదు. మోదీ హవా, అమిత్ షా వ్యూహరచనపైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి. రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న పటీదార్లు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. ఇలాంటి స్థితిలో విపక్ష కాంగ్రెస్ సమరోత్సాహంతో ఉండాలి. మిగతా పార్టీల నేతలనూ తనవైపు ఆకర్షించగలగాలి. రాజ్యసభకు పటేల్ ఎన్నిక నల్లేరు మీద నడక కావాలి. కానీ వాస్తవం మరోలా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామనే నమ్మకం లేక ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారు.

కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్‌ను రాజ్యసభ ఎన్నికల్లో ఓడించి అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆ పార్టీ శ్రేణులను నీరుగార్చాలని బీజేపీ వ్యూహం పన్నింది. జాతీయస్థాయి కీలకనేత ఓడిపోతే కాంగ్రెస్ డీలాపడుతుందని భావించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్‌లోని అసంతృప్త ఎమ్మెల్యేలను తనవైపు ఆకర్షించింది. వ్యూహం ఫలించడంతో ఇటీవలే కాంగ్రెస్‌ను వీడిన మాజీ సీఎం శంకర్‌సిన్హ్ వాఘేలా సహా మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ మూడో అభ్యర్థి బల్వంత్ సింహ్ రాజ్‌పుత్‌కు ఓటేశారు. ఈ ఎన్నికలకు ముందే ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశారు. దీంతో కాంగ్రెస్ ఆలస్యంగా మేలుకుని గత నెలాఖర్లో మిగిలిన 44 మంది ఎమ్మెల్యేలను బెంగళూరు రిసార్ట్‌కు తరలించింది. సోమవారం తిరిగి గుజరాత్‌కు తీసుకొచ్చి, ఓటేసేదాకా శిబిరంలోనే ఉంచింది. అయినప్పటికీ వీరిలో ఒకరు(కరమ్‌సింహ్ మక్వానా) బీజేపీకి ఓటేశారు! ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలే చెప్పారు. పటేల్‌తో సహా కాంగ్రెస్ నేతలెవరూ దీన్ని పసిగట్టలేకపోయారు. పటేల్‌కు 43 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు, మరొకటి ఇతర పార్టీ నుంచి పడింది. ఎన్సీపీ ఎమ్మెల్యే ఒకరు, జేడీయూ ఎమ్మెల్యే ఒకరు తాము పటేల్‌కు ఓటేశామని బాహాటంగా చెప్పారు. కానీ ఈ ఇద్దరిలో ఒకరు పటేల్‌కు వేయలేదని పటేల్ దక్కిన 44 ఓట్లు తేటతెల్లం చేస్తున్నాయి. వీరిద్దరూ పటేల్‌కు ఓసేసి ఉంటే 45 ఓట్లు దక్కేవి. ఈ ఇద్దరిలో ఎవరు పటేల్‌కు ఓటేశారన్నది మిస్టరీగా మారింది. ఈ మొత్తం తతంగంలో కాంగ్రెస్ మంగళవారం సాయంత్రం చూపిన కార్యదక్షత ఆ పార్టీ పరువు కాపాడింది. రెబల్ ఓట్లు చెల్లవంటూ చిదంబరం సహా పలువురు నేతలు ఈసీని కలసి గట్టి వాదనలు వినిపించారు. ఏదేమైనా పటేల్‌ది 'సాంకేతిక' విజయం మాత్రమేనని, సంబరాలు జరుపుకోవాల్సినంత ఘన విజయం కాదని నిపుణులు అంటున్నారు.



–సాక్షి నాలెడ్జ్ సెంటర్